ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం, అక్టోబర్ 23, 2025 | సంపుటి - 22 | సంచిక 31 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

# కోట్ల ఇసుక దందా..
# ఇంటి దొంగలే అండ!

- అంతర్గాం గోదావరి తీరం నుండి తీసి..
- కేశనాథ్ గుట్ల వెనకాల భారీ డంపులు
- హైదరాబాద్,జగిత్యాల,ఉట్నూరుకు రవాణా
- జేసీబి,03 టిప్పర్లతో పగలురేయి మైనింగ్
- జగిత్యాల జిల్లాలో సర్కారు ఖజానాకు చిల్లు
- రెవెన్యూ సహా ఓ మూడు శాఖలకు ముడుపులు

**కరీంనగర్ బ్యూరో అక్టోబర్ 22 ( నినాదం ):**

పట్టుకోవాల్సిన వాళ్లే పైసలకాశపడి అక్రమ ఇసుక రవాణాను ప్రోత్సహిస్తున్నారు.దీంతో ఇక తనకు అడ్డూ,అదపూ లేదనే ధీమాతో అక్రమార్కుడు రెచ్చిపోతున్నాడు. ఇష్టానుసారం కోట్లవిలువైన ఇసుకను అక్రమంగా అమ్ముకుంటూ సొమ్ముచేసుకుంటున్నాడు. గత కొంత కాలంగా సాగుతున్న ఈ తంతు దాదాపు అక్కడి అధికార బాధ్యులందరికీ తెలుసు, అయినా సదరు దందాను ఎవ్వరూ ఆపిన దాఖలాలు లేవ. వెరసీ అండగా ఉంటారు. ఇలా సొంత ఖజానా కొల్లగొట్టే వాళ్లకు ఇంటి దొంగలే తోడైనట్లు ప్రభుత్వ శాఖల బాధ్యులు తయారయ్యారు. ఇదంతా మరెక్కడోకాదు జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలో జరుగుతున్నదే.

**ఇక్కడి కేశనాథ్ గుట్ల సమీపంలో పెద్ద మొత్తంలో సాగుతున్న అక్రమ ఇసుక మాఫియాపై నినాదం ప్రత్యేక కథనం...**



### దందా జరుగుతున్న తీరిది

జిల్లాలోని రాయపట్నంకు చెందిన ఓ వ్యక్తి తన ఇద్దరు కొడుకులతో కలిసి ఈ యవ్వారం మొదలెట్టాడు. నలుగురు గుమాస్తాలు,ఒక జెసిబి,మూడు టిప్పర్లతో నిరంతరం ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నాడు.జిల్లాలోని ధర్మపురితో పాటు, పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ,ముర్మూరు, గోదావరి తీరంనుండి ట్రాక్టర్లతో వేలాది ట్రిప్పుల ఇసుక కేశనాథ్ గుట్ల సమీపంలో డంపు చేస్తాడు. అటుపై సమయానుకూలంగా హైదరాబాద్,జగిత్యాల,ఉట్నూరు తదితర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటాడు. కాగా టిప్పరు డంపు వద్దకు చేరే ముందు, లోడైన అనంతరం ఓ కారుతో కొంత దూరం ఎస్కాట్ ఏర్పాటు చేసి. ఆపై హైవే ఎక్కిస్తాడు.

### ప్రతీనెలా మామ్మూళ్లిస్తున్నాడట?

కాగా ఇతగాడి ఈ అక్రమ వ్యవహారంపై స్థానికులెవరైనా ప్రశ్నిస్తే, ఇవ్వాల్సిన వాళ్లందరికీ ప్రతీ నెలా మామూళ్లిస్తున్నా ఇంక నన్నెవరేం చేస్తారు అంటూ బాహాటంగానే చెబుతున్నాడట. అతని మాటలు విన్న పలువురు విస్మయానికి గురవుతున్నారు. ప్రభుత్వ ప్రకృతి సంపద, కోట్ల విలువైన ఇసుకను సొంత అధికారులే అక్రమార్కులకు అప్పగించటంపై తీవ్రంగా మండిపడుతున్నారు.



### ఉన్నతస్థాయి అధికారులు దృష్టిసారించాలి

వనరుల సక్రమ వినియోగం, ఆర్థిక క్రమశిక్షణే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకెళుతున్నారు.కానీ ఇలాంటి కొందరు అవినీతి అధికారుల మూలంగా ఆయన ఆశయానికి తూట్లు పడుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కనుక ఇటువంటి వారిపై ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని సామాజికవాదులు కోరుతున్నారు. తద్వారా ఇక్కడి ఇసుక దొంగల ముఠా, వారికి సహకరిస్తున్న అధికారుల సంగతి తేల్చి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**కాగా ఒకటి రెండు సార్లు కేసులు నమోదైనా ఈ తంతు ఎందుకు ఆగటంలేదు అక్రమార్కుడు అవలంబిస్తున్న టెక్నిక్ లు ఏంటనే మరింత సమాచారం నినాదం తర్వాతి సంచికలో..**

# తెలంగాణ రవాణా చెక్ పోస్టుల ఎత్తివేత

- సీఎం ఆదేశాలతో తక్షణ చర్యలు
- ఆగమేఘాలమీద రవాణా శాఖ నిర్ణయం
- నంబర్ ప్లేట్ రికగ్నేషన్ అమలు



**హైదరాబాద్,అక్టోబర్22(నినాదం):**

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రహదారులపై ఉన్న రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంచలన ఆదేశాలిచ్చారు. దీంతో తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సాయంత్రం 5 గంటల్లోగా మూసివేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం రేవంత్ ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఆకస్మిక, తక్షణ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించు కోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డీటీవోలకు సూచించారు. అలాగే చెక్ పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, పరికరాలు, ఫర్నిచర్‌ను డీటీవో కార్యాలయాలకు తరలించాలని ఆదేశించారు.

▸▸తరువాయి 2లో..

## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

- బిసి రిజర్వేషన్లు.. స్థానిక ఎన్నికలపై చర్చ
- కీలక నీర్ణయాలు తీసుకునే అవకాశం

తెలంగాణ మంత్రి వర్గంసీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాయలంలో సమావేశం కానుంది. మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై కేబినెట్ చర్చించనుంది.

## తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టండి

- దిగ్గజ సంస్థ 'ఒరికా'కు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం
- ఆస్ట్రేలియాలో సీఈఓ, ఎండీ సంజీవ్ గాంధీతో ప్రత్యేక భేటీ

2

# గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా తెలంగాణ

- లైఫ్ సైన్సెస్ రంగంలో మరో ముందడుగు
- నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చే వ్యూహాత్మక భాగస్వామ్యం
- ఆస్ట్రేలియా యూనివర్సిటీ 'ఆర్ఎంఐటీ'తో రాష్ట్ర ప్రభుత్వం ఎల్ వోఐ
- ఇన్నోవేషన్, ఆర్అండ్ డీ, నైపుణ్యాభివృద్ధిలో ద్వైపాక్షిక సహకారం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి




**హైదరాబాద్,అక్టోబర్22(నినాదం):**

అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్' గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లోని ప్రముఖ యూనివర్సిటీ 'ఆర్ఎంఐటీ'తో రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ వోఐ)ను కుదుర్చుకుందని చెప్పారు. ▸▸తరువాయి 2లో..

## రౌడీషీటర్ వేధింపులతో యువతి ఆత్మహత్య

**ఖమ్మం,అక్టోబర్22(నినాదం):**

తన కోరిక తీర్చాలని కొంతకాలంగా వెంటపడటమే కాకుండా.. రెచ్చిపోయి బలవంతం చేయబోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్యకు పాల్పడిరది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం పంచాయతీ జగ్యాతండాకు చెందని బోడ సుశీల(28)పై ఆమె ఇంటి ఎదురుగా ఉండే రౌడీ షీటర్ ధరావత్ వినయ్ కొంతకాలంగా కన్నేశాడు.



2

## మనస్తాపంతో భార్య, బాధతో భర్త ఆత్మహత్య

- ప్రేమించి పెళ్లి చేసుకున్న కొద్దిరోజులకే విషాదం

**హైదరాబాద్,అక్టోబర్22(నినాదం):**

ఆరేళ్లుగా ప్రేమించి పెద్దలను ఒప్పించి మరీ పెళ్లి చేసుకున్నారు. కానీ చిన్న చిన్న విషయాలకే మనస్తాపానికి గురై ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దసరా రోజు భర్త తిట్టాడనే మనస్తాపంతో పెళ్లయిన వారం రోజులకే క్షణికావేశంలో భార్య బలవన్మరణానికి పాల్పడిరది. తన వల్లే తన అర్ధాంగి చనిపోయిందనే మనస్తాపంతో దీపావళి నాడు భర్త కూడా తనువు చాలించాడు. అలా సక్సెస్ అయ్యిందనుకున్న వారి లవ్‌స్టోరీ.. పెళ్లయిన నెలలోపే విషాదాంతంగా మారింది.

2




## తాగిన మైకంలో తండ్రిని కడతేర్చిన కొడుకు

**హైదరాబాద్, అక్టోబర్22(నినాదం):**

తాగిన మైకంలో కన్నతండ్రిని అతిదారుణంగా హత్య చేసిన ఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం అచయిపల్లి గ్రామానికి చెందిన నిజాముద్దీన్.. తన కుమారుడు షేక్ సాతక్‌తోపాటు అతడి స్నేహితుడితో కలిసి మంగళవారం రాత్రి మద్యం సేవించారు. అనంతరం ఆ మద్యం మత్తులో తండ్రి కొడుకుల మధ్య మాటమాట పెరిగింది. దీంతో వారిద్దరు ఘర్షణకు దిగారు. పక్కనే ఉన్న బండరాయి తీసుకుని.. కన్నతండ్రిపై దాడి చేశాడు. ఈ ఘటనలో తండ్రి నిజాముద్దీన్ అక్కడికక్కడే మృతి చెందారు.

## కుంభమేళా తరహాలో మేడారం మహాజాతర




- అధికారులు సమన్వయంతో సక్సెస్ చేయాలి
- గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**

కుంభమేళా తరహాలో నిర్వహించే మేడారం మహాజాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ తెలిపారు. మేడారం మహాజాతర ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకి గిరిజన సంక్షేమ శాఖ రూ. 150.00 కోట్లు మంజూరు చేయగా అందులో రూ. 90.00 కోట్లు సివిల్ వర్క్స్ కు, రూ. 60.00 నాన్ సివిల్ వర్క్స్ కు కేటాయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సివిల్ వర్క్స్ స్టేటస్, నాన్ సివిల్ వర్క్స్ యాక్షన్ ప్లాన్ మీద సమీక్ష నిర్వహించారు. ములుగు కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి ఆయన మాట్లాడారు.

2

## సృష్టి ఫెర్టిలిటీ కేసులో స్పీడ్ పెంచిన ఈడీ




**హైదరాబాద్,అక్టోబర్22(నినాదం):**

రాష్ట్రంలో ఒక్కసారిగా సంచలనం రేకెత్తించిన సృష్టి ఫెర్టిలిటీ కేసుల్లో ఈడీ అధికారులు స్పీడ్ పెంచారు. ఇప్పటికే చంచల్‌గూడ మహిళా జైల్లో రిమాండ్‌లో ఉన్న నిందితులు డాక్టర్ నమ్రత, కల్యాణి, సంతోష్, నందినిని ఈడీ అధికారులు విచారిస్తున్నారు. అలాగేఈ కేసులో ప్రధాన నిందితుడు డాక్టర్ నమ్రత కుమారుడు జయంత్‌కృష్ణను సైతం ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు.

## శ్రీలంకలో మున్సిపల్ ఛైర్మన్ కాల్చివేత

### ప్రజాసమస్యలు తెలుకుంటుండగా దుండగుల కాల్పులు



**కొలంబో, నినాదం:**

శ్రీలంకకు చెందిన ఓ రాజకీయ నేత పార్టీ ఆఫీస్‌లో దారుణ హత్యకు గురయ్యారు.వెలిగామా కౌన్సిల్ ఛైర్మన్ లసంత విక్రమశేఖర (38) బుధవారం తన కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమయంలో ఇద్దరు దుండగులు ఆఫీస్‌లోకి చొరబడ్డారు. తమ వద్ద ఉన్న గన్‌తో విక్రమశేఖరపై పలురౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన విక్రమశేఖరను ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని.. పోలీసులు వెల్లడించారు. దాడికి కారణాలు తెలియాల్సి ఉంది.

2

## త్వరలోనే చోక్సీ అప్పగింత

- కీలక వ్యాఖ్యలు చేసిన బెల్జియం కోర్టు

**న్యూఢిల్లీ, నినాదం:**



పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీని భారత్‌ను తీసుకువచ్చేందుకు మార్గం సుగమమైంది. చోక్సీని భారత్‌కు అప్పగించే విషయంలో బెల్జియం కోర్టు బుధవా రం కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, బెల్జియన్ చట్టాల ప్రకారం చోక్సీని భారత్‌కు అప్పగించడంలో ఎలాంటి అడ్డం కులు లేవని స్పష్టం చేసింది. బెల్జియంలోని ఆంట్వెర్ప్‌లోని ఒక కోర్టు తన తీర్పులో చోక్సీ నేరాలు భారత శిక్షాస్మృతిలోని

2

## తుని గురుకుల పాఠశాలలో దారుణం

**అమరావతి, నినాదం:**

బాలికకు మాయమాటలు చెప్పి పాఠశాల నుంచి బయటకు తీసుకెళ్లి ఓ కామాంధుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన తుని బాలికల గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఎనిమిదో తరగతి చదువుతున్న మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి స్కూల్ నుంచి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన నిందితుడు.. ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. విషయం తెలిసిన బాలిక బంధువులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

5

## ఏపీకి సాయం అందుతోంది..

- లక్షా 80వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు
- బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్

**అమరావతి, నినాదం:**



ఏపీకి కేంద్రం నుంచి లక్షన్నర కోట్ల సాయం అందిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు మాధవ్ తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. లక్షా 80వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. రూ.11,444 కోట్లతో విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి నిధులు కేటాయించారని చెప్పారు.

### రౌడీషీటర్ వేధింపులతో
## యువతి ఆత్మహత్య

ఆమెను తరచూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో పత్తి తీసేందుకు సుశీల మరో మహిళతో కలిసి సోమవారం నాడు కొణిజర్ల మండలం అమ్మపాలెం వెళ్లింది. అక్కడ సుశీలను గమనించిన రౌడీషీటర్ ధరావత్ వినయ్ ఆమె దగ్గరకు వెళ్లాడు. తన కోరిక తీర్చాలని వేధింపులకు దిగాడు. సుశీల ప్రతిఘటించడంతో ఆమెపై దాడికి పాల్పడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన సుశీల ఇంటికి వచ్చిన తర్వాత ఉరేసుకుంది. వినయ్ వేధింపుల వల్లే తన భార్య ఆత్మహత్య చేసుకుందని సుశీల భర్త శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే సుశీల మృతిపై ఆమె బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుశీల ఒంటిపై గాయాలు ఉన్నాయని, శవపరీక్షలో వాటిని పరిగణనలోకి తీసుకోలేదని, ఉరేసుకుని మరణించిందని మాత్రమే వైద్యులు చెబుతున్నారని ఆరోపించారు. ఈ కేసును పక్కదారి పట్టిస్తున్నారని ఆందోళనకు దిగారు.

### మనస్తాపంతో భార్య,
## బాధతో భర్త ఆత్మహత్య

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామంలోని వడ్డెర కాలనీలో ఎదురెదురు ఇండ్లలో ఉండే సంతోష్, గంగోత్రి ఆరేళ్లుగా ప్రేమించుకున్నారు. తమ ప్రేమను పెద్దలకు చెప్పి ఒప్పించి సెప్టెంబర్ 26న పెళ్లి కూడా చేసుకున్నారు. దసరా పండుగ కావడంతో ఈ నెల 2వ తేదీ న దంపతులిద్దరూ గంగోత్రి ఇంటికి వెళ్లారు. అక్కడ మాంసం కూరలో కారం ఎక్కువైందని గంగోత్రిని సంతోష్ మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన గంగోత్రి.. అదే రోజు రాత్రి అత్తారింటికి వెళ్లాక దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న అమ్మాయి తన కారణంగానే తనువు చాలించిందని సంతోష్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మనసు బాగోలేకపోవడంతో దీపావళి పండక్కి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నివాసం ఉండే తన అక్క దగ్గరకు వెళ్లాడు. అక్కడే మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. ఇలా భార్యాభర్తలిద్దరూ కూడా నెలలోపే మరణించడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

## తాగిన మైకంలో తండ్రిని కడతేర్చిన కొడుకు

ఈ ఘటనపై పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని నిందితుడు షేక్ సాతక్‌తోపాటు అతడి స్నేహితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక నిజాముద్దీన్ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని.. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నిజాముద్దీన్ కుటుంబ సభ్యులు.. ఆసుపత్రికి చేరుకున్నారు.

## సృష్టి ఫెర్టిలిటీ కేసులో స్పీడ్ పెంచిన ఈడీ

గతంలో సృష్టి ఫెర్టిలిటీకి సంబంధించిన వ్యవహారంలో మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. రాజస్థాన్‌కు చెందిన దంపతులు సికింద్రాబాద్ నార్త్ జోన్‌లోని గోపాలపురం పోలీసులను ఆశ్రయించి.. సృష్టి ఫెర్టిలిటీ ఆసుపత్రి వైద్యురాలి డాక్టర్ నమ్రతపై ఫిర్యాదు చేశారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు సృష్టి ఫెర్టిలిటీ ఆసుపత్రి చేస్తున్న మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి. వారి వద్ద నుంచి రూ. 20 నుంచి 40 లక్షల వరకు నగదును డాక్టర్ నమ్రతా వసూలు చేసినట్లు గుర్తించారు. ఇక అబార్షన్ కోసం వచ్చే మహిళలకు నగదు ఆశ చూపి.. వారి వద్ద నుంచి సైతం పిల్లలను కొనుగోలు చేసినట్లు సమాచారం. మొత్తం 86 మంది పిల్లలను విక్రయించడం ద్వారా.. రూ. 50 కోట్ల నగదు డాక్టర్ నమ్రతా సంపాదించినట్లు తెలుస్తుంది. ఈ మొత్తం నగదును హవాలా రూపంలో సేకరించింది. వీటితో భారీగా ఆస్తులు కొనుగోలు చేయడమే కాకుండా.. విదేశాలకు సైతం పెద్ద ఎత్తున హవాలా రూపంలో నగదు పంపినట్లు ఈడీ అధికారులు గుర్తించారు.ఆ క్రమంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు వ్యవహారం బహిర్గమైంది. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగారు. ఈ సోదాల్లో భాగంగా హైదరాబాద్‌లో ఐదు చోట్ల, విజయవాడ, విశాఖపట్నంలో రెండు చోట్ల సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు బ్యాంక్ అకౌంట్లతో పాటు సృష్టి రికార్డులను సైతం స్వాధీనం చేసుకున్నారు. పిల్లలు లేని జంటలను లక్ష్యంగా చేసుకుని డాక్టర్ నమ్రతా వ్యవహారాలు నడిపినట్లు ఈడీ అధికారులు గుర్తించారు.

## త్వరలోనే
## చోక్సీ అప్పగింత : బెల్జియం కోర్టు



సెక్షన్లు 120–, 201, 409, 420, 477కింద చట్టం ప్రకారం శిక్షార్హమైనవని తెలిపింది. చోక్సీపై మోసం, దుర్వినియోగం, ఫోర్జరీ అభియోగాలు బెల్జియన్ చట్టం ప్రకారం కూడా శిక్షార్హమైనవని కోర్టు స్పష్టం చేసింది. ఛోక్సీ బెల్జియం పౌరుడు కాదని గుర్తుచేసింది. నేరాలు 2016 డిసెంబర్ 31.. ఒకటి జనవరి 2019 మధ్య భారత్‌లో జరిగాయని.. బెల్జియన్ చట్టం ప్రకారం ప్రాసిక్యూషన్ కాల పరిమితికి లోబడి ఉండదని తీర్పు స్పష్టం చేసింది. అయితే, భారత్ ఆదేశాలకు తనను ఆంటిగ్వా నుంచి కిడ్నాప్ చేశారంటూ చోక్సీ చేసిన వాదలను కోర్టు తోసిపుచ్చింది. ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవంటూ కొట్టిపడేసింది. చోక్సీ అప్పగింత అనంతరం అతడిని ఉంచే జైలుకు సంబంధించి భారత ప్రభుత్వం అందించిన వివరాలను ఈ సందర్భంగా కోర్టు ప్రస్తావించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలను ఎగ్గొట్టిన చోక్సీ, మేనల్లుడు నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారు. చోక్సీ ఆంటిగ్వా బార్బుడాకు పారిపోగా.. నీరవ్‌మోదీ లండన్‌లో ఉంటున్నాడు. ఇటీవల అంట్వర్ప్‌లోని కోర్టు చోక్సీని భారత్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలిపింది. భారత్‌కు చోక్సీని అప్పగిస్తే ఆయనను ముంబయిలోని ఆర్థర్ రోడ్ జైలులోని బ్యారక్ నెంబర్ 12లో ఉంచుతామని అధికారులు కోర్టుకు హామీ ఇచ్చారు. బ్యారక్ దాదాపు 46 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుందని.. రెండు సెల్‌లు, ప్రైవేట్ టాయిలెట్ సౌకర్యాలు ఉన్నాయని.. వైద్య సహాయం ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే, తాను అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నానని.. సరైన చికిత్స అందదని చోక్సీ చేసిన వాదనలు కోర్టు తోసిపుచ్చింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను రూ.13వేలకోట్లకుపైగా మోసం చేసి చోక్సీ, నీరవ్ మోదీ దేశం విడిచి పరారయ్యారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆయనను భారత్‌కు తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. భారత్ విజ్ఞప్తి మేరకు బెల్జియం పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత భారత్ ఆంట్వెర్ప్ కోర్టులో భారత్‌కు అప్పగించాలని పిటిషన్ వేసింది. ఆ తర్వాత చోక్సీ పలుసార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేయగా కోర్టు తిరస్కరిస్తూ వచ్చింది. హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ గతంలో చోక్సీ నిర్బంధం, ఆరోగ్య సంరక్షణ విషయంలో బెల్జియంకు పలు హామీలు ఇచ్చింది.

# తెలంగాణ రవాణా చెక్ పోస్టుల ఎత్తివేత

మొదటిపేజీ తరువాయి

అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని హుకుం జారీ చేశారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో అవినీతి రవాణా అవుతోంది. కొందరు అధికారులు ప్రైవేటు సిబ్బందిని పెట్టుకుని యథేచ్ఛగా అక్రమ వసూళ్లు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని రవాణాశాఖ చెక్‌పోస్టులను రద్దు చేస్తూ జులై ఆఖరి వారంలోనే రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. నెలరోజులు ఆలస్యంగా జీఓ జారీ అయ్యింది. ఉత్తర్వులు వచ్చి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా చెక్‌పోస్టులను ఇంకా తొలగించలేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక చెక్‌పోస్టుల అవసరం దాదాపుగా తగ్గింది. కేంద్రం సూచనల మేరకు దేశంలోని అనేక రాష్ట్రాలుసంవత్సరాల క్రితమే చెక్‌పోస్టులను రద్దు చేశాయి. కానీ తెలంగాణలో కొనసాగుతున్నాయి. ఏడాదిన్నర క్రితమే తెలంగాణలో చెక్‌పోస్టుల రద్దుకు రవాణాశాఖ నిర్ణయం తీసుకున్నా.. కొందరు అధికారుల బలమైన ఒత్తిళ్ల కారణంగా ఇన్నాళ్లు ఆ నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు రెండు నెలల క్రితం జీఓ జారీ అయినా అవినీతి అధికారుల తీరు మారలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టులు రద్దు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టులను ఎత్తివేసిన ప్రభుత్వం వాటి స్థానంలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిజేషన్ (ఏఎన్‌పీఆర్) అనే అడ్వాన్స్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానుంది. ఈ అడ్వాన్స్?డ్ కెమెరా సిస్టమ్ హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ లో ఉన్న ప్రధాన రవాణా శాఖ ఆఫీస్‌కు అనుసంధానమై ఉంటుంది. దీంతో రవాణా శాఖలో పారదర్శకత స్పష్టంగా కనిపించనున్నది.

అయితే, ప్రస్తుతం డ్యూటీ చేస్తున్న సిబ్బందికి కొత్త బాధ్యతలు అప్పగించనున్నారు. ఏ వెహికల్ అయినా కెమెరా కండ్లుగప్పి ఇతర మార్గాల ద్వారా రాష్ట్రంలోకి వస్తే.. వాటిని జాతీయ రహదారులపై అడ్డుకొని చర్యలు తీసుకునేందుకు వీలుగా మొబైల్ స్క్వాడ్‌లను కూడా రంగంలోకి దింపనున్నారు. ఈ వ్యవస్థపై ముందుగా గూడ్స్ ట్రాన్స్?పోర్ట్ చేసే వాహన యజమానుల అసోషియేషన్ కు ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించ నున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్యాసింజర్ వెహికల్స్‌తో పాటు సరకు రవాణా వాహనాల పర్మిట్లు, మిగిలిన అనుమతులన్నీ ముందే ఆన్ లైన్ లో పొందేలా రాష్ట్ర రవాణా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అనుమతుల్లేకుండా లేదా నిబంధనలు ఉల్లంఘించి రాష్ట్రంలోకి ప్రవేశిస్తే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఇప్పటి వరకు 15 చెక్ పోస్టుల అంతరాష్ట్ర చెక్ పోస్టుల దగ్గర విధుల్లో ఉన్న సుమారు 70 మంది ఎంవీఐలు, ఏఎంవీఐలు, ఇతర సిబ్బందిని ప్రస్తుతం రవాణా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించనున్నారు. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత జాతీయ రహదారులపై రవాణా సమస్యలు లేకుండా, సాఫీగా ప్రయాణం జరిగేందుకు వీలుగా చెక్ పోస్టులను ఎత్తేయాలని గతంలోనే కేంద్రం ఆయా రాష్ట్రాలను ఆదేశించింది.



### నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

తెలంగాణ మంత్రి వర్గంసీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాయలంలో సమావేశం కానుంది. మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై కేబినెట్ చర్చించనుంది. దీంతో ఇటీవల భేటీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధన ఆర్డినెన్సుకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అలాగే, ఎస్ఎల్‌బిసి పునరుద్ధరణ పనులు, ఎస్ఆర్ఎస్‌పి రెండో దశకు రాంరెడ్డి దామోదర రెడ్డి పేరు, కాళేశ్వరం పునరుద్ధరణ సహా పలు ప్రాజెక్టు పనుల పై మంత్రి వర్గం చర్చించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలపై గురువారం జరిగే సమావేశంలో మంత్రి వర్గం తుది నిర్ణయం తీసుకోనుంది. పాత పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలా? లేదా 42 శాతం రిజర్వేషన్లతో వెళ్లాలా? అనేది దానిపై కేబినెట్ చర్చించనుంది. కాగా ఇప్పటికే ఈ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయనిపుణ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని న్యాయస్థానాల్లో కొట్లాడేందుకు రేవంత్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేందుకు.. ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతకు ఏ పథకం అమలు చేస్తారన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే రాష్ట్ర మంత్రి వర్గం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుదనేది ఆసక్తిగా మారింది.

# తెలంగాణలో 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ'

- విదేశీ వర్సిటీల కోసం 'ప్లగ్ అండ్ ప్లే' క్యాంపస్
- రాష్ట్రంలో ఏర్పాటుకు ఆస్ట్రేలియా విద్యాసంస్థ 'వీఐటీ' ఆసక్తి
- ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేక భేటీ

**హైదరాబాద్,అక్టోబర్22(నినాదం):**

తెలంగాణలో 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ'ని ఏర్పాటు చేసేందుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యా సంస్థ విక్టోరియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ) ఆసక్తి చూపిస్తోంది. ఈ మేరకు ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మెల్‌బోర్న్ లో బుధవారం వీఐటీ బోర్డు సభ్యుడు, మాజీ పార్లమెంటేరియన్, ప్రస్తుత ఆస్ట్రేలియా ప్రధాని సన్నిహితుడు అలన్ గ్రిఫిన్ ప్రత్యేకంగా కలిశారు. అంతర్జాతీయ విద్యా, నైపుణ్య కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలు, ఇక్కడి అనుకూలతలు, ప్రగతిశీల విధానాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, తెలంగాణ యువత ప్రతిభ, సమర్ధవంతమైన నాయకత్వం తదితర అంశాలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వారికి వివరించారు. అనంతరం 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ' ఏర్పాటు ప్రతిపాదనపై సుదీర్ఘంగా చర్చించారు. విదేశీ వర్సిటీలు, ఉన్నతస్థాయి పరిశోధన కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలకు 'గ్లోబల్ హబ్' గా ఈ క్యాంపస్ ను అభివృద్ధి చేస్తామని 'విట్' ప్రతినిధులు మంత్రి శ్రీధర్ బాబుకు చెప్పారు. సదరు సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వహించుకునేలా 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రతిపాదనపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. స్థల పరిశీలన, తదుపరి చర్చల కోసం తెలంగాణకు రావాలని ఆహ్వానించారు. సమావేశంలో వీఐటీ ప్రతినిధి అర్జున్ సూరపనేని, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



### తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టండి

దేశంలోనే పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న దిగ్గజ సంస్థ 'ఒరికా' ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లో పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో అంతర్జాతీయ అగ్రగామిగా ఉన్న ఆ సంస్థ సీఈఓ, ఎండీ సంజీవ్ గాంధీ, ఇతర ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో 'ఒరికా' ప్రస్తుత కార్యకలాపాలు, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. 'ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. జీసీసీలు, పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎకో సిస్టమ్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం అందుబాటులో ఉంది' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కంపెనీ ప్రతినిధులకు వివరించారు. ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్, సస్టెయినబిలిటీ, మాన్యుఫాక్చరింగ్, మైనింగ్ రంగాల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. 'పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ, అమలు చేస్తున్న ప్రోత్సాహకర, ప్రగతిశీల విధానాలు అభినందనీయం. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జీసీసీలో డిజిటల్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ తదితర రంగాల్లో 600 మంది హై స్కిల్డ్ నిపుణులకు ఉద్యోగాలు కల్పించాం. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తెలంగాణలో కార్యకలాపాల విస్తరణ, వివిధ రంగాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ఒరికా సంస్థ సీఈఓ, ఎండీ సంజీవ్ గాంధీ తెలిపారు. 'ఆస్ బయోటెక్ 2025 ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్'లో కీలకోపన్యాసం చేసేందుకు ఆస్ట్రేలియాకు విచ్చేసిన మంత్రి శ్రీధర్ బాబును కంపెనీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

### 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్' గా తెలంగాణ

లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్, పరిశోధన, అభివృద్ధి, ఉన్నత విద్య, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్ తయారీ తదితర అంశాల్లో ద్వైపాక్షిక సహకారానికి ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. రేపటి జీనోమ్ వ్యాలీకి ఇది ఒక బ్లూ ప్రింట్ గా మార్గ నిర్దేశం చేస్తుందన్నారు. ఆసియాలోనే అగ్రగామిగా ఎదిగిన తెలంగాణ "లైఫ్ సైన్సెస్" ఆర్థిక వ్యవస్థను 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 80 బిలియన్ డాలర్ల విలువ చేసే 2వేలకు పైగా జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ ఫార్మా, బయోటెక్ కంపెనీలు ఇక్కడ ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే ఔషధాల్లో మన వాటా 40 శాతంగా ఉందన్నారు. ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్లలో మూడింట ఒక వంతును మనమే అందిస్తున్నామన్నారు. 'ఎలీ లిల్లీ' లాంటి దిగ్గజ ఫార్మా సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తెలంగాణ యువతను లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పరిశోధక విద్యార్థులు బిట్స్ హైదరాబాద్, ఆర్ఎంఐటీ యూనివర్సిటీలలో నిపుణుల మార్గ నిర్దేశంలో రీసెర్చ్ చేసే అవకాశం లభిస్తుందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉమ్మడి అకడమిక్ కరిక్యులంను రూపొందించి విద్యార్థులను రేపటి అవసరాలకు అనుగుణంగా స్కిల్డ్ వర్క్ ఫోర్స్ గా తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈఓ శక్తి నాగప్పన్, ఆర్ఎంఐటీ యూనివర్సిటీ డిప్యూటీ వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపౌలోస్ లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై సంతకాలు చేశారు. తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం సంతోషంగా ఉందని ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపౌలోస్ అన్నారు. ఈ ఒప్పంద ద్వారా లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ గా మారుతుందన్నారు.

# రెండేళ్లలో ఉస్మానియా ఆస్పత్రి పూర్తి

**ఆధునిక పద్ధతుల్లో అవసరాల మేరకు నిర్మాణాలు**
**ఆస్పత్రికి అసవరమైన వైద్య పరికారలు సిద్ధం చేయాలి**
**ప్రజలకు ఇబ్బంది లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలి**
**అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు**

**హైదరాబాద్, నినాదం:**

గోషామహల్ వద్ద చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్షించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సీఎం సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పది రోజులకోసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పనుల వేగవంతానికి సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రానున్న వందేళ్ల అవసరాలకు తగిన సదుపాయాలతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి ఉండాలని.. ఆధునిక వైద్య పరికరాలతో అత్యాధునిక సదుపాయాలు కల్పించాలని వెల్లడిరచారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్మాణ సమీక్ష చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేశారు. స్థానికులకు ఇబ్బంది లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ ఆసుపత్రుల పనుల పర్యవేక్షణకు అధికారుల నియామకం జరిగిందన్నారు. వచ్చే జూన్ నాటికి అన్ని మెడికల్ కళాశాలలు, ఆసుపత్రుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్, భద్రతా ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని పోలీసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సమావేశానికి సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాసరాజు, శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఎంఏ అండ్ యూడీ సెక్రటరీ ఇలంబర్తి, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో 32ఏళ్ల జైలు

**నల్లగొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు**

**నల్లగొండ, నినాదం:**

పోక్సో కోర్టు సంచలన తీర్పునిచ్చింది. మైనర్‌పై అత్యాచారం కేసులో దోషికి 32యేళ్ల జైలు శిక్ష విధించింది. శిక్షతోపాటు 75వేల రూపాయల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ఇంఛార్జీ జడ్జి రోజారమణి తీర్పును వెలువరించింది. 2022 లో నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జరిగిన బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో ఈతీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే.. 2022 సెప్టెంబర్ 20న నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం కు చెందిన బాలిక నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కిడ్నాప్‌నకు గురైంది. పోలీసుల విచారణలో పానగల్ కు చెందిన గురిజాలా చందు ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో చందుపై అదే రోజు నల్లగొండ టూ టౌన్ పీఎస్ లో బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు పోలీసులు. దఫాలుగా కేసు విచారణ చేపట్టిన నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు.. తుది తీర్పును బుధవారం వెలువరించింది. సాక్ష్యాలు విన్న తర్వాత తుది తీర్పు వెల్లడిరచిన న్యాయమూర్తి రోజారమణి.. నిందితుడు చందూను దోషిగా తేల్చింది.. అతనికి 32ఏళ్ల కారాగార శిక్ష విధించింది. 75వేల రూపాయల జరిమానాతోపాటు బాధితురాలికి రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలని తీర్పునిచ్చింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ వాదనలు వినిపించారు. ఐవోలుగా ఏమి రెడ్డి రాజశేఖర్ రెడ్డి,డి. చంద్రశేఖర్ రెడ్డి, ప్రస్తుత ఎస్.హెచ్.ఓ సైదులు, సి.ఐ రాఘవరావు వ్యవహరించారు. లైసెన్ ఆఫీసర్ మల్లికార్జున్, నరేందర్,సి.డి.ఓ సుమన్, భరోసా లీగల్ ఆఫీసర్ కల్పన ఉన్నారు.

# బకాయిలు అడిగితే బ్లాక్‌మెయిల్ చేసినట్టా..?

**దౌర్భగ్యస్థితి కాంగ్రెస్ సర్కారు : బండిసంజయ్ ఫైర్**

హైదరాబాద్ :

పెండింగ్ బకాయిలు అడిగితే బ్లాక్ మెయిల్ లాగా సీఎం రేవంత్‌రెడ్డి ఫీల్ అవుతున్నారని, కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇతరత్రా పెండిరగ్ బిల్లులు చెల్లించలేని స్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉన్నదని కేంద్రమంత్రి బండిసంజయ్ ఫైర్ అయ్యారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలరాస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. బకాయిలు చెల్లించాల్సిందే అంటూ పట్టుబడిన బండి సంజయ్.. ప్రభుత్వానికి పలు అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్ మెయిల్ చేస్తారా? విద్యార్థులు, యాజమాన్యాల భవిష్యత్తుతో చెలగాటమాడతారా? బ్లాక్ మెయిల్ చేస్తే చూస్తూ ఊరుకుంటామా? కమీషన్లు రావనే సాకుతో బకాయిలు చెల్లించడం లేదా? అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని కూడా కాలరాస్తారా? పదేపదే ఇచ్చిన మాటను తప్పే వాళ్లను ఏమనాలి? బీహార్ ఎన్నికలకు పైసలు ఇక్కడి నుండే పంపుతున్నారు కదా? విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు చెల్లించలేరా? ఈసారి తక్షణమే బకాయిలు మొత్తం చెల్లించాల్సిందే.. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు' అంటూ హెచ్చరించారు. విద్యార్థులు, యాజమాన్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయమని వార్నింగ్ ఇచ్చారు. యాజమాన్యాలూ..... ప్రభుత్వానికి భయపడి సమ్మె విరమిస్తే అంతే సంగతులు.. భవిష్యత్తులో ఎవరూ అండగా నిలబడే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలపైనా రోడ్డెక్కడం తథ్యమని వెల్లడిరచారు. మంత్రులు ప్రతి పనికి కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ సొమ్మును కాంగ్రెస్ హైకమాండ్‌కు కప్పం కడుతున్నారంటూ బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాగా.. ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని నల్లకుంట శంకరమఠ్‌కు చేరుకున్న బండి సంజయ్.. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతి స్వామి ఆశీస్సులను కేంద్రమంత్రి అందుకున్నారు.

# తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, అక్టోబర్ 22(నినాదం):** తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమా చారాన్ని అందచేశారని అన్నారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేను చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున www.telangana.gov.in /telanganarising అనే వెబ్సైట్ ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు , సూచనలను అందించాల్సింగా జిల్లా కలెక్టర్ కోరారు.

# ఇంకెందుకు ఆలస్యం

## హుజూర్‌నగర్‌లో జాబ్ మేళా ...

## అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే!

**కోదాడ,(నినాదం):** జాబ్ మేళా అంటే కేవలం సిటీలకు మాత్రమే పరిమితం అయ్యేవి. ఇదంతా ఒకప్పుడు మాట. ఒకప్పుడు వివిధ జిల్లాలకు ప్లాన్ చేస్తోంది తెలంగాణ ప్రభుత్వం. తాజాగా నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది తెలంగాణ ప్రభుత్వం. ఉమ్మడి నల్గొండ జిల్లా హుజూర్నగర్లో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తోంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నల్గొండ జిల్లా హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నెల 25న ప్రభుత్వం జాబ్ మేళా ఏర్పాటు చేస్తోంది. 100 నుంచి 150 కంపెనీలు ఒకే దగ్గరకు వచ్చి వారికి అవసరమైన నైపుణ్యాలు ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసుకుంటుంది. యువత ప్రత్యేక శ్రద్ధ తీసుకుని హాజరు అయితే ఉద్యోగాన్ని చేజిక్కించుకునే అవకాశం ఉంది. సుమారు 3,000 మంది వరకు ఈ జాబ్ మేళాలో ఎంపికయ్యే అవకాశం ఉంది.

**యువతీయువకులకు బంపరాఫర్**

2 లక్షల నుంచి 8 లక్షల వరకు ప్యాకేజ్ని సొంతం చేసుకోవచ్చు. ఉద్యోగం బట్టి వయస్సు పరిమితి ఉండనుంది. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీయువకులు హాజరుకావాలని సూచించారు అధికారులు. అలాగే రెజ్యూమ్ కూడా తీసుకురావాలని చెబుతున్నారు.వేదిక ఎక్కడ నుకుంటున్నారా? హుజూర్ నగర్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక ఉన్న పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ లో జరగనుంది.






అక్టోబర్ 25న అనగా శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగైదు గంటల వరకు జాబ్ మేళా జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమం మెగా జాబ్ మేళా. ఉమ్మడి జిల్లాల నిరుద్యోగులు, ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు బంపరాఫర్.

**హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి...**

తాము ఏ జాబ్ అర్హులో గుర్తించి ఆ ఉద్యోగాలున 5 కంపెనీలను ఎన్నుకుని వాటికి మాత్రమే బయోడేటాను ఇచ్చేందుకు ఏర్పాటు చేసుకోవాలి.జాబ్ మేళాలు అంటే ఇంటర్వ్యూలే. మనం కంపెనీ దగ్గరకు కాకుండా కంపెనీయే మన దగ్గరకు వచ్చి ఎంపిక చేసుకుంటుంది. అలాంటి ఇంటర్వ్యూకు ప్రొఫెషనల్‌గా కన్పించే దుస్తులు ధరించాలి. మొదటి ఇంప్రెషన్ చాలా ముఖ్యం అని గమనించండి. జాబ్ మేళా ప్రారంభానికి ముప్పై నిమిషాలు ముందుగా చేరుకోవాలి. దీనివల్ల కొంత ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా ఉంటారు.మీ గురించి రెండు నిమిషాలలో స్పష్టంగా చెప్పగలిగేలా సాధన చేసుకోవాలి.మిమ్మల్ని ఇంటర్వ్యూకి పిలవగానే ముఖాముఖి బృందంలో మధ్యలో కూర్చున్న వ్యక్తికి నమస్కారం చెప్పాలి. కూర్చోమని చెప్పేవరకు కూర్చోకూడదు. తెలిసిన విషయాలు ఆత్మవిశ్వాసంతో చెప్పాలి. తెలియని అంశాలు అడిగితే నిజాయతీగా తెలియదని చెప్పాలి. నేర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నానని తెలియజేయడం మంచింది.నవ్వుతూ ధైర్యంగా మాట్లాడాలి. వినయంగా, కళ్లల్లోకి చూసి మాట్లాడాలి.ఇంటర్వ్యూ టైంలో మీ చరవాణిని సైలెంట్ మోడ్‌లో ఉంచాలి. ఇంటర్వ్యూ టైంలో పొరపాటున కూడా సెల్ఫోన్ వాడొద్దు.

**అవకాశం సద్వినియోగం చేసుకోవాలి...**

**ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి...**

చదువుకుని ఉద్యోగం రాక ఇబ్బందులు పడుతున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హుజూర్‌నగర్‌లో ఈ నెల 25న భారీ జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తెలిపారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమమని, ఉమ్మడి జిల్లా నిరుద్యోగులు, చదువు చివరి దశలో ఉన్న విద్యార్థులు ఉపయోగించుకోవాలని చెప్పారు. జాబ్ మేళా కార్యక్రమానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 25వ తారీఖున ఆయా మండలాలలోని పోలీస్ స్టేషన్ వద్ద నుండి హుజూర్నగర్ వెళ్లేందుకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు.

# ఇక నో చెక్ పోస్టులు..

**జిల్లాలో రెండు ఆర్టీఏ తనిఖీ కేంద్రాలు మూసివేత**

**ప్రభుత్వ ఆదేశాలతో అధికారుల తక్షణ చర్యలు**

**బోర్డులు, బారికేడ్లు, సిగ్నేజ్ తొలగింపు.. జిల్లా ఆఫీస్ కు తరలింపు...**

**అవినీతి అరికట్టలేక అనివార్యమయ్యిందా..!?**









**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్22(నినాదం) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వారావుపేటలోని చెక్ పోస్టులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ శాఖ ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను రద్దు చేస్తూ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీఏ చెక్ పోస్టులు తక్షణం మూసివేతకు ఆదేశాలు జారీ చేసింది. బుధవారం సాయంత్రం 5 గంటల కల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారులకు తనిఖీ కేంద్రాలు మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లాలో ఉన్న రెండు చెక్ పోస్ట్ లను జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారులు మూసివేశారు. చెక్ పోస్టుల వద్ద వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని చెప్పడంతో చెక్ పోస్టుల వద్ద ఉన్న బోర్డులు, బారికేడ్లు, సిగ్నేజ్ తొలగించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా తగిన ప్రకటనలు ఇవ్వాలని ఆదేశాల నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద ఫ్లెక్సీలను సైతం ఏర్పాటు చేశారు. ఈ ఆఫీస్లలో ఉన్న సామగ్రిని, ముఖ్యమైన ఫైళ్లను, వస్తువులను జిల్లా రవాణా కార్యాలయానికి తరలించారు. కాగా ప్రభుత్వ నిర్ణయం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది.

**ఏసిబి దాడులతోనా..**

**అవినీతి అరికట్టలేక అనివార్యమైందా...!?**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రవాణా శాఖ తనిఖీ కేంద్రాలపై గత ఆదివారం నాడు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మెరుపు దాడులు నిర్వహించిన నేపథ్యంలో ఈ తాజా ఉత్తర్వులు వెలువడటం అత్యంత ఆసక్తికరంగా మారింది. ఈ దాడుల నేపథ్యంలో చెక్ పోస్టుల రద్దు అనివార్యం అయ్యిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే జిల్లాలో చెక్ పోస్టులపై ఎసిబి దాడులు కొత్తేమీ కాదు. గతంలోనూ ఈ దాడులు జరిగాయి. అయినా ఈ చెక్ పోస్టుల్లో డ్యూటీ చేస్తున్న అధికారుల తీరు మారకపోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఎసిబి దాడుల వల్లనా లేక చెక్ పోస్టుల్లో అవినీతిని అరికట్టలేక ఈ నిర్ణయం తీసుకుందా అన్న చర్చ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

**నిరంతర అవినీతి ఆరోపణలు...**

రాష్ట్రంలో సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ఉమ్మడి ఆదిలాబాద్, కామారెడ్డి, కొమరం భీం అసిఫాబాద్ జిల్లాల్లోని తనిఖీ కేంద్రాలపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి, అక్కడ అక్రమాలు జరుగుతున్నట్లుగా గుర్తించారు. నిరంతర అవినీతి ఆరోపణలు, వాహనదారులకు చెక్ పోస్టుల వద్ద ఎదురవుతున్న ఇబ్బందులను పూర్తిగా తొలగించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నట్లుగా స్పష్టమవుతోంది. అయితే ఇక్కడ జరిగే కార్యకలాపాలపై ఎప్పుడూ అవినీతి ఆరోపణలు మూటగట్టుకున్నాయి. అక్రమ వసూళ్లే లక్ష్యంగా ఇక్కడ పని చేస్తున్న అధికారులు ప్రయివేటు సిబ్బందిని సైతం ఏర్పాటు చేసుకుని మరి తమ కార్యకలాపాలు నడుస్తున్నారన్న అపవాదు సైతం ఉంది. ఈ నేపథ్యంలో అనేక ఏసిబి దాడులు జరగడం అందుకు మరింత బలం చేకూర్చాయి. ఇక ఇక్కడ అవినీతిని అరికట్టలేమన్న భావనతోనే ఈ చర్యలు ప్రభుత్వం తీసుకుందన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది. అయితే ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు జిల్లా రవాణా అధికారి వెంకట రమణను వివరణ కోరేందుకు ఫోనులో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

# ప్రమోద్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ధన్‌పాల్

## ప్రమోద్ పిల్లల చదువు బాధ్యత తనదే



**నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం) :** ఇటీవల హత్యకు గురైన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బుధవారం పరామర్శించారు. ప్రమోద్ తల్లి, భార్య, కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన ప్రమోద్ త్యాగం ఎప్పటికీ మరువ లేమన్నారు. ఆయన కుటుంబం ఒంటరిగా లేదని, ప్రభుత్వం ప్రజలు వారితో ఉన్నారని ధైర్యం చెప్పారు. ధన్‌పాల్ సూర్యనారాయణ వారి కుటుంబా నికి ఆర్థికంగా, విద్యాపరంగా సహాయం అందిస్తానని ప్రకటించారు. ప్రమోద్ పిల్లలు పదో తరగతి వరకు చదువుకునే విద్యా ఖర్చులు తానే భరిస్తాను అని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ ని రౌడీషీటర్ రియాజ్ దారుణంగా హతమార్చడం తీవ్ర బాధను కలిగించిందని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ శాఖ రౌడీ షీటర్ల పై కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీని యర్ నాయకులు లోక భూపతి రెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ళ లక్ష్మినారాయణ, బీజేపీ నాయకులు న్యాలం రాజు, శివ, ఆనంద్ రావు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 303 కోట్లతో సుందర వనంగా కంటోన్మెంట్

## బోర్డు నిధుల వినియోగం కోసం జరిగిన సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, అక్టోబర్22,(నినాదం):** కొంపల్లి వైపు, షామీర్ పేట్ వైపు ఫ్లై ఓవర్ నిర్మాణాల కోసం రక్షణ శాఖ భూములు, కంటోన్మెంట్ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది. కంటోన్మెంట్ భూముల బదలాయింపుకి బదులుగా వచ్చిన డబ్బులు కంటోనెంట్ బోర్డుకు జమచేయాలని నేను, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కలిసి కేంద్ర రక్షణ శాఖ మంత్రి కి పదే పదే విజ్ఞప్తి చేసి జమచేయించామని ఈటెల పేర్కొన్నారు. 303 కోట్ల రూపాయలతో కంటోన్మెంట్ ని సుందరమైన నందనవనంగా తీర్చిదిద్దాలని అధికారులను కోరినం అన్నారు. 2051 వరకు ఎంత జనాభా పెరుగుతుందో అంచనా వేసుకొని అందుకు అనుగుణంగా మంచినీరు సరఫరా, మురుగు నీరు, వరద నీరు పోయేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసి పనులు చేయాలని జీహెచ్ఎంసి, హెచ్ఎండీఏ తో సమన్వయం చేసుకొని కంటోన్మెంట్ లో ఎక్కడా చుక్క నీరు లేకుండా ఉండేలా, మురుగు వాసన లేకుండా చూడాలని సమావేశంలో సూచనలు చేశామన్నారు. పనులు చేసే కాంట్రాక్టర్ కూడా వేగంగా పనులు చేసే కెపాసిటీ ఉన్నవారికి కేటాయించాలని కంటోన్మెంట్ బోర్డు మెంబెర్, కార్పొరేటర్ సలహాలు సూచనలు కూడా తీసుకోవాలని కోరడం జరిగిందని మీడియాకు వివరించారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



**సిద్దిపేట(దుబ్బాక) నినాదం:** తొగుట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్, ఓ పి రిజిస్టర్ వెరిఫై చేశారు. అందరూ సమయానికి వస్తున్నారా ఆరా తీశారు. మెడికల్ ఆఫీసర్ నుండి కింది స్థాయి సిబ్బంది వరకు రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సరిపడినన్ని మందులు, ల్యాబ్ లో పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఆయుష్ కేంద్రంలో యునాని వైద్యం సేవలు పిఎచ్ సి పరిధిలోని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని యునాని వైద్యురాలిని ఆదేశించారు. మధ్య వయస్సు, వృద్ధులకు యునాని వైద్యం చాలా శ్రేష్టమైనదని తెలిపారు. కలెక్టర్ తనకి కాలి మడమ నొప్పి వస్తుందని యునాని వైద్యురాలికి తెలపగా హబ్బే జోగ్రజ్ గోగుల్ మాత్రలు రోజు రెండు చొప్పున ఉదయం సాయంత్రం కొంచెం వేడి నీటితో వేసు కుంటే తగ్గుతుందని యునాని వైద్యురాలు కలెక్టర్ కి తెలిపారు.

# యాదవుల ఐక్యతకు వేదిక సదర్ : రవికుమార్ యాదవ్



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** యాదవుల ఐక్యతకు వేదిక సదర్ సంబురమని, యాదవుల సంస్కృతి , సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీక సదర్ ఉత్సవాలని బీజేపీ శేరిలింగం పల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్ అన్నారు. దీపావళి పండుగ తర్వాతి రోజున జరుపు కునే సదర్ ఉత్సవాలలో భాగంగా బుధవారం నియోజకవర్గం లో చందా నగర్ డివిజన్ పరిధి లోని అన్నపూర్ణ ఎంక్లేవ్, వేము కుంట, మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాదాపూర్ గ్రామం, గచ్చిబౌలి డివిజన్ పరిధి లోని దర్గా గ్రామం, నలగండ్ల గ్రామాలలో ఘనంగా సదర్ ఉత్సవాలు నిర్వహిం చారు. ఈ ఉత్సవాలలో బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్ ముఖ్యఅతి థిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరికీ దీపావళి, సదర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతను చాటే గొప్ప వేడుక అని, సదర్ ఉత్సవాలలో మనకు జీవనోపాధిని కల్పించే పశువులను పూజించుకోవడం ఆనందించదగ్గ విషయమని అన్నారు. యాదవులందరూ ఒక్కటే అని చాటి చెప్పే సదర్ పండుగ 1956లో మొదలై ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సదర్ ఉత్సవం మనందరి జీవితాలలో ఆనందాన్ని, ఐక్యతను నింపాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, కాలనీల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో ప్రభుత్వ ఆరోగ్య సేవలపై సమీక్ష

## అధికారులతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ బి.రవిందర్ నాయక్



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, అక్టోబర్22 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ బి రవీందర్ నాయక్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమా గౌరి, జిల్లా ప్రోగ్రాం అధికారులు సెక్షన్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న టీబీ, ఎన్‌సీడీ, ఇమ్యూనైజేషన్, ఫ్యామిలీ ప్లానింగ్, ఆసుపత్రుల నిర్వహణ వంటి అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై వివరణాత్మక సమీక్ష నిర్వహించి, భవిష్యత్ కార్యచరణ ప్రణాళికలపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు మల్లీశ్వరి, చంద్రకళ, శ్రీదేవి, సత్యవతి, కౌశిక్, వినోద్, వసంత కుమారి గార్లు, అలాగే కార్యాలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మళ్ళీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది


## మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట(నినాదం):** సిద్దిపేట పట్టణం లోని 7 వార్డులోని కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు వందమంది కార్యకర్తలు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ కౌన్సిలర్ ఇల్లు కట్టుకుంటే డబ్బులు అడుగుతున్నాడు, వార్డ్ ప్రజలను ఇబ్బంది పెడుతున్నాడు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పింఛన్ 4000 ఇస్తా అని మాట తప్పింది కాంగ్రెస్ ప్రభుత్వం.. అన్నారు. కెసిఆర్ 200పెన్షన్ ను 2వేలు చేస్తా అన్నాడు చేసి మాట నిలబెట్టికున్నాడు.అన్నారు కాంగ్రెస్ పార్టీ మహిళలు మహాలక్ష్మి కింద 2500 ఇస్తా అన్నది.. తులం బంగారం అన్నారు. మాట తప్పింది.. అన్నారు. కాంగ్రెస్ వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రి లో కేసీఆర్ కిట్టు కూడా ఇవ్వడం లేదు.అన్నారు బి ఆర్ ఎస్ ప్రభుత్వం లో సిద్దిపేట దేశానికి ఆదర్శం గా నిలిపాం.అన్నారు మళ్ళీ కెసిఆర్, బి ఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుంది అన్నారు

# శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు వెలకట్టలేనివి

## ఎమ్మెల్యే రాం మోహన్ రెడ్డి




**వికారాబాద్, అక్టోబర్ 22(నినాదం):** పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా బుధవారం జిల్లా పరిధిలోని పరిగి పట్టణంలోని ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో పరిగి సబ్ డివిజన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిభిరానికి జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ఐపిఎస్, పరిగి ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి లు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. సందర్భంగా ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, పోలీస్ ఫ్లాగ్ డే అనేది మనందరికీ గర్వకారణమైన రోజని అన్నారు. సమాజానికి రక్షణగా నిలిచి, విధి నిర్వహణలో ప్రాణాలను అర్పిం చిన వీర పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న నిస్వార్థ సేవ వెలకట్టలేనిది. ఈ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం పోలీసుల సామాజిక బాధ్యతకు నిదర్శనం. రక్తదానం చేయడంలో పోలీసులు ముందుండడం ఎందరికో ఆదర్శం. ఈ రక్తదానం ద్వారా అనేక మంది నిరుపేదలకు, అత్యవసర వైద్యం అవసరమైన వారికి కొత్త జీవితం లభిస్తుందన్నారు. పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువ కావడానికి, వారిపై ప్రజలకు మరింత విశ్వాసం పెరగడానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. పరిగి నియోజకవర్గ ప్రజల తరఫున పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీస్ అధికారులను, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను అని తెలిపారు. జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, రక్తదాతలను, పోలీస్ అధికారులను అభినందించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ ఫ్లాగ్ డే అనేది విధి నిర్వహణలో దేశం కోసం, ప్రజల శాంతి భద్రతల కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకునే పవిత్ర దినమని అన్నారు. వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యం తో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని ఒక వ్యక్తి ఇచ్చే రక్తం మరొకరి ప్రాణాన్ని నిలబెడుతుందన్నారు. అత్యవసర సమయాల్లో, ప్రమాదాల్లో, వైద్య చికిత్సల్లో రక్తం అవసరం ఎంతో ఉంతుందని, అలాంటి గొప్ప కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అధికారులు, స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. పోలీస్ వ్యవస్థ నిత్యం ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొంటుందని తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాములు నాయక్ పరిగి సబ్ డివిజన్ డి ఎస్పీ శ్రీనివాస్ , పరిగి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత

## కేసు నమోదు

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22(నినాదం) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఐపీఎస్, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ఐపిఎస్, కాగ జ్ నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ ఆదేశాల మేరకు గంజాయి అమ్మకాల పై గట్టి నిఘా ఏర్పాటు చేసి చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎండు గంజాయి పట్టుకున్నట్లు కౌటాల సిఐ సంతోష్ కుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం చింతలమానేపల్లి మండలంలోని టెకంగూడ గ్రామానికి చెందిన దుర్గం శాంతబాయి, ఆమె కొడుకు వృత్తిరీత్యా వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయం లో లాభం లేదని, అధిక డబ్బులు వస్తాయని ఆశపడి గంజాయి అమ్మేందుకు పథకం వేశారు. ఈ క్రమంలో గత కొన్ని రోజుల కిందట దాదాపు కిలో ఎండు గంజాయి కొనుగోలు చేసి ఇంటికి తీసుకువచ్చి దాచి పెట్టారు. ఇందులో సగం వరకు అమ్మగా మిగిలిన దాన్ని ఇంట్లో దాచి పెట్టారు. బుధవారం శాంతబాయి ఇంట్లో ఉన్న ఎండు గంజాయి రణవెల్లి శివారులో ఉన్న తమ చేనులో దాచి పెట్టేందుకు తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు కౌటాల సీఐ సంతోష్ కుమార్, ఎస్ఐ ఇస్లావత్ నరేశ్ తో కలిసి ఆకస్మిక దాడి చేసి మార్గ మధ్యలో శాంతబాయిని పట్టుకుని తనిఖీ చేయగా ఆమె వద్ద 404 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. పట్టుకున్న గంజాయి విలువ రూ.8080లు ఉంటుందని సిఐ తెలిపారు. కేసు నమోదు చేసి శాంతాబాయిని రిమాండ్ కి తరలించినట్లు ఆయన తెలిపారు. మారకద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి అమ్మకం, సరఫరా పై ఉక్కుపాదం మోపుతున్నామని, ఎవరైనా గంజాయి గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయి నిధులు ప్రభుత్వం విడుదల

## సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపిన ట్రస్మా నేతలు



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 22 (నినాదం) :** తెలంగాణ రాష్ట్రంలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కు రెండు సంవత్సరాలుగా రావల సిన బకాయిలు 25% నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సందర్భంగా తెలంగాణ సెక్రటేరియట్ లో సాంఘిక సంక్షే మ శాఖ మంత్రి మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ న్ను ట్రస్మా నేతలు కలిసి మెమెంటో అందించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డా శివరాత్రి యాదగిరి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డా యాదగిరి శేఖర్ రావు, ట్రస్మా రాష్ట్ర ఫౌండర్ కేసా వీరన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రావు, రాష్ట్ర కోశాధికారి ఎస్ జయ సింహ గౌడ్, గద్వాల జిల్లా నుండి రాష్ట్ర అడ్వైజర్ బీచుపల్లి, రంగారెడ్డి జిల్లా నుండి రాష్ట్ర అడ్వైజర్ వెంకటయ్య, వివిధ జిల్లాల నుండి రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పలువురి కుటుంబాలకు ఎమ్మెల్యే భూపతి రెడ్డి పరామర్శ



నిజామాబాద్ (ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి ఇందల్వాయి మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుల కుటుంబాలను ఆయన స్వయంగా పరామర్శించి సానుభూతి తెలిపారు. తిర్మన్‌పల్లిలో సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ ఎంపీటీసీ శ్రీమతి లక్ష్మీ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎల్లారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సిద్దెంకి తండ్రి కాపర్ల రాములు మృతిపై ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. తదుపరి, ఇందల్వాయి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గంగాగౌడ్ మరణంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బాలయ్య మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇందల్వాయి మండల కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్ గౌడ్, తిర్మన్ పల్లి మాజీ సర్పంచ్ చింతల కిషన్, నిజామాబాద్ రూరల్ యూత్ నాయకులు ఉమ్మాజీ నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, ఎల్లారెడ్డి పల్లి మాజీ సర్పంచ్ నరేష్, సీనియర్ నాయకులు మోహన్, యువ నాయకులు అఖిల్, లోలం మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మల్లాపూర్ మాజీ సర్పంచ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తితోపాటు సమాజ సేవలో యువత ముందుండాలి

### రక్తదాన కేంద్రాన్ని ప్రారంభించిన తుమ్మల యుగంధర్





ఖమ్మం,అక్టోబర్22(నినాదం): భక్తితోపాటు సమాజసేవలో సైతం యువత ముందుండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ అన్నారు. ఖమ్మం నగర పరిధిలోని 54వ డివిజన్లోని వీడియోస్ కాలనీలో అయ్యప్ప స్వాములచే ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసిన స్వాములను అభినందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాంప్రసాద్ గురుస్వామి, కిషోర్‌నాయుడు, గురుస్వాములు ఆర్గనైజర్లు డివిజన్ నాయకులు వారితోపాటు పాల్గొన్న ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## గిరిజన జాతికి కొదమసింహం కొమరం భీమ్

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



మణుగూరు అక్టోబర్ 22 (నినాదం): అడవి బిడ్డల హక్కుల కోసం గిరిజనుల సంక్షేమ కోసం నిజాం ప్రభుత్వంతో కొదమ సింహంలాగా పోరాటం చేసిన వీరోచిత మరణం పొందిన అమరవీరుడు కొమరం భీమ్ అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. బుధవారం మణుగూరు పట్టణంలో అంబేద్కర్ సెంటర్లో ఉన్న కొమరం భీమ్ జయంతి సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మగౌరవం ప్రతీక తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి కొమరం భీమ్ జయంతి ఆదివాసీ ఆత్మగౌరవ హక్కుల పోరాటానికి నిలువెత్తు నిదర్శనమని ఆయన అన్నారు. కొమరం భీం జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించి పూలమాలలతో ఆయన విగ్రహాన్ని సత్కరించారు శ్రద్ధాంజలి ఘటించారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో భూమికోసం భుక్తి కోసం గిరిజనుల గౌరవం కోసం పోరాడిన అమరవీరుడు త్యాగశీలుడు మన్యం కొదమ సింహం.మన అందరికీ ముఖ్యంగా ఆదివాసీ సమాజానికి పరిరక్షకుడు నేటికీ గొప్ప నాయకుడుగా ఉండిపోవడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. భూస్వామ్య వ్యవస్థ బూర్జువ వ్యవస్థ నిజాం ప్రభుత్వం దుర్మార్గ పాలనపై గెరిల్లా పోరాటం చేసిన ఏకైక గిరిజన నాయకుడు కొమరం భీమ్ అని స్పష్టం చేశారు. అడవి తల్లి కడుపున పుట్టిన ఆత్మ గౌరవం ఆదివాసుల హక్కుల కోసం ఎలుగెత్తిన ధిక్కార స్వరం వినిపించిన గోండ్ బెబ్బులి కొమరం భీమ్ గారి జయంతి సందర్భంగా ఈ మహోన్నతుడికి ఘన నివాళులు అర్పించడం ప్రతి గిరిజనుడు బాధ్యతగా గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. కొమరం భీమ్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, అలాగే కొమరం భీమ్ పేరుతో జిల్లాను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.

## సిలబస్ పూర్తిచేసి ప్రాక్టికల్స్‌కు సిద్ధం చేయండి

### ప్రిన్సిపల్స్ సమావేశంలో జిల్లా ఇంటర్ విద్య అధికారి



నిజామాబాద్ (ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం) : ఇంటర్ విద్యార్థులకు నవంబర్ నెలలో సిలబస్ పూర్తిచేసి ప్రాక్టికల్స్ కు విద్యార్థులను సిద్ధం చేయాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపూడి రవికుమార్ ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్య అధికారి కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశంలో డిఐఈవో తిరుమలపూడి రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో మరమ్మతుల కోసం ఇంటర్ విద్యా బోర్డు కేటాయించిన నిధులను వినియోగించుకొని సివిల్, ఎలక్ట్రికల్, ఇతర అన్ని మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ప్రయోగశాలలకు కేటాయించిన నిధులను వినియోగించుకొని వెంటనే ప్రాక్టికల్స్ కు అవసరమైన కెమికల్స్ ఇతర సామాగ్రిని సమకూర్చుకోవాలని ఆదేశించారు. అలాగే ఇంటర్ బోర్డ్ కేటాయించిన నిధులను వినియోగించుకున్నట్లు సర్టిఫికెట్లను డీ.ఐ.ఈ.ఓ. కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. విద్యార్థుల అపార్ పనులు పూర్తికాని కళాశాలలో వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. [illegible] ప్రణాళికను ఈసారి కూడా అమలు చేసే అవకాశం ఉందని జిల్లా ఇంటర్విద్యా అధికారి తెలియజేశారు. ఇక ముందు అధ్యాపకులు హెచ్.ఆర్. ఎం.ఎస్. పోర్టల్ ద్వారానే సెలవుల కోసం అనుమతి పొంది వినియోగించు కోవలసి ఉంటుందని, ప్రతి అధ్యాపకులు సిబ్బంది ఈ పోర్టల్ ద్వారానే దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని అన్నారు. అలాగే టీచింగ్ డైరీలను కూడా ఆన్లైన్లోనే పూర్తి చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. కళాశాలలలో ఫర్నిచర్ ను కూడా మరమ్మతులు చేయించి ఇంకా విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన డెస్క్ బెంచిలను సమకూర్చుకు నేందుకు వెంటనే ప్రతిపాదనలను పంపాలని అన్నారు. సమావేశంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్




నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం) : ర్మూర్ డివిజన్ లో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. జక్రాన్పల్లి మండలం మునిపల్లి, ఆర్మూర్ మండలం పిప్రి గ్రామాలలో కొనసాగుతున్న కేంద్రాలను పరిశీలించారు. రైతుల నుండి సేకరించిన మొక్కజొన్న పంట నాణ్యతను తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద ఆరబెట్టిన మొక్కజొన్న నిల్వలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కనీస మద్దతు ధర అందించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తేమ 14 శాతానికి లోబడి ఉండేలా ఆరబెట్టి, శుభ్రపర్చిన మొక్కజొన్న పంటను కేంద్రాలకు తెచ్చి పూర్తి స్థాయిలో మద్దతు ధర పొందాలని సూచించారు. కాగా, కొనుగోలు కేంద్రాలలో రైతులకు తగిన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రైతులు తెచ్చిన పంట నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటే వెంటనే తూకం జరిపించి, ట్యాబ్ ఎంట్రీ చేయాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా కృషి చేయాలని అన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ రావు, మార్క్ ఫెడ్ డీ.ఎం మహేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## పెండింగ్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలి

### అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

### అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై సమీక్షా సమావేశం





ఖమ్మం ప్రతినిధి,అక్టోబర్ 22:(నినాదం) పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై బుధ వారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జిల్లాలో 44 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. పెండింగ్ పనులు పూర్తి చేసి ఎంబీ రికార్డులు వివరాలు నమోదు చేస్తే వెంటనే బిల్లులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. 44 పాఠశాలల్లో పనుల పురోగతి వివరాలను పాఠశాలల వారిగా రివ్యూ చేసి అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. అక్టోబర్ నెలాఖరు వరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామాలలో పాఠశాలకు నీరు సరఫరా లేని పక్షంలో సమీపంలో మిషన్‌భగీరథ పైప్‌లైన్ నుంచి కనెక్షన్ అందించాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల సకాలంలో పూర్తి కానీ పక్షంలో సంబంధిత పాఠశాల సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారుల వేతనంలో కోత విధించడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో విద్యా శాఖ ప్లానింగ్ కోఆర్డి నేటర్ సి.హెచ్. రామకృష్ణ, ఎంపీడీఓలు, ఎం.ఈ.ఓ. లు, సంబంధిత పాఠశాలల హెడ్ మాస్టర్ లు, ఏఈలు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



మణుగూరు అక్టోబర్ 22 (నినాదం): రాష్ట్రంలో పేద ప్రజలకు గృహ వసతి కల్పించి ఇందిరమ్మ కళా సహకారాన్ని నిజం చేయటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకనియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. బుధవారం మణుగూరు మండలంలో సమితి సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇల్లు సహకారం అందని అర్హులైన నిరుపేదలు అందరికీ గృహ వసతి కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాన్ని దేనిని ఆయన స్పష్టం చేశారు. ఇల్లులు మంజూరు కాలేదని దుష్ప్రచారం చేసే ప్రతిపక్ష నాయకులు మాటలు నమ్మొద్దని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇల్లులు మంజూరులో కొంతజాప్యం జరిగిన ఈకార్యక్రమము నిరంతర ప్రక్రియని ఎప్పుడైనా ఎవరైనా సహాయం కోరి వచ్చేవారికి గృహ వసతి కల్పించే బాధ్యత స్థానిక ఎమ్మెల్యేగా తమదేనని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాని వాళ్ళు ఉంటే వారి ఆధార్ కార్డుతో సహా దరఖాస్తు ఫారాన్ని తమకు అందజేయాలని అని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల ప్రభుత్వ కాలంలో తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. విద్య వైద్యం పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందంజలో ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో నిరుద్యోగ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వము ముందంజలో ఉందని, ఇటీవలే గ్రూప్ వన్ గ్రూప్ టు ఉద్యోగాలను సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలను, అలాగే ఆర్టీసీలో 3000 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు గైకొన్నదని అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్ష నాయకులు అర్థం లేని ఆరోపణ చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించి స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో గెలిచేందుకు కుట్ర చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై 42 శాతం అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వము చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు దీనిపై రాద్ధాంతం చేస్తూ లేనిపోయిన నిందలు మోపుతున్నారని ఇది ప్రజాస్వామ్యంలో విలువలు లేని విధానం అని ఆయన స్పష్టం చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి



నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఇందల్వాయి మండలం వెంగల్ పాడ్, తాటితండా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం విక్రయించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి, ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు పెద్దపీట వేస్తుందని, నిజామాబాద్ జిల్లాలో గత ధాన్యం కొనుగోలు ఐకెపి ఆధ్వర్యంలో 100 సెంటర్ ఇస్తే, ప్రస్తుతం 200 ధాన్యం కొనుగోలు ఐకెపి కేంద్రాలకు అప్పజెప్పిందని అన్నారు. గత ధాన్యం కొనుగోలు ఐకెపి మహిళలకు కోటి రూపాయల లాభం వచ్చిందని అన్నారు, 200 ఐకెపి సెంటర్ల వల్ల ఐకెపి మహిళలకు సుమారు రెండు కోట్ల లాభం వస్తుందని అంచనా వేశారు. సిఎం రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వర్లుగా చేయడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నారని అన్నారు. రైతులు ఇచ్చిన ధాన్యానికి రసీదు కచ్చితంగా ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఎటువంటి అవకతవకలు జరగకూడదని ఐకెపి అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఇందల్వాయి మా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, చింతల కిషన్, లింగాపూర్ సంతోష్ రెడ్డి, రాయసింగ్, పరశురాం నాయక్, ఐకెపిసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కాపాస్, కిసాన్ యాప్ ద్వారా మద్దతు ధర పొందవచ్చు

### మండల వ్యవసాయ అధికారి కర్నాటి



ఖమ్మం, అక్టోబర్ 22(నినాదం):కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి రైతులు సిసిఐకి పత్తిని అమ్ముకొని మద్దతు ధర పొందవచ్చు అని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర్ రెడ్డి రైతులకు తెలియజేయడం జరిగింది. బుధవారం ఖమ్మం నియోజవర్గ పరిధిలోని రఘునాథపాలెం మండల జింకల తండాలో పత్తి సాగు చేసేటటువంటి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కపాస్ కిసాన్ మొబైల్ యాప్ ద్వారా సీసీఐ కి పత్తిని మద్దతు ధరకు ఎలా అమ్ముకోవాలో రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. తప్పనిసరిగా పత్తి సాగు చేసేటటువంటి రైతులు రైతు భరోసా పథకానికి అనుసంధానమైనటువంటి ఫోన్ నెంబర్ ద్వారా ఆ మొబైల్ యాప్ లో లాగిన్ అయ్యి వాళ్ళ యొక్క వివరాలు సరిచూసుకొని ఏ రోజైతే పత్తిని సిసిఐ సెంటర్కి తీసుకెళ్లాలనుకుంటున్నారో ఆరోజు స్లాట్ బుక్ చేసుకున్నచో రైతులు సులువుగా సిసిఐకి పత్తిని అమ్ముకోవచ్చును మరియు పత్తిని సిసిఐకి తీసుకు వెళ్ళేటటువంటి రైతులు తేమ శాతం 8 నుంచి 12 ఉండేటట్లు చూసుకొని మద్దతు ధర రూ. 8110 పొందవచ్చునని అన్నారు.

## చైతన్యం 'డ్రగ్స్‌పై యుద్ధం'కు విశేష స్పందన

### బస్టాండ్‌లో డిఎస్పీ విస్తృతంగా తనిఖీలు



మణుగూరు అక్టోబర్ 22 (నినాదం): డ్రగ్స్ నిర్మూలన ప్రజల్లో చైతన్యం అనే కార్యక్రమానికి మణుగూరు పోలీసులు నిర్వహించిన డ్రగ్స్ పై యుద్ధం కార్యక్రమం ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. బుధవారం మణుగూరు ఆర్టీసీ బస్టాండ్ లో స్థానిక డిఎస్పి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బస్సులో ప్రయాణించే ప్రయాణికులను బస్టాండ్ లో వేచి ఉండే ప్రయాణికులను వారు బ్యాగులను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్పి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధిత గంజాయి లాంటి మత్తుపదార్థాలను రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని అందించండి, అలాగే గంజాయి రవాణా చేసే వ్యక్తులకు ప్రజలు ఎవరు సహకరించవద్దని ఆయన పిలుపునిచ్చారు. ఈ డ్రగ్స్ గంజాయి వల్ల కలిగే నష్టాలను ప్రజలకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా బస్టాండ్ లో అనుమానస్పదంగా సంచరించే వ్యక్తుల ఫింగర్ ప్రింట్ స్కానర్ ద్వారా తనిఖీ నిర్వహించారు. గంజాయి మత్తుపదార్థాలను రవాణా చేసే వ్యక్తులపై ఉక్కు పాదం మోపుతామని వారికి ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు సహకరించకూడదని ఆయన హెచ్చరించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ పిలుపుమేరకు గంజాయిపై యుద్ధం ప్రకటించడం జరిగిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసులు చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గంజాయి రవాణా చేసే మాఫియా ముఠాల వ్యక్తుల సమాచారం అందించి బాధ్యతగల పౌరులుగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు రవాణా చేసే వ్యక్తులపై పీడీయాక్ట్‌లు కేసులునమోదు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడుల బయ్యారం సీఐ వెంకటేశ్వరావు, ఎస్సై నగేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల కుటుంబాలను పరామర్శించిన పోలీస్ కమిషనర్



నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం) : పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా బుధవారం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అమరులైన పోలీస్‌కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర డి.జి.పి ఉత్తర్వుల మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులను కలిసి అమరుల ఫోటోలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులతో ప్రభుత్వం నుంచి అందిన సహాయ సహకారాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ప్రభుత్వం నుండి సహాయ సహకారం కావాల్సిన ఇంకా, ఎలాంటి ఇబ్బందులు ఉన్నను తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. అమరులైన పోలీస్ కుటుంబాలకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని వారి బాగోగులను పర్యవేక్షించాలని తెలిపారు. వారి కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని, ఎలాంటి సమస్యలు ఉన్నను నా దృష్టికి తీసుకురావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీ.సీ.పీ (అడ్మిన్) బస్వారెడ్డి, నిజామాబాద్ ఏసి.పి రాజవెంకటరెడ్డి, ఎస్.ఐ.బి ఇన్స్పెక్టర్ వెంకటయ్య, రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై ఆరీఫ్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకిల్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

## మాతృ మరణాలను తగ్గించండి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ



నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం):జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మాతృ మరణాలపై సమీక్ష కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ నిర్వహించారు.వారు మాటాడుతూ ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎం సి హెచ్ సూపర్వైజర్లు ప్రతి గర్భిణీ స్త్రీ ని 12 వారాల లోపు నమోదు చేయడమే కాకుండా నాలుగు సార్లు వైద్యుల చేత పరీక్షించేలా చూడాలని తెలిపారు. ధనుర్వాతం రాకుండా టీకాలు ఇప్పించాలని ఒకవేళ ఎవరైనా ప్రమాదకరమైన లక్షణాలున్నట్లయితే వారిని ప్రత్యేకంగా గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీని ఎత్తు, బరువు, బీపీ, హెచ్ హెచ్ బి, రక్తహీనత మొదలగు పరీక్షలతో పాటు హైపర్ టెన్షన్, ప్లేట్లెట్స్ పరీక్షలు నిర్వహించి నివారణ లో భాగంగా ముందస్తు ప్రణాళిక రచించాలని తెలియజేశారు. సాధారణ ప్రసవాలకై తగు జాగ్రత్తలు తీసుకుంటూనే ప్రమాదకరమైన లక్షణాలు గర్భిణీ స్త్రీలను స్త్రీ వైద్య నిపుణులు ఉండే ఆసుపత్రులకు ప్రసవాలకై ప్రణాళిక రచించాలన్నారు. ఆశా కార్యకర్తలు గర్భిణీ స్త్రీలు ప్రసవానికి వెళుతున్నప్పుడు వారి వెంట తప్పకుండా వెళ్లాలని సాధారణ ప్రసవాలు అయ్యే విధంగా వారికి తగు సహాయ సహకారాలు అందించాలని కోరారు. మదర్ ఇన్ మదర్ అవుట్ గర్భిణీ స్త్రీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఫోన్ ద్వారా వారికి అందించే ఆరోగ్య సేవలను గుర్తించి నమోదు చేయాలని అన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎల్ఎంపీని, ఈడీడీ లను కరెక్ట్ గా నమోదు చేయాలన్నారు. ఏ ఒక్క మాతృ మరణం జరగకుండా అన్ని విధాల కృషి చేయాలని, అనివార్య కారణాలవల్ల ఎక్కడైనా మాతృ మరణం సంభవిస్తే పూర్తి సమాచారాన్ని అంటే గర్భిణీ స్త్రీ ఇంటి నుండి బయలుదేరి ఎక్కడెక్కడ ఏ రకమైన చికిత్స తీసుకున్నది ఏ లక్షణాల కొరకై ఉన్నత ఆసుపత్రులకు రిఫేర్ చేయబడ్డది డాక్యుమెంటేషన్ వివరాలను సేకరించాలని తెలిపారు. ఆసుపత్రి స్థాయిలో ఆడిట్ ను, సామాజిక స్థాయిలో ఆడిట్ ను నిర్వహించి మాతృ మరణాలు నమోదు ఫార్మాట్ నందు పూర్తి సమాచారాన్ని పొందుపరచాలని కోరారు. గర్భిణీ స్త్రీ ఇంటి వద్ద కుటుంబ సభ్యుల ద్వారా గాని లేదా వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల గాని ఏ ఒక్క మాతృ మరణం జరగకుండా అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ సమీక్షలో మాతృ మరణాలు జరిగిన నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దేగాం, భీంగల్, ఇందల్వాయి జక్రాన్ పల్లి,రెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అర్సపల్లి దుబ్బ నుండి సిబ్బంది పాల్గొనగా మాతా శిశు ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్వేత, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ కీర్తి డాక్టర్ అశ్విని ఏవో రాజేశ్వర్, డిపిహెచ్ఎన్ఓ స్వామి సులోచన, డి.హెచ్.ఇ వెంకటేశ్వర్లు ఎల్డి కంప్యూటర్ అనురాధ, వివిధ పీహెచ్ సీల నుండి వైద్యాధికారులు, ఎం ఎల్ హెచ్ పి లు, పర్యవేక్షణ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్ఆర్ శంకరన్ జయంతి వేడుకలు



కల్వకుర్తి, అక్టోబర్ 22 (నినాదం): కల్వకుర్తి పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బుధవారం ఎస్సార్ శంకరన్ జయంతి సందర్భంగా కల్వకుర్తి డివిజన్ స్వేరోస్ అధ్యక్షులు వట్టేపు కిషోర్ ఆధ్వర్యంలో స్వేరోస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వేరోస్ నాయకులు మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పరితపించిన గొప్ప వ్యక్తి శంకరన్ అన్నారు. ఆయన దూరదృష్టితో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో గురుకుల విద్యా వ్యవస్థ ప్రారంభించి,విద్య ద్వారానే పేద పిల్లల జీవితాలు మారుతాయని విశ్వసించిన గొప్ప వ్యక్తి శంకరన్ అన్నారు. ఆయన మహోత్తరమైన ఆలోచనల నుంచి గురుకుల వ్యవస్థ ఏర్పడింది. గురుకులాలనుంచి పుట్టిన స్ఫూర్తిదాయక సంస్థ స్వేరోస్ నెట్వర్క్ అని కొనియాడారు. స్వేరోస్ ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించిన ఎస్.ఆర్. శంకరన్ పుట్టినరోజునే స్వేరోస్ ఆవిర్భావ దినోత్సవంగా జరుపుకుంటున్నామని వారు.తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ సీనియర్ నాయకులు దుబ్బ నాగేష్ , భీమయ్య, వెల్దండ మండల స్వేరోస్ నాయకులు జంగిలి నిరంజన్, వంగూరు స్వేరోస్ నాయకులు మల్లేశ్ ,స్వేరోస్ ఫౌండేషన్ మెంబర్ అశ్విన్ కుమార్,డివిజన్ మాజీ అధ్యక్షులు ముత్యాల రమేష్, జిల్లెల మాజీ ఉప సర్పంచ్ గుమ్మకొండ రాజు, స్వేరోస్ నాయకులు కృష్ణ,వట్టేపు గణేష్, పాండు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి ఫోను అందచేసిన ఎస్ఐ



మధిర, అక్టోబర్ 22 (నినాదం):మధిర మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన ఎస్.కె నాగుల్ మీరా అనే వ్యక్తి తన సెల్ ఫోనును మార్గంమధ్యలో పోగొట్టుకున్నారు. ఆఫోన్ ఒక వ్యక్తికి దొరకటంతో బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ ప్రసాద్, హోంగార్డ్ విజయ్‌కి అందజేశారు. సెల్ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తిసమాచారాన్ని తెలుసుకొని అతనిని పోలీస్ స్టేషన్‌కి పిలిపించి పోయిన మొబైల్ ఫోనును అతనికి ఎస్సై కిషోర్ కుమార్ అందజేశారు.

## హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్యే కూనంనేని

### తీరిన పాతకొత్తగూడెం దళిత కుటుంబాల సొంతింటికల

### దళితవాడలో ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే





భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్22( నినాదం): ప్రతియేటా వర్షాకాలంలో శిథిలా వస్తకు చేరిన తమ ఇండ్లను వదిలి పునరా వాస కేంద్రాల్లో తలదాచుకునే పాతకొత్త గూడెం దళితవాడ కుటుంబాల కష్టాలకు స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబ శివరావు తెరదించారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యా నికి గురైన ఈ కుటుంబాలకు తలదాచుకు నేందుకు పక్కా గృహాలు మంజూరు చేయి స్తానన్న హామీని నిలబెట్టుకున్నారు. మంజూ రైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిరుపేద దళిత కుటుంబాల సొంతిటి కల నెరవేర్చారు. పట్టణంలోని పాత కొత్తగూడెం పరిధిలోని దళితవాడ కుటుం బాలకు మంజూరు చేయించిన 26 ఇంది రమ్మ ఇండ్ల నిర్మాణానికి బుధవారం కూనం నేని శంకుస్థాపన చేశారు. కూనంనేనికి దళిత కుటుంబాలతోపాటు పాతకొత్తగూడెం ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూలమా లలు, శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ.. పేద కుం టుంబాలకు గృహవసతి కల్పించడం బాధ్యతగా స్వీకరించానని, శిథిలావస్థకు చేరిన ఇండ్లలో అవస్థలు పడుతూ, వర్షాలు వస్తే పునరావాస కేంద్రాలకు తెరలివెళ్లే దళిత కుటుంబాల పరిస్థితి దయనీయమని, దీన్ని గతపాలకులు గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ప్రతి పేద కుటుంబం తలదాచుకునే సొంత ఇల్లు పొందే వరకు కృషిని కొనసాగిస్తానని, సొంతిల్లు నిర్మించి పేదలకు సామాజిక గౌరవాన్ని, విశ్వాసాన్ని నింపేదిశగా నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. దళితకుటుం బాలకు గృహవసతి కల్పించడం సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. నిర్మాణాలు నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయించే బాధ్యత అధికారులదేనని, సంబంధిత బిల్లులు త్వరితగతిన జమచేయించాలని సూచించారు. శంకుస్థాపన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సిపిఐ నాయకులు కంచర్ల జమలయ్య, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, కోడి మల్లేష్, రామారావు, గడ్డం వెంకటేశ్వర్లు, బోయిన విజయ్ కుమార్, సత్యానారాయణాచారి, భవాని, అధికారులు రవికుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి అందుతున్న కేంద్ర సాయం

**లక్షా 80వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు**

**బీజేపీ ఏపీ అధ్యక్షులు మాధవ్**



**అమరావతి, అక్టోబర్22(నినాదం):** ఏపీకి కేంద్రం నుంచి లక్షన్నర కోట్ల సాయం అందిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు మాధవ్ తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. లక్షా 80వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. రూ.11,444 కోట్లతో విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి నిధులు కేటాయించారని చెప్పారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా 15 బిలియన్ డాలర్ల్ ఒక లక్షా 25వేల కోట్లతో విశాఖకు రావడం డబుల్ ఇంజన్ గ్రోత్‌కు ఒక చిహ్నమని పేర్కొన్నారు. విశాఖను గ్లోబల్ గ్రోత్ సెంటర్‌గా మార్చేలా అనేక కంపెనీలు, ఐటీ సంస్థలు వస్తున్నాయని వెల్లడిరచారు మాధవ్. ప్రధాని మోడీ నేతృత్వంలో ఈ ప్రాజెక్టులన్నీ ముందుకు తీసుకురావడం, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రావడం వల్ల ఏపీకి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. కర్ణాటక వంటి పక్క రాష్ట్రాలకు కంటగింపుగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు దగా కోరు రాజకీయాలు చేస్తూ.. వారి వైఫల్యాలను వారే బయట పెట్టుకుంటున్నారని విమర్శించారు. కర్ణాటకలో ఫెయిల్ గవర్నమెంట్ ఉంది కాబట్టే.. ఆ పార్టీ తరపున వారు ఆక్రోశం వెలిబుచ్చుతున్నారని వ్యాఖ్యలు చేశారు. మోడీ, చంద్రబాబులు అసాధ్యమైన అంశాన్ని సాధించి.. ప్రపంచ వ్యాప్తంగా ఏపీ గురించి చర్చించుకునేలా చేశారని ఏపీ బీజేపీ చీఫ్ తెలిపారు కృత్రిమ మేధస్సుతో అనేక ప్రయోగాలకు విశాఖ వేదిక కాబోతుందన్నారు. ఎనర్జీ సోర్స్ కింద సోలార్, విండ్, హై ఎనర్జీలను వాడేందుకు గ్రీన్ ఎనర్జీ తయారవుతుందన్నారు. టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాన్ ఫ్యాక్చరింగ్‌లో యువత ప్రతిభకు చ్కెనా తర్వాత ఏపీకే అవకాశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. అమెరికాలో ఆంక్షలు ఉండటంతో భారత దేశంలోనే వీరంతా ఉండబోతున్నారని అన్నారు. ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలు యువతకు వస్తాయని ప్రకటించారు. నరేంద్ర మోడీ, రాష్ట్ర ప్రభుత్వం సారథ్యంలో ఏపీకి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. వైజాగ్ - చెన్నై కారిడార్, బెంగుళూరు - చెన్నై కారిడార్, రాయలసీమ వైపు మరో కారిడార్‌లు రాబోతున్నాయని మాధవ్ అన్నారు. డిఫెన్స్ క్రస్టల్స్, అతిపెద్ద రిఫైనరీ, జాతీయ రహదారుల కనెక్టివిటీ అన్ని ప్రాంతాలకు పెరగడం ద్వారా అభివృద్ధి మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రానికి వెహికల్ తయారు చేసే కంపెనీలు, జిందాల్ సంస్థలు, పవర్ హౌస్‌లు ఏపీకి రాబోతున్నాయని.. డబుల్ ఇంజన్ సర్కార్ ఆధ్వర్యంలో రాయలసీమ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. మన రాజధాని అమరావతిలో గత ప్రభుత్వంలో అభివృద్ధి ఆగిపోయిందని... అమరావతితో వారంతా ఆటలాడుకుని నాశనం చేశారని మండిపడ్డారు. మోడీ సారథ్యంలో ఇప్పుడు అమరావతి నిర్మాణానికి 15వేల కోట్లు కేటాయించారన్నారు. అమరావతి నుంచి అనంతపురం వరకు జాతీయ రహదారుల అనుసంధానం కాబోతున్నాయని తెలిపారు. ఏపీ జీవనాడి పోలవరం నిర్మాణం కోసం కేంద్రం ఐదు వేల కోట్లు కేటాయించిందని అన్నారు. కుడి, ఎడమ కాలువ పనులు పూర్తి చేసి త్వరలోనే ప్రాజెక్టు పూర్తి చేస్తారని వెల్లడిరచారు. ఏపీని అన్ని విభాగాల్లో అబివృద్ధి చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అడుగులు వేస్తున్నాయన్నారు. ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో.. ప్రతిఒక్కరూ స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. భారత దేశ ఆర్థికాభివృద్ధికి దేశ ప్రజలంతా సహకారం అందించాలని ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ కోరారు.

## తుని గురుకుల పాఠశాలలో దారుణం

**అమరావతి, అక్టోబర్22(నినాదం):** బాలికకు మాయమాటలు చెప్పి పాఠశాల నుంచి బయటకు తీసుకెళ్లి ఓ కామాంధుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన తుని బాలికల గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఎనిమిదో తరగతి చదువుతున్న మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి స్కూల్ నుంచి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన నిందితుడు.. ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. విషయం తెలిసిన బాలిక బంధువులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నారాయణరావు అనే వ్యక్తి.. తరచూ గురుకుల పాఠశాలకు వెళ్లి బాలిక బంధువును అని చెప్పి ఆమెను తీసుకెళ్లేవాడని తెలుస్తోంది. కూడా గురుకుల పాఠశాలకు వచ్చిన నారాయణ... బాలికను ఎవరూ లేని ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఆపై బాలికపై అత్యాచారం చేసేందుకు యత్నించాడు. స్థానికులు గమనించి నిలదీయగా అక్కడి నుంచి పరారయ్యాడు నిందితుడు. విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు గురుకుల పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎన్ఐఏ కస్టడీకి అబూబకర్ భార్య సైరాబాను

**కడప,అక్టోబర్22(నినాదం):** కడప సెంట్రల్ జైలుకు వచ్చిన జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు.. రాయచోటిలో ఇటీవల అరెస్ట్ అయిన ఉగ్రవాది అబూబకర్ సిద్ధికి భార్య సైరా భానును కస్టడీకి తీసుకున్నారు. జులై 1న రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులు.. అబూబకర్ సిద్ధికి, మహమ్మద్ అలీని తమిళనాడు ఐబీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ ఇద్దరు ఉగ్రవాదుల భార్యలనూ అన్నమయ్య జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి కడప జైలుకు తరలించారు.

# అత్యాచారాలకు పాల్పడితే కఠిన శిక్షలు

**మహిళల జోలికి వస్తే ఉక్కుపాదంతో అణచివేస్తాం**

**గురుకుల పాఠశాల విద్యార్థిని ఘటనపై లోకేశ్**



**అమరావతి,అక్టోబర్22(నినాదం):** అత్యాచార ఘటనలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని కాకినాడ జిల్లా తుని గురుకుల పాఠశాలలో మైనర్ బాలికపై అత్యాచారయత్నం ఘటనపై మంత్రి నారా లోకేశ్ తీవ్రం గా స్పందించారు. తుని రూరల్ గురు కుల పాఠశాల విద్యార్థినిపై తాటిక నారాయణరావు అనే కామాంధుడు అత్యాచారయత్నానికి పాల్పడినట్లు తెలుసుకొని షాక్‌కు గురయ్యానని తెలిపారు. సంఘటన వివరాలు తెలిసిన వెంటనే పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని వెల్లడించారు. ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని మంత్రి లోకేశ్ హెచ్చరించారు. బాధితురాలు ధైర్యంగా ఉండేలా కౌన్సిలింగ్ ఇచ్చి, అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థినిలకు పటిష్టమైన భద్రత కల్పించాల్సిందిగా అధికార యంత్రాంగానికి మంత్రి లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. తుని గురుకుల పాఠశాల విద్యార్థినిపై నారా యణ అనే వ్యక్తి అత్యాచారానికి యత్నించడం తీవ్ర కలకలం రేపింది. స్కూల్ నుంచి బాలికకు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లిన కామాంధుడు.. ఓ నిర్మానుష్య ప్రాంతంలో మైనర్‌పై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి నిలదీయగా నిందితుడు పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు నారాయణను అదుపులోకి తీసుకున్నారు. తుని ఘటనపై పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు స్పందిస్తూ.. నారాయణరావుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కిడ్నాప్, అత్యాచారం కిందకు వచ్చే వివిధ కఠిన సెక్షన్లు నమోదు చేశామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేశామని.. సాయంత్రానికి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించనున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఏ పార్టీలకు సంబంధం లేదని.. సోషల్ మీడియాలో పార్టీల మధ్య గొడవలు సృష్టించేందుకు వీడియోలు వైరల్ చేస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు

**అమరావతి, అక్టోబర్ 22 (నినాదం):** ఏపీలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకర ణకు వ్యతిరేకంగా నిరసనలకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈనెల 28న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ధర్నాలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, అరుణ్ కుమార్, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, కారుమూరి నాగేశ్వర రావు, చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్ హయాంలో ఏడు మెడికల్ కాలేజీలు పూర్తి అయ్యాయి. అబద్ధాలు చెప్పి దబాయించడం చంద్రబాబు అల వాటే. మెడికల్ కాలేజీ ప్రైవేటీక రణను అన్ని వర్గాల ప్రజలకు వ్యతిరేకిస్తున్నారు.



వైఎస్ జగన్ ఒకేసారి 17 మెడికల్ కాలేజీలకు శంకుస్థాపన చేశారు. కోవిడ్ తర్వాత ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి అయ్యాయి. కూటమి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంది. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దుర్మార్గ చర్య. దీనిపై ప్రజల్లో కూడా వ్యతిరేకత బాగా పెరిగింది. ప్రభుత్వం వెనక్కు తగ్గే వరకు పోరాటం చేస్తాం. ఇది రాజకీయాల కోసం కాదు, రాష్ట్ర భవిష్యత్తు కోసమే. ఈనెల 28న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో నిరసన ర్యాలీలు చేస్తాం. ప్రజాస్వామ్య వాదులంతా హాజరు కావాలని కోరుకుంటున్నాం. ఇప్పటికే కోటి సంతకాల సేకరణ ఉధృతంగా జరుగుతోంది. ప్రజల అభిప్రాయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్తాం. స్వచ్ఛందంగా ప్రజా సంఘాలు, మేధావులు ఈ పోరాటంలో పాల్గొంటున్నారు. అందులో భాగంగానే ఈనెల 28న అసెంబ్లీ నియోజకవర్గాలలో ర్యాలీలు చేయబోతున్నాం. తర్వాత నవంబర్ 12న జిల్లా కేంద్రాలలో కూడా ర్యాలీలు చేస్తాం. కోటి సంతకాలు పూర్తి చేసుకుని వాటిని నవంబర్ 23న జిల్లాలకు తరలిస్తాం. అనంతరం కేంద్ర కార్యాలయానికి వస్తాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకర ణను ఆపాలి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్యం, వైద్య విద్యను అందించాలన్నది వైఎస్ జగన్ ఉద్దేశం. అందుకే 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చారు. మెడికల్ కాలేజీల నిర్మాణాలు ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతాయి. ఒక్కరోజులో ఏ కాలేజీ పూర్తి కాదు. ఎయిమ్స్ లాంటి సంస్థ పూర్తవటానికే తొమ్మిదేళ్లు పట్టింది. పులివెందుల కాలేజీ పూర్తయినా చంద్రబాబు సీట్లు రాకుండా అడ్డుకున్నారు. పాడేరు కాలేజీకి 50 సీట్లు చాలని మిగతావి రాకుండా అడ్డుకున్నారు. సంవత్సరానికి వెయ్యి కోట్లు చొప్పున నాలుగైదేళ్లు ఖర్చు చేస్తే కాలేజీలన్నీ అందుబాటులోకి వస్తాయి. పీపీపీ అంటే ప్రయివేటీకరణ కాదని చంద్రబాబు కొత్త భాష్యం చెప్తున్నారు. లాభాల కోసమే ప్రైవేటు వ్యక్తులు మెడికల్ కాలేజీలతో వ్యాపారం చేస్తారు. ఇప్పటికే ఎవరెవరికి ఏ కాలేజీని దోచి పెట్టాలో నిర్ణయం తీసుకున్నారు. ఇక పేద, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. ఇలాంటి విధ్వంసాన్ని ఏపీలో ఎప్పుడూ చూడలేదు. కానీ, తన మీడియా పవర్‌తో ఎదుటి వారిపై విమర్శలు చేస్తున్నారు' అని అన్నారు.

# బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీని రద్దు చేస్తాం

**అధికారంలోకి రాగానే చర్యలు**

**మత్స్య ఆందోళనకారులకు**

**బొత్స హామీ**




**అనకాపల్లి, అక్టోబర్ 22(నినాదం):** ప్రభుత్వం ఉంది ప్రజల ప్రాణాలను కాపాడడానికే గానీ తీయడానికి కాదని వైఎస్సార్సీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన దీక్ష 39వ రోజుకి చేరుకుంది. బుధవారం వైఎస్సార్ సీపీ బృందం వాళ్లను పరామర్శించి సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడిన అనంతరం బొత్స మీడియాతో మాట్లాడుతూ.. మత్స్యకారులు తమ కు జరుగుతున్న అన్యాయాన్ని వైఎస్ జగన్‌కు వివరించారు. ఆయన ఆదేశాలతోనే మేం ఇక్కడికి వచ్చాం. ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలను కాపాడాలి అంతేగానీ తీయకూడదు. కూటమి ప్రభుత్వానికి పేద ప్రజల పట్ల చిత్తశుద్ధి లేదు. ఎన్నికలకు ముందు బల్క్ డ్రగ్ పార్క్‌తో క్యాన్సర్, పిల్లలకు వైకల్యం వస్తుందని మంత్రి అనిత చెప్పారు. ఇప్పుడేమో ఇలా చేస్తున్నారు. అనితకు ఇది న్యాయమా?. చేతకాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోండని హెచ్చరించారు. మా జీవి తాలు నాశనం అవుతున్నాయి. ప్రాణాలు పోయి నా ఫర్వాలేదు. కానీ, బల్క్ డ్రగ్ పార్క్‌ను కట్టని వ్వం అంటూ పలువురు బొత్స వద్ద వాపోయారు. ఈ సందర్భంగా మత్స్యకారులను ఉద్దేశిస్తూ బొత్స మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మీ కోరికను నెరవేరుస్తారు. ఈ పోరాటంలో కూటమి ప్రభుత్వం పెడుతున్న కేసులను.. జగన్ అధికారంలోకి వచ్చాక తొలగిస్తారు. మీతో పాటు మేము పోరాటం చేస్తాం. మీకు అండగా మేముంటాం. తప్పు చేసిన కూటమికి శిక్ష తప్పదు. మీరు చెప్పిన ప్రతి మాటను వైఎస్ జగన్ దృష్టికి వెళ్తాం. త్వరలో రాజయ్యపేటకు జగన్ వస్తారని బొత్స తెలిపారు. జయ్యపేట దీక్షాశిబిరానికి వైఎస్సార్‌సీపీ నేతలు వెళ్లనీయకుండా పోలీసులు ఆంక్షలను విధించారు. అయితే వాటిని దాటుకుని నేతలు అక్కడికి చేరుకున్నారు. దీనిపై బొత్స మాట్లాడుతూ.. రాజయ్యపేట పర్యటనపై అనేక ఆంక్షలు పెట్టారు. కనీస మానవత్వం లేకుండా కూటమి వ్యవహరిస్తోంది. గ్రామస్తులను ఆధార్ కార్డులు చూపించమని అడుగుతున్నారు. ఏమైనా సంఘ విద్రోహశక్తులా అని బొత్స నిలదీశారు.

# తిరుమలలో కుండపోత వర్షం

**జలమయం అయిన మాడవీధులు**

**కనువిందు చేస్తున్న జలపాతాలు**




**తిరుమల,అక్టోబర్22(నినాదం):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరుమలలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో భక్తులు తడిసి ముద్దవుతున్నారు. మరోవైపు తిరుమలలో చలి తీవ్రత పెరిగింది. తిరుమల మాడవీధులన్నీ జలమయం అయ్యాయి. భక్తులు వర్షంలో తడుస్తూనే దర్శనాలకు పరుగెత్తారు. కుండపోత వర్షానికి చలి తోడు కావడంతో భక్తులు వణికి పోయారు. వర్షం ప్రభావం నేపథ్యంలో ఘాట్ రోడ్‌లో ప్రయాణించే వాహనాల డ్రైవర్లను తితిదే అప్రమత్తం చేసింది. వర్షం ప్రభావం నేపథ్యంలో భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. ఇకపోతే వర్షం కారణంగా తిరుగిరులు సరికొత్త శోభ సంతరించుకున్నాయి. శేషాచలం అటవీ ప్రాంతంలోని జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. ఎగువన కురిసిన భారీ వర్షాలతో ఒకటో కనుమరహదారిలో ఉన్న మాల్వాడి గుండం జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. అలిపిరి శ్రీవారి పాదాల చెంత ఉన్న కపిలతీర్థం జలపాతం భక్తులకు కనువిందు చేస్తోంది. ఏడుకొండల్లో పరచుకొన్న పచ్చదనం.. ఎత్తైన ప్రాంతం నుంచి దూకుతున్న జలపాతాలు భక్తులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తున్నాయి. కపిలతీర్థం వద్ద జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పుష్కరణిలో భక్తులను స్నానానికి అనుమతించడం లేదు. అయితే జలపాతాలను వీక్షించేందుకు భక్తులు ఉత్సాహం చూపారు.

# కూటమి వచ్చాక పెట్టుబడుల వెల్లువ

**5 వరకు ఇళ్లకు దరఖాస్తులకు అవకాశం**

**గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి**



**అమరావతి,అక్టోబర్22(నినాదం):** కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రానికి రూ.7.65 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి అన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా 7.28 లక్షల ఉద్యోగాలను కల్పించినట్లు తెలిపారు. అమరావతిలో మంత్రి మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాల్లో 50 వేల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మరిన్ని ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అర్బన్ ప్రాంతాల్లో వచ్చే నెల 5 వరకు అర్హుల ఎంపిక ప్రక్రియ కోసం సర్వే చేపడుతున్నాం. పట్టణాల్లో ఇళ్లు లేని పేదలు వచ్చేనెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 'ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు ఆర్టీజీఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై 75.1 శాతం ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని సర్వేలో తేలింది. ఇప్రభుత్వంలో ఎక్కడైనా, ఏదైనా తప్పు జరిగినప్పుడు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనడంలో తప్పులేదు. కొన్ని పత్రికలు కావాలనే తప్పుడు రాతలు రాస్తున్నాయి. ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో పీపీపీ విధానం అమలుపై వైకాపా నిరసనలను తీవ్రంగా ఖండిస్తున్నాం అని మంత్రి పార్థసారథి అన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కరించాలి



**విజయవాడ, అక్టోబర్ 22(నినాదం):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజి ఆర్ఎస్) అర్జీలను త్వరితగతిన పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ అధికారుల ను ఆదేశించారు. పి జి ఆర్ ఎస్, అందరికీ ఇళ్లు అంశా లపై భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ జి. జయ లక్ష్మి బుధవారం నిర్వహించిన దృశ్య మాధ్యమ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఇళక్కియ తో కలసి ఆయన పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లా డుతూ... పిజిఆర్ఎస్ అర్జీలలో అపరి ష్కృతంగా ఉన్నవాటి వివరాలు శాఖల వారీగా, మండలాల వారీగా తెలియజేయా లన్నారు. అర్జీల పరిష్కార విషయంలో అల సత్వం చూపరాదని, త్వరితగతిన పరిష్కరిం చాలని ఆదేశించారు. భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కీలక ప్రగతి సూచికల్లో (కె పి ఐ) ఐసిడిఎస్, పోలీస్ శాఖల అంశాలలో పురోగతి ఉండాలన్నారు. ఈ క్రాప్ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ లక్ష్మి నరసింహం, కెఆర్ఆర్సి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఏ.పోసి బాబు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ కుమారి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి. జ్యోతి, డి ఎస్ ఎల్ ఓ వై.మోహన్ రావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెట్టుబడులే లక్ష్యంగా చంద్రబాబు సమావేశాలు






**పెట్టుబులు లక్ష్యంగా చంద్రబాబు సమావేశాలు**

**తొలిరోజు పలు రంగాల ప్రముఖులతో చర్చలు**

**ప్రధాని మోడీ చొరవతో దేశంలో విప్లవాత్మక మార్పులు**

**చంద్రబాబుకు ప్రవాసుల ఘనస్వాగతం**

**అమరావతి,అక్టోబర్22(నినాదం):** :దుబాయ్ సహా యూఏఈ దేశాల్లోని వివిధ రంగాలకు చెందిన సంస్థలు, ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చంద్రబాబు చర్చించారు. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, పెట్రో కెమికల్స్, పోర్టులు, లాజిస్టిక్స్, ఏవియేషన్, ఇండస్ట్రియల్ పార్కులు, రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు, ఆతిథ్య రంగం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను చంద్రబాబు వారికి వివరించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు యూఏఈలో తన తొలిరోజు పర్యటనను బుధవారం ప్రారంభించారు. దుబాయ్‌లోని భారత కాన్సుల్ జనరల్ సతీష్ కుమార్ శివన్, అబుదాబీలోని డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌లతో సమావేశమయ్యారు. ప్రధాని మోదీ చొరవ వల్లే దేశంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని సీఎం అన్నారు. భారతదేశం బ్రాండ్‌ను.. ప్రధాని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారని ప్రశంసించారు. ప్రధాని మోదీ పర్యటించినన్ని దేశాలు మరే ఇతర ప్రధాని పర్యటించలేదని చెప్పారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం - పెట్టుబడులు పెరగడానికి ప్రధాని కృషే కారణమని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ కు ఉన్న 1054 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టినట్టు వెల్లడించారు. ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. యూఏఈలోని వివిధ దేశాలకు చెందిన సావరిన్ ఫండ్స్ నుంచి ఏపీలో పెట్టుబడులు పెట్టే అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అనుమతులు ఇస్తోందని సీఎం వెల్లడించారు. యూఏఈలో ఉన్న తెలుగు వారికి ఇండియన్ ఎంబసీ సహకారం అందించే అంశంపై భేటీలో చర్చ జరిగింది. ఆయా దేశాల్లో ఉన్న 4.08 లక్షల మంది తెలుగు ప్రజలకు అవసరమైన సహకారాన్ని అందించాలని ఎంబసీ ప్రతినిధులను చంద్రబాబు కోరారు. ఈ సమావేశంలో సీఎంతో పాటు మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే యూఏఐ పర్యటనపై బయలుదేరిన ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం దుబాయ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో సీఎంకు ఘనస్వాగతం లభించింది. స్థానిక భారతీయ కాన్సుల్ జనరల్ సతీష్ కుమార్ శివన్, తెలుగుదేశం పార్టీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ, దుబాయ్ నగర శాఖ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు విశ్వేశరరావు, ముక్కు తులసి కుమార్, తెలుగు సంఘం అధ్యక్షుడు మసీయోద్దీన్, ఇతర అధికారులు సీఎంకు స్వాగతం పలికారు. చంద్రబాబును ఆహ్వానించేందుకు ప్రవాసాంధ్ర మహిళలు కూడా పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి తరలివచ్చారు. యూఏఈలో సీఎం మూడు రోజులపాటు పర్యటించనున్నారు.





## 23 నుంచి కేంద్ర ప్రభారీ అధికారి పర్యటన

**-నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్ నేలపట్ల అశోక్‌బాబు**



**విజయవాడ, అక్టోబర్22 (నినాదం):** జిల్లాలోని ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద ఉన్న పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండ లాల్లో పర్యటించి.. లక్ష్యా ల సాధనలో పురోగ తిని స్వయంగా తెలుసుకునేందుకు కేంద్ర ప్రభారీ అధికారి / నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్ నేలపట్ల అశోక్‌బాబు ఈ నెల 23వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. నెల 23వ తేదీన పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలుతో పాటు ముండ్లపాడు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యటించనుండగా.. 24వ తేదీన ఇబ్రహీంపట్నం మండలంలో ఇబ్రహీంపట్నంతో పాటు కాచవరం, కేతనకొండ, కొండపల్లి, జూపూడి, గుంటుపల్లి గ్రామాల్లో రోజంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధి కారులతో సమావేశం నిర్వహిస్తారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లు, అంగన్వాడీ కేంద్రాలు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే), ఉన్నత పాఠశాలలను సందర్శిస్తారు. అదేవిధంగా మండలస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన కీలక సామాజిక, ఆర్థిక సూచికల్లో పురోగతిపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేస్తారు. పర్యటనలో భాగంగా ఆయా గ్రామాల ప్రజలతోనూ ప్రభారీ అధికారి అశోక్‌బాబు మమేకమవుతారు.

## కాలుష్యకారక పరిశ్రమలను
# నిలువరించాల్సిందే !



పరిశ్రమలు పెట్టుబడుల వేటలో కాలుష్యం గురించి పాలకులు పట్టించుకోవడం లేదు. పెట్టుబడులు వస్తున్నాయని, ఉపాధి,ఉద్యోగాలు దక్కుతున్నాయని ఊదరగొడుతున్నారు. దీపావళి టపాసులకే వాయు కాలుష్యం తట్టుకోలేక పోతున్నాం. ఈక్రమంలో కాలుష్యకారక పరిశ్రమల స్థాపనలో ఆలోచన చేయాల్సి ఉంది. రాష్ట్రంలో తీరప్రాంతం, సెజ్‌లో ఏర్పాటైన ఔషధ, రసాయన పరిశ్రమలతో ఆ పరిసర ప్రాంత ప్రజలకు పీల్చే గాలి, తాగే నీరు ప్రమాదకరంగా మారాయి. ప్రాణాంతక వ్యాధులకు అవి కేంద్రంగా వున్నాయి. పర్యావరణ పరిరక్షణ బాధ్యతను అటు ప్రభుత్వమూ, ఇటు పరిశ్రమాధిపతులు పూర్తిగా వదిలేశారు. కోట్ల విలువైన రాయితీలు, సదుపాయాలు కల్పించి పరిశ్రమాధిపతులకు లాభాలు సమ కూర్చడం పైనే ప్రభుత్వాలు శ్రద్ధ చూపుతున్నాయి. ఆ పరిశ్రమలకు భూములిచ్చిన రైతులు, ఉపాధి కోల్పోయిన పేదలు, వృత్తిదారులను విస్మరించాయి. ఇప్పటికే ఉప్పాడ కార్మికులు సముద్రంలో కలుస్తున్న కాలుష్యాన్ని నిలిపివేయాలంటూ పాలకులను నిలదీసారు. చేపలవేట సాగడం లేదని అంటున్నారు. దీనిపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణం చొరవ తీసుకుని సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు తాజాగా అనకాపల్లి సెజ్ ఏర్పాటుపై మత్స్యకారులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం ఉంది ప్రజల ప్రాణాలను కాపాడడానికే గానీ తీయడానికి కాదని వారు అంటున్నారు. బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన దీక్ష 39వ రోజుకి చేరుకుంది. నిజానికి ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలను కాపాడాలి అంతేగానీ తీయకూడదు. ఎన్నికలకు ముందు బల్క్ డ్రగ్ పార్క్‌తో క్యాన్సర్, పిల్లలకు వైకల్యం వస్తుందని మంత్రి అనిత చెప్పారు. ఇప్పుడేమో ఇలా చేస్తున్నారు. అనితకు ఇది న్యాయమా?. చేతకాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోండి..అంటూ మత్స్యకారులు డిమాండ్ చేస్తున్న తీరును ఆలోచించాలి. మా జీవితాలు నాశనం అవుతున్నాయి. ప్రాణాలు పోయినా ఫర్వాలేదు. కానీ, బల్క్ డ్రగ్ పార్క్‌ను కట్టనివ్వం అన్న మాటకు కట్టుబడి దీక్షలు చేస్తున్నారు. రాష్ట్రంలో లక్షల కోట్ల పెట్టుబడులతో వచ్చే పరిశ్రమల్లో వేలాది మందికి ఉపాధి కలగనుందని ప్రభుత్వం చెబుతున్న మాటలను ప్రజలు విశ్వసించడం లేదనడానికి ఇదో నిదర్శనం మాత్రమే. పైగా ఆ పరిశ్రమల ఏర్పాటు కోసం జరిగే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలన్న డిమాండ్‌పై ఏక మవడం నూతన పరిణామం. ఉపాధి పేరుతో మోసగించి కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు లబ్ది చేకూర్చాలన్న ప్రభుత్వ పెద్దల ఆరాటానికి ప్రజా పోరాటాలు బ్రేకులు వేస్తున్నాయి. పోలీసు బలగాలతో ప్రజలను భయపెట్టేందుకు యత్నించినా చాలా ప్రాంతాల్‌ఓ తిరగబడుతున్నారు.ప్రజల ఆగ్రహం ముందు అణచివేత, నిర్బంధ చర్యలు సాగవని జన సమూ హాలు పాలకులను హెచ్చరిస్తున్నాయి. బల్క్ డ్రగ్ ఒక్కటే కాదు ఎక్కడ భూ సేకరణ జరిగినా రైతులు తిరగబడుతు న్నారు. పరిశ్రమలకు ఒకనాడు భూములిచ్చిన రైతులు ఇపుడు అడుక్కు తింటున్నారు. భూములిచ్చి, ఉపాధి లేక బతుకు తెరువుకు ఊరూవాడా తిరుగుతున్న రైతులు, పేద లు, మత్స్యకారులు, చేతివృత్తిదారులకు అనేక చేదు అనుభ వాలున్నాయి. తెలంగాణ, ఆంధ్రా అన్న తేడా లేకుండా పరిశ్రముల, రోడ్లు, ప్రాజెక్టులకు భూములు లాక్కోవడం వారిని వదిలివేయడం ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. పోలవం బాధితులు, మల్లన్నసాగర్ బాధితులు ఇదే కోవలోకి వస్తారు. ఈ క్రమంలోనే ప్రైవేటు పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన రూపంలో ప్రజాభిప్రాయ సేకరణలో తెలియ జేస్తున్నారు. అనకాపల్లి జిల్లాలోని సక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కు వద్దంటే వద్దని ప్రజలు భీష్మించుకున్నారు. అయినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. ప్రజలు కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో తమ అభ్యంతరం తెలిపారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమలను ప్రజలు వ్యతిరేకిస్తుం టే, పెట్టి తీరాలని ప్రభుత్వం మొండిగా వుంది. ఆ ఆలోచన విర మించుకొనేలా ఒత్తిడి పెంచాలని నిర్వాసితులు, బాధిత మత్స్యకారులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఆ ప్రాంత పర్యటనకు వెళ్లిన మంత్రి వాహనం ముందు తాటిచెట్టు అడ్డంపెట్టి మరీ పోరాడారు. ప్రజాపోరాటంతో తాత్కాలికంగా పనులు నిలిపివేస్తు న్నట్టు మంత్రి ప్రకటించాల్సి వచ్చింది. ఇదే క్రమంలో ఆదానీకి చెందిన గంగవరం పోర్టు ధూళి, దుమ్ముతో భరించలేని కాలుష్యంతో బాధపడుతున్న ప్రజల్లో అంబూజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై ఆగ్రహం వెల్లువెత్తింది. గాలిని, నీటిని కలుషితం చేస్తున్నా పట్టించు కోవడం మానేశాయి. చివరకు కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్ట రీల అధికారుల తనిఖీలపై ఆంక్షలు విధించి విచ్చలవిడితనానికి అవకా శం కల్పించాయి. విశాఖ నగర వాసుల ఆరోగ్యాలను కాలుష్యంతో దెబ్బ తీస్తున్న విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, గంగవరం పోర్టును పర్యావరణ ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్టీపిసి కాలుష్యంతో మూల స్వయంవరం, సోమినాయుడుపాలెం ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. పరవాడ ఫార్మా సిటీకి అనుకొనివున్న గ్రామాలు వాయు కాలుష్యంతో తల్లడిల్లుతున్నాయి. పరిశ్రమలు వ్యర్థ రసాయన జలాలను శుద్ధి చేయకుండా చెరువుల్లోకి విడిచిపెడుతున్నాయి. ర్యాంకీ యాజమాన్యానికి కాలుష్య నియంత్రణ అధికారులు నోటీసులు జారీ చేసినా? చర్యలేమీ తీసుకోలేదు. ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరు కాలుష్యమయమైంది. అచ్యుతాపురం సెజ్ లోని వ్యర్థాలను శుద్ధి చేయకుండా పూడిమడక వాగులోకి వది లేయడంతో చేపలు చనిపోయి మత్స్యకారులు పెద్ద ఎత్తున ఆందో ళనకు దిగారు. విచారణలో వ్యర్థాలను శుద్ధి చేయడంలేదని తేలడంతో నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ప్రజలకు హానికరంగా నిబంధనలు సవరించి కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చడానికి సిద్ధమైంది. ప్రజల ఆరోగ్యాలు దెబ్బ తినకుండా వుండాలంటే పర్యావరణ ప్రమాణాలను పరిశ్రమలు పాటించేలా నిబంధనలు కఠినతరం చేయాలి. అలాగే కాలుష్యకారక పరిశ్రమలతో పర్యావరణాన్ని దెబ్బతీసే పరిశ్రమలను దూరం పెట్టడమే మంచిది.

ఎడిటోరియల్

# అంతుచిక్కని ప్యారిస్ మ్యూజియం చోరీ

## రూ.895 కోట్లు విలువైప
## పురాతన వస్తువులు మాయం

**ప్యారిస్:** ఫ్రాన్స్‌లో ప్రఖ్యాత లౌవ్రే మ్యూజియంలో చోరీ ఘటన యావత్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసింది. అత్యంత భద్రత కలిగిన ఈ మ్యూజియంలోకి చొరబడిన దుండగులు కేవలం నిమిషాల వ్యవధిలో విలువైన ఆభరణాలు దొంగలించి పరారయ్యారు. చోరీ అయిన నగల విలువ దాదాపు రూ.895 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అక్టోబరు 19న పారిస్‌లోని లౌవ్రే మ్యూజియంలో చోరీ జరిగింది.మ్యూజియంలో ఓవైపు నిర్మాణం జరుగుతుండగా.. అక్కడి నుంచి దుండగులు లోపలికి చొరబడ్డారు. అనంతరం సరుకు రవాణా ఎలివేటర్‌లో అపోలో గ్యాలరీలోకి ప్రవేశించారు. నెపోలియన్ కాలం నాటి వస్తువులు, ఆభరణాలు ఉన్న గ్యాలరీ అద్దాలను పగలగొట్టి అందులోని తొమ్మిది వస్తువులను దొంగలించారు. వీరు వెళ్తుండగా.. అందులోని ఓ ఆభరణం మ్యూజియం బయట పడిపోయింది. మిగతా ఆభరణాల విలువ 88 మిలియన్ యూరోలు (భారత కరెన్సీలో దాదాపు రూ.895 కోట్లు) ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ చోరీకి పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు దాదాపు 100 మందితో కూడిన దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ దొంగతనం చేసింది ఎవరనేది ఇంతవరకూ తెలలేదు. అయితే కరుడు గట్టిన దొంగల ముఠా పింక్



పాంథర్స్ పని అయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చోరీకి పాల్పడింది పింక్ పాంథర్స్ గ్యాంగ్ అని చెప్పేందుకు ఎలాంటి ఆధారాల్లేనప్పటికీ చోరీ జరిగిన తీరు ఆ ముఠాను గుర్తుకుతెస్తోంది. వీరు గప్‌చుప్‌గా వస్తారు. ఎలాంటి తొట్రుపాటు లేకుండా పని ముగించుకొని వెళ్లిపోతారు. మ్యూజియంలో చోరీకి పాల్పడిన వారు దొంగతనాల్లో ప్రొఫెషనల్స్‌గా కన్పించారు. ఇంతవరకూ వారి ఆచూకీ దొరకలేదు. పక్కా సమాచారం, ప్రణాళికతో దొంగతనానికి పాల్పడటం చూస్తుంటే పింక్ పాంథర్స్ పనే అనిపిస్తోంది అని ఫ్రాన్స్ స్క్వాడ్ బ్రూ'ది స్వీనీ' మాజీ చీఫ్ బ్యారీ ఫిలిప్స్ అభిప్రాయపడ్డారు. ఈ దొంగల ముఠా గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో భారీ చోరీలకు పాల్పడింది. అందరూ చూస్తుండగానే దొంగతనాలు చేయడం వీరి నైజం. కేవలం ఆభరణాలు, వజ్రాలనే దోచుకుంటారు. ఇప్పటివరకు 35 దేశాల్లో దాదాపు 500 మిలియన్ డాలర్ల ఆభరణాలను ఈ గ్యాంగ్ దొంగిలించినట్లు ఆధారాలున్నాయి. వీరి ముఠాలో ఎక్కువ మంది తూర్పు ఐరోపా దేశస్థులే ఉంటారు. కొన్ని రంగాల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తులను రిక్రూట్ చేసుకుని చోరీలకు పాల్పడుతుంటారు. 1990ల్లో జరిగిన బోస్నియా యుద్ధంలో పాల్గొన్న సెర్బియన్ స్పెషల్ ఫోర్సెస్ సభ్యులు కూడా ఈ ముఠాలో ఉన్నట్లు గతంలో ఇంటర్‌పోల్ గుర్తించింది. మాజీ సైనికులు కావడంతో మిలిటరీ తరహా క్రమశిక్షణతో ఎ÷-లానింగ్ చేయడం ఈ గ్యాంగ్ అలవాటు.

టార్గెట్ చేసే ప్రాంతంపై ముందుగానే నిఘా ఉంచుతారు. ఆ తర్వాత పథక రచన చేస్తారు. ఒకసారి చోరీ పూర్తయిన తర్వాత వెంటనే నకిలీ పాస్‌పోర్టులతో దేశం దాటేస్తారు. వీరికి అంతర్జాతీయంగా నెట్‌వర్క్ ఉంది. దొంగతనం చేసిన ఆభరణాలు, వజ్రాలను కరిగించడం లేదా వాటి ఆకృతి మార్చి మార్కెట్లో విక్రయిస్తుంటారని గత దర్యాప్తుల్లో తేలింది. ఓసారి ఈ పింక్ పాంథర్స్ గ్యాంగ్ దుబాయ్‌లోని ఓ మాల్‌లో చోరీకి పాల్పడింది. ఆ మాల్‌లోని నగల దుకాణంలోకి కార్లతో దూసుకెళ్లి చేతికందినన్ని వజ్రాలు, ఆభర ణాలు తీసుకుని కేవలం 45 సెకన్లలో అక్కడి నుంచి పరారయ్యారు. జపాన్, బ్రిటన్ చరిత్రల్లోనే అతిపెద్ద నగల చోరీకి పాల్పడింది ఈ గ్యాంగే. ప్రముఖ హాలీవుడ్ చిత్రం పింక్ పాంథర్‌లో చూపించిన ఓ ట్రిక్ లాంటిదే చేసి 2003లో లండన్‌లోని ఓ నగల దుకాణంలో వజ్రాలను చోరీ చేశారు. అప్పటి నుంచి ఈ గ్యాంగ్‌కు పింక్ పాంథర్ అని పేరొచ్చింది.

# మహిళలను ఉగ్రకుట్రలోకి లాగే యత్నం

## ఉగ్రవాదంపై జైషే ఆన్‌లైన్ కోర్సులకు ప్లాన్
### పలు జాతీయ మీడియాల్లో కథనాలు

**ఇస్లామాబాద్:** మహిళలను మతపరమైన ఉగ్రవాదంలోకి లాక్కొచ్చేందుకు జిహాదీ గ్రూపులు కొత్త స్కెచ్ వేస్తున్నాయి. దీంతో తమ ఉగ్రముఠాను విస్తరించాలన్న కుట్రలతో పనిచేస్తున్నట్లు సమాచారం. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకునేందుకు తొలిసారి ప్రత్యేకంగా జైషే మహిళా బ్రిగేడ్‌ను ఏర్పాటు చేసినట్లు ఇటీవల నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటైన జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ మహిళలకు ఉగ్రవాదంపై ఆన్‌లైన్ కోర్సులు నిర్వహించనున్నట్లు నిఘా వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు తెలిపాయి. ఈ కోర్సుకు 'తౌఫత్ అల్ ముమినాత్'గా పేరు పెట్టినట్లు తెలుస్తోంది. జైషే చీఫ్ మసూద్ అజార్ చె÷-లలెళ్లు సాదియా అజార్, సమైరా అజార్ దీనికి నాయకత్వం వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రంపై భారత్ బాంబులు జారవిడిచిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో మసూద్ అజార్ కుటుంబానికి



చెందిన 10 మంది మృతి చెందారు. మృతుల్లో మసూద్ బావ, సాదియా భర్త యూసఫ్ అజార్ కూడా ఉన్నాడు. కాగా మసూద్ మరో సోదరి సమైరా భర్త.. పుల్వామా ఉగ్రదాడి కుట్రదారు ఉమర్ ఫరూక్ గతంలో భారత భద్రతా దళాల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ప్రస్తుతం వీరిరువురూ మహిళా బ్రిగేడ్ సభ్యులకు ఆన్‌లైన్ కోర్సుల్లో మతపరమైన, జిహాద్‌కు సంబంధించిన పాఠాలను బోధించనున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇతర మహిళలను కూడా ఉగ్రవాదం వైపు ఆకర్షించడానికి ఈ బ్రిగేడ్ సభ్యులు పని చేస్తున్నట్లు తెలిపాయి.

ఈ మహిళ బ్రిగేడ్‌లో జైషే కమాండర్ల భార్యలతో పాటు బహవల్‌పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్ వంటి ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన మహిళలను సభ్యులుగా నియమించుకున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 8నుంచి సెషన్లు ప్రారంభం కానున్నాయని.. ఇందులోభాగంగా ప్రతిరోజు 40నిమిషాల పాటు మసూద్ చెలెళ్లు, కమాండర్ల కుటుంబసభ్యులు మహిళలకు పాఠాలు బోధిస్తారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకోసం మహిళా బ్రిగేడ్‌లోని సభ్యుల నుంచి కొంత మొత్తంలో విరాళాలు కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త మహిళా బ్రిగేడ్ భారత్‌లో తన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఇటీవల నిఘా వర్గాలు హెచ్చరించాయి. సోషల్ మీడియా, ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లతో జమ్మూకశ్మీర్, యూపీ వంటి ప్రాంతాల్లో మహిళలను ఈ బ్రిగేడ్‌లో చేరేలా ఆకర్షించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో భారత అధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం.

# తెలంగాణలో బాల కార్మికుల శాతం తగ్గు ముఖం!

తెలంగాణలో బాలకార్మికులు,దేశంలో బాల కార్మికుల సమస్య గురించి ఈ మధ్యన మనం తరచుగా వార్త పత్రికలలో చూస్తున్నాం. అసలు బాల కార్మిక వ్యవస్థ అనగా దేశంలో ఉద్యోగ అవకాశాలు తగినంత స్థాయిలో లేనప్పుడు బాల బాలికలు బాల కార్మికులుగా మారే అసమానత అధికంగా ఉండడమే. 1990బి1991 లో తెలంగాణలోనీ బాల కార్మికుల శాతం 8.8% కాగా అది 2011బి 12 నాటికి 0.2 శాతానికి పడిపోయింది. తత్ఫలితంగా తెలంగాణలో బాల కార్మికుల సగటు తగ్గుదల భారతదేశ సగటు కంటే తక్కువగా ఉంది. తెలంగాణలో బాలుర కంటే బాలికలు ఎక్కువ మొత్తంలో బాల కార్మికులుగా ఉన్నారు. జాతీయస్థాయిలో పట్టణ ప్రాంత బాల కార్మికుల శాతంలో బాలికల కంటే బాలురే ఎక్కువ. తెలంగాణ ప్రభుత్వ చేపట్టిన చర్యల ఫలితంగా బాల కార్మికుల శాతం తగ్గు ముఖం పడుతుంది. దీనికి తోడు బాలబాలికల విద్య ప్రాముఖ్యత పట్ల సమాజంలో అవగాహన పెరగడం బాల కార్మికుల శాతం తగ్గుదలకు ముఖ్య కారణమయ్యాయి.

తెలంగాణలో గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో బాల కార్మికులు: తెలంగాణలో 2001 నుండి 2011 మధ్య కాలంలో గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో బాల కార్మికుల స్థితి ఆర్థికంగా వెనకబాటు తనం పేదరికం లాంటి అంశాలు బాల కార్మికుల శాతం పెరగడానికి గల ప్రధాన కారణాల య్యాయి. 2001 వివరాల ప్రకారం తెలంగాణలో మహబూబ్నగర్, మెదక్, ఖమ్మం, జిల్లాలో బాల కార్మికులు అధికంగా ఉండటానికి గల ప్రధాన కారణం వారు ఆర్థికంగా వెనుకబడి ఉండడమే అని సర్వేల ద్వారా తెలిసింది.ఈ జిల్లాల్లో బాలుర కంటే బాలికలే అధిక మొత్తంలో బాల కార్మికులుగా ఉన్నారు.ఈపరిస్థితి పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ఒకే రకంగా ఉంది. హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో బాల కార్మికులు ఎక్కువగా ఉన్నారు. గ్రామీణ ప్రాం



తాల్లో బాలికలు అధిక మొత్తంలో బాల కార్మికులు కాగా పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా బాల కార్మికులుగా ఉన్నారు.2011 వివరాల ప్రకారం రాష్ట్రంలో బాల కార్మికులు అత్యధిక స్థాయిలో తగ్గారు. 2011 వివరాల ప్రకారం హైదరాబాదులో బాల కార్మికులు అత్యధికంగా ఉన్నారు .2011లో కూడా మహబూబ్నగర్ అదిలాబాద్ ఖమ్మం జిల్లాలలో గ్రామీణ ప్రాంతాల్లో బాల కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారు. 2011 సంవత్సరం నాటికి తెలంగాణలో బాల కార్మికుల స్వరూపం మారిపోయింది. రాష్ట్రంలో హైదరాబాద్ అదిలాబాద్ మహబూబ్నగర్ జిల్లాలో బాల కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారు. సామాజిక వర్గపరంగా చూసినప్పుడు అతి పేద వర్గాలే ఎక్కువగాబాల కార్మికులు ఎక్కువగా ఉన్నారు. అయితే ఈ రెండు సామా జిక వర్గాలలో బాలిక బాలుర కంటే అధికసంఖ్యలో బాల కార్మికులుగా ఉన్నారు. తెలంగాణలో ఉద్యోగిత నిరుద్యోగిత సంబంధిత విశ్లేషలను అనుకూల పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయి. రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో శ్రామికులు ఎక్కువగా ఉండడంవల్ల ఉపాంత నిరుద్యోగత వల్ల బాల కార్మిక వ్యవస్థ ఎక్కువగా ప్రబలిపోయింది.ఇతర రాష్ట్రాలలో మాదిరిగా తెలంగాణలో కూడా బాల కార్మికులు ఉన్నప్పటికీ వీరి సంఖ్య చెప్పుకోదగ స్థాయిలో తగ్గిపోయింది.ఇందుకు ప్రధాన కార ణం విద్యా వ్యవస్థ విధానంలో చోటుచేసు కున్న మార్పులే. ఇందుకు గల ముఖ్య కార ణంగా చెప్పవచ్చు. ఇతర జిల్లాలలో పోల్చిన పుడు హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాలలోబాలకార్మికులు అత్యధికంగా ఉన్నారు.మొత్తానికి ఉద్యోగిత శ్రామికుల పనిలో పాల్గొనే శక్తి కారణంగా నిరుద్యోగిత పెరుగుతూ ఉండడంతో రాష్ట్రంలో నిరుద్యోగ స్థాయిలో తగ్గుదల కనిపిస్తుంది.


**తెలంగాణప్రభుత్వ చర్యలు:**
తెలంగాణలో బాల కార్మిక వ్యవస్థను రూపుమాపటానికి అనేక చర్యలు తీసుకుంటుంది. ఉద్యోగిత శ్రామికులు పనులు పాల్గొనే రేటు క్రమంగా పెరుగుతూ ఉండ డంతో రాష్ట్రంలో నిరుద్యోగత కూడా తగ్గుదల కనిపిస్తూ ఉంది.కాగా ప్రాంతాలపరంగా లింగ పరంగా సామాజిక వర్గాలు, బాల కార్మికుల స్థాయి పరంగా రాష్ట్రంలో అసమానతలను ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఈ అసమాతలను రూపుమాపడానికి తెలంగాణ ప్రభుత్వం ఎన్నో చర్యలను తీసుకుంటుంది. పట్టణ ,గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమలను ప్రోత్సహించి నిరుద్యోతను రూపుమాపి బాల కార్మిక వ్యవస్థను లేకుండా అనేక పథకాలను ప్రవేశపెట్టింది. బాల కార్మిక వ్యవస్థ రూపుమాపటానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక పథకాలను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా బాల కార్మిక వ్యవస్థను పెగిలించేందుకు ఆపరేషన్ ముస్కాన్ లాంటి పథకాలను ప్రవేశపెట్టి బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడంలో తన సాయశక్తులా కృషి చేస్తూనే ఉంది.



పందిరి.
శ్రీనివాసులు.
ఎంఏ (జాగ్రఫీ) బిఈడి,
ఎంసీజే (జర్నలిజం), పీజీ
డీసీజె (జర్నలిజం).
ఉస్మానియా యూనివర్సిటీ

## భారత్‌పై సుంకాలు
# తగ్గించే యోచన

### ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై అమెరికా ఆసక్తి



**వాషింగ్టన్:** సుంకాలను తగ్గించేందుకు భారత్ అమెకాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరనుంది. దీర్ఘకాలంగా నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందానికి భారత్-అమెరికాలు చాలా దగ్గరగా ఉన్నాయని, దీంతో భారత దిగుమతులపై అమెరికా సుంకాలు 50శాతం నుండి 15 నుండి 16 శాతానికి తగ్గనున్నాయని సంబం ధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇంధనం, వ్యవసాయంపై ఆధారపడిన ఈ ఒప్పందంతో, క్రమంగా భారత్ రష్యా నుండి ముడిచమురు దిగుమతులు తగ్గించుకునే అవ కాశం ఉందని తెలిపాయి.సంబంధిత వర్గా లను ఉటంకి స్తూ ఈ అంశంపై బుధవారం జాతీయ మీడి యాలో ఒక కథనం ప్రచురితమైంది. అమెరికాతో చర్చ ల్లో భాగంగా, జన్యుపరంగా మార్పులు చేయని మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులను పెంచడానికి భారత్ అను మతించే అవకాశం ఉందని ఆ కథనం పేర్కొంది. ఈ ఒప్పం దంలో సుంకాలు మరియు మార్కెట్ యాక్సెస్‌ను క్రమానుగతంగా సమీక్షించే యంత్రాంగం కూడా ఉండవచ్చని తెలిపింది.ఈ నెలలో జరగనున్న ఏసియన్ శిఖరాగ్ర సమా వేశంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని నివేదించింది. భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ, వైట్‌హౌస్ స్పందించాల్సి వుంది. మంగళవారం భారత ప్రధాని మోడీతో మాట్లాడానని, ఎక్కువగా వాణిజ్యంపై దృష్టిసారించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొ న్నారు. ఇంధనంపై కూడా చర్చలు జరిపామని ఆయన అన్నారు. రష్యా నుం డి భారత్ చమురు కొనుగోళ్లను పరిమి తం చేస్తుందని మోడీ తనకు హామీ ఇచ్చారని చెప్పుకొ చ్చారు. అయితే ట్రంప్, తాను చర్చలు జరిపామని మోడీ కూడా స్పష్టం చేశారు. చర్చలకు సంబంధించిన వివరాలు వెల్లడించలేదు.

## ఆరువేలు తగ్గిన
# బంగారం ధరం

### అంతర్జాతీయ పరిణామాలతో తగ్గుదల



**హైదరాబాద్,అక్టోబర్22(నినాదం):** రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్న బంగారం బుధవారం భారీతగ్గుదలను నమోదు చేసింది. ఒక్క రోజులోనే ఆరు వేల రూపాయలు తగ్గింది. హైదరా బాద్‌లో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెటర్ల పది గ్రాముల బంగారం ధర బుధవారం ఉదయం రూ.1, 27, 200కు చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,16, 600కి చేరింది.అంతర్జాతీయ మార్కెట్లో మంగళవారం ఔన్స్ (31.10 గ్రాములు) ధర తగ్గడం వల్లే బంగారం ధరల తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది. ఔన్స్ 24 క్యారెట్ల బంగారం ధరం ఏకంగా 245 డాలర్లు క్షీణించింది. 4097 డాలర్లకు దిగి వచ్చింది. మరోవైపు వెండి కూడా ఔన్స్ ధర 3.9 డాలర్లు తగ్గి 48.39 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో వెండి ధరలు కిలోకు దాదాపు రూ.2 వేలు తగ్గి రూ.1.80 లక్షలకు చేరుకున్నాయి. 2013 తర్వాత ఈ రెండు లోహాలు ఒక్క రోజులో ఇంత భారీగా పతనం కావడం ఇదే తొలిసారి. ఈ రెండు లోహాలు గరిష్ఠాలకు చేరువు కావడం, అంతర్జాతీయంగా డాలర్ తిరిగి బలోపేతం కావడం, పలు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లబడడం అంతర్జాతీయ విపణిలో బంగారం ధర పతనానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. మంగళవారంతో పోలిస్తే 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.6 వేలు తగ్గింది. ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరిన బంగారం, వెండి లోహాల్లో మదుపర్లు లాభార్జనకు దిగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త ఉపశమించడం ఇందుకు కారణమని బులియన్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.మరోవైపు విజయవాడలో 24 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,27, 200కు చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,16,600కు చేరుకుంది. కిలో వెండి ధర రూ.1,62,000కు చేరుకుంది.

# "అకాల మృత్యు హరుడు... ధర్మపురి యముడు"

## భారతావనిలో అపురూప ఆలయం
### యమ ద్వితీయ సందర్భంగా

"భూషణవికాస శ్రీధర్మ పుర నివాస దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరులు శేషప్ప రాసిన నరసింహ శతక పద్యాల మాధుర్యాన్ని ఆస్వా దించని, తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. భారతీయ ప్రాచీన అర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు నెలవుగా, అనాది కాలంగా హైందవ ధర్మ ప్రచారం కేంద్ర బిందు వుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి, ఆస్తిక ప్రపం చానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా విరాజిల్లు తున్నది సుప్రసిద్ధ గోదావరి తీరస్థ తీర్థమైన ప్రాచీన ధర్మపురి క్షేత్రం. తెలుగునేలపై సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవ నారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, హరి హర క్షేత్రంగా, పౌరాణిక, ఐతిహాసిక చారిత్రక ప్రాధా న్యతను సంతరించు కున్నది క్షేత్ర రాజ్యం. బ్రహ్మాండ, స్కం దాది పురాణాలలో, ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం నిక్షిప్తమై ఉంది. ఈ క్షేత్ర దేవస్థాన అంతర్గతంగా ఉన్న యమధర్మరాజు మందిరం, విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతావనిలోనే అరుదుగా, అపురూపంగా, క్షేత్రంలో వెలసిన "యమధర్మరాజును దర్శిస్తే", "యమపురి" ఉండ బోదని ప్రతీతి. హిరణ్యకశిపుని సంహరించిన అనంతరం ఉగ్ర నరసింహ స్వామిని శాంతింప చేసేందుకు, బ్రహ్మాది దేవతలు పుణ్య తీర్థం, పవిత్ర క్షేత్రము అయిన ధర్మపురిలో తపో, యజ్ఞ, ధ్యానం ఆది సత్కర్మలను ఒనరించి నట్లు స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకానొక సమయాన యమధర్మరాజు, తన లోకమునందు అనేక శారీరక బాధలను అనుభవించుచున్న పాపులను గాంచి, నిట్టూ ర్పులు విడిచి, తనలో తాను విచారిం చెను. పుణ్యాత్ములను దర్శించిన చో పుణ్యము, పాపాత్ములను చూచినచో పాపమే లభించునని, నిత్యము పాపులను దర్శించుట వల్ల, తనకు పాప సంచయమే కలుగుతున్నదని, తనయందు స్వయం కృత పాపం అనునది ఏమాత్రము లేకున్నను, పాపుల నిత్య



దర్శనంతో మనశ్శాంతి కలగడం లేదని తలంచి, మనశ్శాం తిని పొందుటకు పుణ్యక్షేత్ర దర్శన ప్రయాణొన్ముఖుడై, సమస్త క్షేత్రములను తిరిగెను. చివరకు ధర్మపురికి రాగా ఈ క్షేత్రమున గోదావరి నది స్నానము ఆచరించ గానే, యము నకు మనశ్శాంతి కలిగెనని, పాపాత్ముల దర్శన దోషములు తొలగెగని, బ్రహ్మాండం, స్కాంద పురాణాంతర్గత "ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం" ఆధారంగా నైమిశారణ్యంలో సూత పౌరా ణికుడు, శౌనకాది మహర్షులకు వివరించినట్లు నారదుడు పృథు మహారాజుకు క్షేత్ర మహిమను తెలిపినట్లు వివరించ బడింది. యమధర్మరాజు నరసింహుని మందిరానికి ఏగి, చేసిన పూజలకు ప్రసన్నుడైన నరసింహుడు, యమధర్మరాజును తన సన్నిధిలో నివసించమని తెలిపెనని పురాణాల ఆధారం. యముడు గోదావరిలో స్నానమాచరించిన స్థలమునకు "యమ కుండము" అని పేరు కలిగినట్లు, అచట స్నానమాచరించి, నరసింహుని పూజించు వారికి యమ లోక బాధలు కలుగకుండా ఉండు న్నట్లు, సర్వ పాప విముక్తి కలుగునట్లు, నరసింహుడు వరం ఇచ్చినట్లు, యమ ధర్మరాజు తన అంశ రూపమును, నరసింహ మందిర పురో భాగమున నిలిపెనని, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. దేవస్థానంలో యోగానంద నరసింహ ప్రధానాలయం ముందు భాగాన, ఉంది యమ ధర్మ రాజ మందిరం. కోరలతో, యమ దండాన్ని ధరించిన భీకరాకార ఆరు అడుగుల భారీ విగ్రహం ఇందుంది. "దక్షిణాదిభిముఖీ గంగా, యత్ర దేవో నృకేసరి, తత్ర శ్రీర్విజయో ర్భూతి: కాశ్య యశ్వత గుణం భవేత్", అని అని దక్షిణ అభి ముఖియై ప్రవహిస్తున్న



గోదావరి తీరస్థమైన, ధర్మపురి క్షేత్రం విశిష్టతను కలిగి ఉన్నది. వేరే ఎక్కడ కాన రాని విధంగా, ధర్మపురి క్షేత్రం వద్ద గోదావరి దక్షిణ వాహినిగా ప్రవహిస్తు న్నది. అష్టదిక్పాలకులలో ఒకరైన యముడు, దక్షిణ దిశకు అధిపతి. అంతేకాక గ్రహాల దృష్ట్యా, కుజుడు దక్షిణ దిశకు అధిపతి. కుజ గ్రహానికి మూలాధిపతి నరసింహుడు అని పరాశరుడు బృహత్ పరాశర హెూరా శాస్త్రం నందు నుడివి ఉన్నాడు. కనుక ధర్మపురిలో దక్షిణ వాహినిగా ఉన్న గౌతమి యందు దక్షిణాభిముఖులై, స్నానాలు ఆచరిస్తే నరసింహుని దర్శిస్తే, నరక బాధలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ధర్మపురిలో వెలసిన యమ ధర్మరాజును దర్శించే భక్తుల సంఖ్య, నానాటికీ అధికమ వుతున్నది. ఇటీవల సంభవిస్తున్న అనూహ్య ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, అకాల మృత్యు నివారణకై అధర్వణ వేదంలో పేర్కొనబడిన "ఆయుష్య సూక్తం" ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే భరణి నక్షత్రం, చతుర్దశి తదితర ప్రత్యేక దినాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గురు వారం యమ ద్వితీయ సంధర్భంగా, అభిషేకం, ఆయుష్య సూక్తం, యమ సూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్తం, జ్వర హర స్తోత్ర పఠనాలు, రోగ నివారణ సూక్తాలు పూజలు, యమాష్టకాది నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
కాలమిస్ట్....9440595494

# ప్రకృతిని నిరంతరం ప్రశ్నించడమే సైన్స్
## లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి



ప్రకృతిలో జరుగుతున్నది ప్రక్రియలను ప్రశ్నించడం వల్ల సైన్స్ ప్రక్రియలు బయట పడతాయని విశ్రాంత కెమిస్ట్రీ ప్రొఫెసర్-ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్. బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. జాతీయ రసాయన శాస్త్ర వారోత్సవాల్లో భాగంగా ఈరోజు సాయి మానేరు హైస్కూలు ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథి హాజరై మాట్లాడుతూ మన చుట్టు సహజంగా జరుగుతున్న పలు భౌతిక, రసాయనిక, జీవ శాస్త్ర ప్రక్రియలు ఎలా, ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నిస్తే ఆసక్తికరమైన సైన్సు విషయాలు బయట పడతాయని అన్నారు. ఆకులు పచ్చగా, రక్తం ఎరుపుగా ఉండడానికి కారణమైన పదార్థాల లోతులను అధ్యయనం చేయాలని అన్నారు. మన నిత్య జీవితంలో జరిగే పలు రసాయన ప్రక్రియలను శాస్త్రవేత్తలు పరంగా అధ్యయనం చేయాలని అన్నారు. నిన్నటి కన్న నేడు, నేటి కన్న రేపు ఉత్తమ ఫలికాలను సాధించాలని సూచించారు. నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ యుగం వరకు మానవ జీవితాల్లో సమూల మార్పులు వచ్చా యని, చదువుకునే విద్యార్థులు టివీ, మొబైల్ వ్యస నాలకు దూరం ఉంటూ, చదువుపై శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలను సాధిస్తూ ఉన్నత స్థాసిరి ఎదగాలని తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన లయన్ కడారు అనంత్ రెడ్డి మాట్లాడుతూ క్రమ శిక్షణ, ఏకాగ్రతలతో చదివిన వారికి ఆశించిన ఫలితాలను సాధించాలని తెలిపారు. వైజ్ఞానిక శాస్త్రం, సాంకేతిక శాస్త్రం కొత్తపుంతలు తొక్కుతున్న ఆధునిక కాలంలో చదువుతో పాటు సంస్కారం, విద్యతో పాటు వినయం అలవర్చు కోవా లని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కెమిస్ట్రీ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థినీవిద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం మానేరు విద్యా సంస్థ పక్షాన డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.



# గ్లోయింగ్ స్కిన్ పొందడానికి

సహజ గ్లో ఆరోగ్యకరమైన చర్మం యొక్క ముఖ్యమైన సూచిక. అయినప్పటికీ, బిజీ జీవనశైలి, కఠినమైన పని షెడ్యూల్‌లు, తగినంత నిద్ర లేకపోవడం, సరైన ఆహారం, కాలుష్యం మరియు హానికరమైన సూర్యకాంతి వంటి అంశాలు మీ చర్మాన్ని డల్ మరియు డ్రైగా మార్చగలవు. ఇవన్నీ మీ జీవితంలో భాగమే. మీరు వాటిని దాటవేయలేరు. అయితే, అలోవెరా జెల్ మరియు కొబ్బరి నూనె వంటి ఉత్పత్తులను ఉపయోగించడం వల్ల మీ చర్మాన్ని అన్ని సీజన్లలో మరియు వాతావరణంలో మెరుస్తూ ఉంటుంది.



కలబంద వివిధ చర్మ సమస్యలకు సహజ నివారణ. అలాగే కొబ్బరి నూనె చర్మ ఆరోగ్యానికి అవసరమైన సంతృప్త కొవ్వుల యొక్క అద్భుతమైన సహజ మూలం. కలిసి ఉపయోగించినప్పుడు, అవి హైడ్రేటింగ్ శక్తి. ఈ రెండు స్కిన్ కేర్ కాంపోనెంట్స్ మెరిసే చర్మాన్ని పొందడానికి మీకు ఎలా సహాయపడతాయో ఈ కథనంలో తెలుసుకోండి.

కలబంద అలోవెరా, సాధారణంగా ఇంట్లో పెరిగే మొక్కగా, చర్మ సంరక్షణ మరియు జుట్టు సంరక్షణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కలబంద అన్ని చర్మ సమస్యలను ఎండిపోకుండా సహజంగా నయం చేయడమే కాకుండా, మీకు శుభ్రమైన మరియు స్పష్టమైన చర్మాన్ని అందిస్తుంది. అలోవెరా జెల్ అనేది మొక్క ఆకుల లోపల కనిపించే స్పష్టమైన జెల్ లాంటి ద్రవం, ఇందులో విటమిన్లు, ఎంజైమ్‌లు, మినరల్స్, కార్బోహైడ్రేట్లు, లిగ్నిన్, సపోనిన్లు, సాలిసిలిక్ యాసిడ్‌లు మరియు అమైనో ఆమ్లాలు వంటి 75 క్రియాశీల పదార్థాలు ఉంటాయి. కాక్టస్ యొక్క కొన్ని చర్మ ప్రయోజనాలను చూద్దాం. సహజ మాయిశ్చరైజర్ కాక్టస్ ఒక సహజ మాయిశ్చరైజర్. ఇది కాంతి మరియు కొవ్వు రహితంగా ఉంటుంది. దీని స్లిమ్ స్ట్రక్చర్ చర్మ కణాలలోకి చొచ్చుకుపోతుంది మరియు పొడి చర్మాన్ని లోపలి నుండి తేమ చేస్తుంది. ఇది మీ చర్మాన్ని మృదువుగా మరియు తేమగా మారుస్తుంది. అదే సమయంలో పొడి మరియు హార్డ్ పాచెస్ పరిగణిస్తుంది. అలోవెరా చర్మంలో తేమను నిలుపుకోవడమే కాకుండా, జిగురుగా కూడా పనిచేస్తుంది. అందువలన చర్మ కణాల పై పొర కలిసి ఉంటుంది. ఫలితంగా మృదువైన మెరిసే చర్మం లభిస్తుంది. సున్నితమైన మరియు జిడ్డుగల చర్మం ఉన్నవారికి ఇది అద్భుతమైన మాయిశ్చరైజర్‌గా నిరూపించబడింది. మీరు పొడి శీతాకాలపు నెలలు లేదా వేసవిలో తేలికపాటి మాయిశ్చరైజర్ కోసం చూస్తున్నట్లయితే, కలబంద మీకు గొప్ప ఎంపిక. సన్ బర్న్ నుండి ఉపశమనం కలిగిస్తుంది కలబందను "బర్నింగ్ ప్లాంట్" అని కూడా అంటారు. ఎందుకంటే ఇది సూర్యరశ్మిని గ్రహించగలదు. కలబంద దాని శోథ నిరోధక మరియు ప్రశాంతత లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. కాక్టస్‌లో పాలీశాకరైడ్‌లు ఉంటాయి. ఇది చర్మ పునరుత్పత్తికి మరియు కొత్త చర్మ కణాల ఏర్పాటులో సహాయపడుతుంది. ఇందులో కార్బాక్సిపెప్టిడేస్ అనే పెయిన్ కిల్లర్ కూడా ఉంటుంది. మనం కాక్టస్‌ను ఉపయోగించినప్పుడు ఇది మనకు ఆహ్లాదకరమైన అనుభూతిని ఇస్తుంది.



# జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరగాలంటే



*ఒత్తైన, పట్టులాంటి, పొడవాటి జుట్టు కావాలని ప్రతి ఒక్క అమ్మాయి కోరుకుంటుంది. దీని కోసం రకరకాల నూనెలు, ప్యాక్‌లు, ట్రీట్మెంట్‌లు ట్రై చేస్తూ ఉంటారు. అయితే ఈ రోజుల్లో లైఫ్‌స్టైల్ మార్పులు, ఒత్తిడి, కాలుష్యం వంటి కారణాల వల్ల.. హెయిల్ ఫాల్ సమస్య ఎక్కువైంది. హెయిర్ ఫాల్ కంట్రోల్ చేయడానికి, జుట్టు ఒత్తుగా పెరగడానికి కొన్ని న్యాచురల్ ప్యాక్స్ సహాయపడతాయి. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.*

### కొబ్బరినూనె, కొబ్బరిపాల మాస్క్..

ఒక గిన్నెలో బాగా పండిన అరటిపండు, కొబ్బరినూనె వేసుకొని, మిక్సీ పట్టుకోవాలి. ఈ మిశ్ర మాన్ని విడిగా ఒక గిన్నెలోకి తీసుకొని అందులో కొద్దిగా కొబ్బరిపాలు వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని కురులకు బాగా పట్టించి చేతివేళ్లతో కుదుళ్ల వద్ద మర్దన చేయాలి. 20 నుంచి 30 నిమిషాలు ఆరనిచ్చి.. తర్వాత గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు వేస్తే.. జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా ఎదగడమే కాదు.. పట్టులా మృదువుగా మారుతుంది.



**అవిసె గింజలతో..** రెండు స్పూన్ల అవిసె గింజల్లో ఒకటిన్నర కప్పు నీళ్లు వేసి మరిగించాలి. నీళ్లు సగానికి రాగానే స్టౌ మీద నుంచి దించి చల్లారనివ్వాలి. చల్లారిన పుడు ఆ నీరు జెల్‌లా మారడం గమనించవచ్చు.



ఇప్పుడు ఒక పల్చటి శుభ్రమైన క్లాత్ తీసుకొని, జెల్ నుంచి అవిసె గింజలను వడగట్టాలి. ఇలా వడగట్టిన జెల్‌కి ఐదు టీస్పూన్‌ల కొబ్బరి నూనెను చేర్చాలి. హెయిర్ ప్యాక్ వేసుకునే ముందు జుట్టు శుభ్రంగా, పొడిగా ఉండాలి. జుట్టుని సన్నని పాయలుగా విడదీస్తూ, హెయిర్ ప్యాక్ కోసం తయారు చేసుకున్న జెల్‌ని కుదుళ్ల నుంచి వెంట్రుకల చివర్ల వరకు పట్టించాలి. నెమ్మదిగా మునివేళ్లతో ఒక పది నిమిషాల పాటు కుదుళ్లను మసాజ్ చేసి, గంటపాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గాఢత తక్కువగా ఉండే షాంపూతో జుట్టుని శుభ్రం చేసుకోవాలి. అవిసె గింజల్లో కొవ్వులు జుట్టుక పోషణ అందించి.. దృఢంగా మారుస్తాయి.

### కొబ్బరి నూనె గుడ్డు..

కొబ్బరినూనెలో కోడిగుడ్డులోని పచ్చసొన, చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో కాస్త ఎసెన్షియల్ ఆయిల్ కూడా వేసుకోవచ్చు. ఈ మాస్క్‌ను హెయిర్‌కు ప్యాక్‌లా వేసి ఆరనివ్వాలి. ఆ తర్వాత తలస్నానం చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. జుట్టు ఆరోగ్యంగా ఎదుగుతుంది.

### కలబంద, కొబ్బరినూనె..

కలబంద గుజ్జు, కొబ్బరినూనె చెంచా చొప్పున తీసుకొని బాగా మిక్స్ చేసుకోవాలి. ఈ మిశ్రమం జుట్టుకు పట్టించి అరగంట పాటు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో జుట్టు శుభ్రం చేసుకోవాలి.

### మెంతుల ప్యాక్..

మెంతుల జుట్టుకు పోషణ అందిస్తాయి. మెంతులను పెరుగుతో కలిపి నానబెట్టాలి. రెండు గంటల సమయం తరవాత వాటిని పేస్టులా చేసుకొని జుట్టుకు ప్యాక్‌లా వేయాలి. దీన్ని అరగంట పాటు ఆరనిచ్చి.. మైల్డ్ షాంపూతో తలస్నానం చేయండి.



**గమనిక:** ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# మినీ వెజ్ జొన్న ఊతప్పం

**కావలసిన పదార్థాలు:**

జొన్నపిండి: కప్పు, గోధుమ పిండి: అరకప్పు
బియ్యప్పిండి: పావు కప్పు, పెరుగు: కప్పు
క్యాబేజీ, క్యారట్ తురుము: అరకప్పు,
క్యాప్సికం: మీడియం సైజు ఒకటి,
కొత్తిమీర: రెండు రెబ్బలు,
పచ్చిమిరప కాయలు: మూడు
నూనె: పావు కప్పు, ఉప్పు: తగినంత

ముందుగా క్యాప్సికంను తీసుకుని సన్నగా ముక్కలు చేసుకోవాలి. కొత్తిమీర, పచ్చి మిరపకాయల్ని కూడా బాగా సన్నగా తరుక్కోవాలి. ఇప్పుడు ఒక గిన్నె తీసుకుని



ముందుగానే లెక్క ప్రకారం కొలిచి పెట్టుకున్న జొన్న, గోధుమ, బియ్యప్పిండ్లను అందులో వేయాలి. వాటితో పాటే తురిమిన క్యాబేజీ, క్యారట్‌లు, క్యాప్సికం ముక్కలు, కొత్తిమీర పచ్చిమిర్చిలను కూడా వేయాలి. వీటన్నింటినీ కాస్త అటూ ఇటూ కలపాలి. ఇప్పుడు పెరుగు, ఉప్పు కూడా అందులో వేయాలి. ఊతప్పం వేసేందుకు అనువుగా పిండి ఉండేలా బాగా కలుపుకోవాలి. తర్వాత పొయ్యి మీద పెనం పెట్టి, నూనె బొట్టు వేసి అరచేయంత అప్పచ్చిల్లా పిండిని వేసి కాల్చుకుంటే మినీ వెజ్ జొన్న ఊతప్పం రెడీ అయినట్టే! ఇది తీపి ఆవకాయ కాంబినేషన్‌లో తినడానికి బాగుంటుంది.

## మార్కెట్

### ఆల్‌టైమ్ రికార్డు సృష్టించిన

# యూపీఐ పేమెంట్స్

### అక్టోబర్‌లో ఎన్ని కోట్లంటే..!

దీపావళి పండుగ సీజన్ కావడంతో డిజిటల్ చెల్లింపులు సరికొత్త శిఖరాలకు చేరుకున్నాయి. ముఖ్యంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలు మునుపెన్నడూ లేనంతగా పెరిగి ఆల్-టైమ్ రికార్డు లను సృష్టిస్తున్నాయి. దీపావళి కొనుగోళ్ల జోరుతో యూపీఐ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త మైలురాళ్లను అధిగమించింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. అక్టోబర్ నెలలో యూపీఐ ద్వారా జరుగుతున్న సగటు రోజువారీ లావాదేవీల విలువ ఏకంగా రూ. 94 వేల కోట్లకు చేరింది. సెప్టెంబర్ నెలతో పోలిస్తే ఇది 13 శాతం అధికం. గత కొన్నేళ్లుగా జరుగుతున్న నెలవారీ యూపీఐ పేమెంట్లతో పోల్చి చూస్తే ఇది అత్యధిక వృద్ధి అని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల ఇంకా వారం రోజులు మిగిలి ఉండగానే యూపీఐ తన జీవితకాలంలోనే అత్యుత్తమ నెలవారీ ప్రదర్శనను నమోదుచేసే దిశగా దూసుకెళ్తోంది. దీపావళి పండగతోపాటు ఇటీవల జీఎస్టీ రేట్లలో వచ్చిన మార్పులు ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి. ఈ నెల 20న దీపావళి సందర్భంగా చెల్లింపులు భారీగా పెరిగాయి. పండగకు ముందు రోజు యూపీఐలో ఒక్కరోజే 74 కోట్ల లావాదేవీలు జరిగి ఆల్-టైమ్ రికార్డు సృష్టించాయి. ఈ నెలలో ఇప్పటివరకు సగటున రోజుకు 69.5 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. సెప్టెంబర్‌లోని 65.4 కోట్ల రికార్డును ఇప్పటికే అక్టోబర్ సగటు అధిగమించింది. సాధారణంగా నెల ఆరంభంలో జీతాలు, ఈఎంఐ చెల్లింపుల కారణంగా లావాదేవీలు ఎక్కువగా ఉండి, నెల మధ్యకు వచ్చేసరికి తగ్గుముఖం పడతాయి. కానీ ఈసారి పండగ ప్రభావంతో ఆ ధోరణి మారింది. ఈ నెల 20 నాటికే రోజువారీ లావాదేవీల విలువ ఆరుసార్లు లక్ష కోట్ల రూపాయల మార్కును దాటింది. సెప్టెంబర్‌లో ఈ ఘనత కేవలం మూడుసార్లే నమోదైంది. ఈ దూకుడు చూస్తుంటే ఈ నెలలో మొత్తం లావాదేవీల విలువ తొలిసారిగా రూ. 28 లక్షల కోట్లు దాటుతుందని, గత రికార్డయిన రూ. 25 లక్షల కోట్ల మార్కును అధిగమిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశంలోని మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో దాదాపు 85 శాతం వాటా యూపీఐదే కావడం విశేషం అంటున్నారు.




# ఇండియన్ రూపీకి రిజర్వ్ బ్యాంక్ అండ

### రూపాయి బలోపేతం కోసం భారీగా చర్యలు

అమెరికా కఠిన నిర్ణయాలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న భారత రూపాయి కి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అండగా నిలిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత దిగజారకుండా నిరోధించేందుకు భారీ ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు నెలలో ఏకంగా 7.69 బిలియన్ అమెరికన్ డాలర్లను (సుమారుగా రూ.67 వేల కోట్లు) మార్కెట్లో విక్రయించినట్లు ఆర్బీఐ తన తాజా బులెటిన్‌లో వెల్లడించింది. ఇటీవల డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 88కి పడిపోయింది. ఆగస్టు నెలలో రూపాయి విలువ 1.6 శాతం వరకు క్షీణించడంతో కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. సాధారణంగా మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరిగినప్పుడు రూపాయి బలహీనపడుతుంది. అలాంటప్పుడు ఆర్బీఐ తన విదేశీమారక నిల్వల నుంచి డాలర్లను అమ్ముతుంది. దాంతో మార్కెట్లో డాలర్ల సరఫరా పెరిగి, రూపాయి విలువ స్థిరపడుతుంది. జూలై నెలతో పోలిస్తే ఆగస్టులో ఆర్బీఐ విక్రయించిన డాలర్లు ఏకంగా మూడు రెట్లు అధికం కావడం గమనార్హం. మార్కెట్లో తీవ్రమైన అనిశ్చితి ఉన్నప్పుడు మాత్రమే తాము జోక్యం చేసుకుంటామని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఒకవైపు డాలర్లను విక్రయిస్తూనే మరోవైపు ఆర్బీఐ వ్యూహాత్మకంగా బంగారం నిల్వలను పెంచుకుంటోంది. రెండు నెలల విరామం తర్వాత సెప్టెంబర్‌లో కొత్తగా 200 కిలోల పసిడిని కొనుగోలు చేసింది. దాంతో ఆర్బీఐ దగ్గరున్న మొత్తం బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. వాటి విలువ సుమారు రూ. 8.36 లక్షల కోట్లుగా ఉంది. ఏ దేశ కేంద్ర బ్యాంకు




వద్దనైనా బంగారం నిల్వలు ఎక్కువగా ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ, కరెన్సీపై అంతర్జాతీయంగా నమ్మకం పెరుగుతుంది. సంక్షోభ సమయాల్లో బంగారం సురక్షితమైన ఆస్తిగా పనిచేస్తుంది. విదేశీ మారక నిల్వల్లో డాలర్ల వంటి కరెన్సీలు ఉన్నప్పటికీ, బంగారం నిల్వలు ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని ఇస్తాయి. అధిక బంగారం నిల్వలు దేశ రేటింగ్ మెరుగుపడటానికి కూడా దోహదపడతాయి. తద్వారా తక్కువ వడ్డీకే అంతర్జాతీయ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ చేపడుతున్న ద్వంద్వ వ్యూహం రూపాయిని బలోపేతం చేయడానికేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఏఐ బూమ్.. భారీగా పెరిగిన సత్యనాదెళ్ల జీతం



మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల జీతం భారీగా పెరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో సత్తా చాటడంతో ఆయన వేతనం భారీగా పెరిగింది. మంగళవారం విడుదల చేసిన కొత్త ప్రాక్సీ ఫైలింగ్ ప్రకారం.. 2025 ఆర్థిక సంవత్సరానికి సత్యనాదెళ్ల జీతం 22 శాతం పెరిగి 96.5 మిలియన్ల డాలర్లకు చేరుకుంది. అంటే భారత కరెన్సీ ప్రకారం.. రూ.847.31 కోట్లు అన్నమాట. బాధ్యతలు చేపట్టిన గత పదేళ్లలో ఇదే అత్యధిక వేతనం. కృత్రిమ మేధస్సులో కంపెనీ పురోగతికిగాను నాదెళ్లకు ఈ ప్రోత్సాహం అందనుంది. కాగా, గతేడాది ఆయన జీతం 79.1 మిలియన్ డాలర్లుగా ఉండేది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆయన 79.1 మిలియన్ డాలర్ల వేతనం అందుకున్నారు. భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ.664 కోట్లు. 2023లో అందుకున్న 48.5 మిలియన్ డాలర్లతో పోల్చితే ఇది 63 శాతం ఎక్కువ. సత్య నాదెళ్ల వేతనంలో ఎక్కువ భాగం 84 మిలియన్ డాలర్లకు పైగా విలువైన స్టాక్ అవార్డుల రూపంలో లభిస్తుంది. మైక్రోసాఫ్ట్ పొందిన లభాలకు గాను ఆయన 9.5 మిలియన్ డాలర్లకు పైగా నగదు ప్రోత్సాహకాలను కూడా అందుకున్నారు. ఏఐ విప్లవంతో గత మూడేళ్లలో మైక్రోసాఫ్ట్ షేర్ల విలువ రెట్టింపు కంటే ఎక్కువగానే పెరిగాయి.

# టీసీఎస్ బాటలోనే వాల్‌మార్ట్

### హెచ్-1బీ వీసా అభ్యర్థుల నియామకాలు నిలిపివేత..!

అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే వారికి డొనాల్డ్ ట్రంప్ భారీ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. విదేశీ నిపుణుల నియామకానికి జారీ చేసే హెచ్-1బీ వీసా దరఖాస్తులపై వార్షిక రుసుంను లక్ష డాలర్లకు పెంచారు. ట్రంప్ నిర్ణయంతో అమెరికాలో కార్యకలాపాలు సాగిస్తున్న టెక్ సంస్థల్లో గందరగోళం నెలకొంది. ఈ ఫీజు పెంపు కారణంగా, వీసా అభ్యర్థులను నియమించుకోవడంలో పలు టెక్ సంస్థలు వెనకడుగు వేస్తున్నాయి. ట్రంప్ నిర్ణయంతో ఈ ఆర్థిక సంవత్సరంలో హెచ్-1బీ వీసాదారులను అమెరికాలో ఉద్యోగులుగా నియమించుకోమని దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికాకు చెందిన రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ కూడా అలాంటి నిర్ణయమే తీసుకున్నట్లు తెలుస్తోంది. వాల్‌మార్ట్ హెచ్-1బీ వీసా అభ్యర్థుల నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. హెచ్-1బీ వీసా నియామక విధానాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి ఒకరు తెలిపినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. అయితే, కస్టమర్లకు ఉత్తమ సేవ అందించేందుకు, ప్రతిభావంతులను నియమించడంలో కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. కాగా, ప్రస్తుతం వాల్‌మార్ట్‌లో 2,390 హెచ్-1బీ వీసా హోల్డర్లు పని చేస్తున్నారు.

**లక్ష డాలర్ల ఫీజు వారికే!...** హెచ్1బీ వీసా దరఖాస్తు ఫీజును లక్ష డాలర్లకు దాదాపు రూ. 88 లక్షలు) పెంచిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం నెలరోజుల తర్వాత ఫీజును ఎలా చెల్లించాలో, ఈ ఫీజు నుంచి ఎవరికి మినహాయింపు లభిస్తుందో వివరాలు వెల్లడించింది. అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) సోమవారం ఫీజు పేమెంట్ పోర్టల్‌ను ప్రవేశపెడుతూ ఫీజు చెల్లించినట్లు రసీదు సమర్పించిన దరఖాస్తుదారులు మాత్రమే తదుపరి అడుగులు వేయాలని, అయితే కొందరు స్టూడెంట్ వీసాదారులకు మాత్రం ఫీజు రాయితీ ఉంటుందని తెలిపింది. ఎఫ్-1 వీసాలపై ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, ఎల్-1 వీసాలపై ఉన్న ప్రొఫెషనల్స్‌తోసహా ప్రస్తుత వీసాదారులు హెచ్-1బీ హోదా కోసం దరఖాస్తు చేసినపుడు లక్ష డాలర్లను చెల్లించవలసిన అవసరం లేదని యూఎస్‌సీఐఎస్ వెల్లడించింది. అమెరికా వెలుపల ఉన్న వ్యక్తులు దాఖలు చేసే దరఖాస్తులకు మాత్రం కొత్త ఫీజు వర్తిస్తుందనిగ్రీన్ అండ్ స్పీగెల్‌కు చెందిన డాన్ బెర్గెర్ ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్లు ఫోర్బ్స్ తెలిపింది. అమెరికాను వీడి ఉండి ప్రస్తుత హెచ్-1బీ వీసాపై దేశంలోకి తిరిగి ప్రవేశించడం కోసం మళ్లీ దరఖాస్తు చేసుకునే వారికి కొత్త ఫీజు వర్తిస్తుందని యూఎస్‌సీఐఎస్ తెలిపింది.

**అమెజాన్ టాప్..** అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే వారికి డొనాల్డ్ ట్రంప్ భారీ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. విదేశీ నిపుణుల నియామకానికి జారీ చేసే హెచ్-1బీ వీసా దరఖాస్తులపై వార్షిక రుసుంను లక్ష డాలర్లకు పెంచారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. ట్రంప్ చర్య భారతీయులపై తీవ్ర ప్రభావం పడనుంది.భారత్‌కు చెందిన పలు దిగ్గజ సంస్థలు ఎక్కువగా హెచ్-1బీ వీసాలతోనే అమెరికాలో తమ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ వీసాలతోనే భారతీయుల్ని నియమించుకుంటున్నాయి. ఇందులో అమెజాన్ సంస్థ టాప్‌లో ఉంది. ఆ తర్వాత టాటా కన్సల్టెన్సీ రెండో స్థానంలో నిలిచింది. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరం జూన్ నాటికి అమెజాన్ దాదాపు 10,044 హెచ్-1బీ వీసాలను ఉపయోగించింది. ఆ తర్వాత టీసీఎస్ 5,505, మైక్రోసాఫ్ట్ (5,189), మెటా (5,123), యాపిల్ (4,202), గూగుల్ (4,181), డెలాయిట్ (2,353), ఇన్ఫోసిస్ (2,004), విప్రో (1,523), టెక్ మహీంద్రా అమెరికాస్ (951), ఒరాకిల్ (2,092), అమెజాన్ వెబ్ సర్వీసెస్ (2,347), కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ (2,493), వాల్‌మార్ట్ అసోసియేట్స్ (2,390) హెచ్-1బీ వీసాలను దక్కించుకున్నాయి. ఇవే కాకుండా అమెరికాకు చెందిన పలు కంపెనీలు కూడా హెచ్-1బీ వీసాలతో ఎక్కువమంది భారతీయులను నియమించుకుంటున్నాయి. వాటిపై కూడా తీవ్ర ప్రభావం పడనుంది.

**హెచ్-1బీ ఉద్యోగులను నియమించుకోం : టీసీఎస్**

టీసీఎస్ అమెరికాలో తమ ఉద్యోగుల నియామక వ్యూహంపై ఇటీవలే స్పష్టతను ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో హెచ్-1బీ వీసాదారులను అక్కడ ఉద్యోగులుగా నియమించుకోమని ఆ కంపెనీ సీఈవో కృతివాసన్ తెలిపారు. టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం స్థానిక ప్రతిభావంతుల నియామకంపై టీసీఎస్ దృష్టి పెడుతుంది. ప్రస్తుతం అమెరికాలోని సుమారు 33 వేల టీసీఎస్ ఉద్యోగుల్లో సుమారు 11 వేల మంది హెచ్-1బీ వీసాదారులు ఉన్నారు. హెచ్-1బీ వీసా కలిగిన ఉద్యోగులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాల నుకుంటున్నట్టు కృతివాసన్ తెలిపారు. ఉద్యోగుల కోసం ఎల్-1వీసాల సదుపాయం ఉన్నప్పటికీ అవి హెచ్-1బీని పూర్తిగా భర్తీ చేయలేవని ఆయన చెప్పారు.

# కార్పొరేషన్ పరిధిలో భయపెడుతున్న కుక్కల బెడద

**లబోదిబోమంటున్న కార్పొరేషన్ ప్రజలు**



**జవహర్ నగర్, అక్టోబర్ 22 (నినాదం):** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కుక్కల బెడద రోజు రోజుకు తీవ్రమౌతుంది. జవహర్ నగర్ కార్పొరేషన్ ఓ బాలుడిని బుధవారం కుక్క కరిచింది. ద్విచక్ర వాహనంపై మౌనిక రెడ్డి (15) వెళుతుండగా కాలిని నోటితో పట్టుకొని కరిచింది. వెంటనే బాలుడిని జవహర్ నగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక దావాఖానకు తరలించి చికిత్స అందజేశారు. రోడ్డుపై వెళ్తున్న వారిని కుక్కలు వెంబడించి కరచి వేస్తుండడంతో స్థానికులు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్ కమిషనర్ పట్టించు కొని వెంటనే కుక్కల బెడద నుండి కాపాడాలని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కార్తీక మాస పూజలు



**అల్వాల్, అక్టోబర్22 (నినాదం):** కార్తీక మాసం పురస్కరించుకొని శ్రీ ఉమా చంద్ర మౌళీశ్వర స్వామి దేవాలయం వేకువ జామునే మహిళలు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక దీపాలు వెలిగించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధ వా రం నుండి మొదలైన ఈ కార్తీకమాసం 20 నవంబర్ 2025 వరకు కొనసాగు తు న్నదని పూజారి శ్రీధర్ శర్మ తెలిపారు. ఆలయంలో పూజలు నిర్వహించేవారు ముందుగానే కుల గోత్రాలతో సంప్రదించాలని భక్తులను కోరారు

## ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల సమస్యలు గ్రహించి వస్తువులు పంపిణీ

**దమ్మాయిగూడ మున్సిపల్ ప్రెసిడెంట్ ముప్పరామారావు**




**కీసర, అక్టోబర్ 22, (నినాదం):** కీసర మండలం, దమ్మాయిగూడ మున్సిపల్ ప్రెసిడెంట్ ముప్పరామారావు, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేడ్చల్ బి బ్లాక్ మహిళా ప్రెసిడెంట్ ఈగ శ్వేతా రాజు ముదిరాజ్ కొద్ది రోజులుగా ఆర్ జీకే కాలనీలో ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల సమస్యలు గ్రహించి కమ్మ సంఘం వారిని సంప్రదించగానే దమ్మాయిగూడ కమ్మ సంఘం ప్రెసిడెంట్ సాంబశివరావు జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వరరావు, వారి కమిటీ సభ్యులు వెంటనే స్పందించి విద్యార్థులు తినడానికి 150 ప్లేట్లు, 151 , గ్లాస్లు,1 బీరువా, 2 రాక్స్ స్పాన్సర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి, నవభారత్ బ్యాంక్ చైర్మన్ పాండురంగారావు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్జికే కాలనీ డెవలప్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతరాజు రాములు, స్కూల్ యాజమాన్యం కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సదర్ ఉత్సవాలు



**అల్వాల్, అక్టోబర్ 22( నినాదం):** దీపావళి పండుగను పురస్కరించుకొని యాదవ సామాజిక సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన సదర్ ఉత్సవాలలో పాల్గొనడం ఆనందకరమని మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. అల్వాల్ పట్టణ పరిధిలోని యాదవ సంఘం ల నేతృత్వంలో సర్దార్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించు కున్నారు.తుర్కపల్లి యాదవ్ సంగం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు తుర్కపల్లిలో యాదవ సంఘం ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాలలో ముఖ్య అతిథిగా కార్పొరేటర్ రాజేంద్రనాథ్ పాల్గొన్నారు. కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ మాట్లాడుతూ యాదవ కులస్తులు ఒక ప్రత్యేకమైన ప్రధాన ఉత్సవముగా నిర్వర్తించుకుంటారు. అలంకరించిన దున్నపోతులు ఈ ఉత్సవాల్లో ప్రత్యేక విశేషం అని అన్నారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, వాసు, సర్వేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**మహేశ్వరం, అక్టోబర్ 22 (నినాదం) :** ఆమనగల్లు, కడ్తాల్ మండలాల కాంగ్రెస్ నాయకులు బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరా బాదులోని ఆయన నివాసంలో కలిసి పలు అభివృద్ధి పనులు, నిధుల మంజూరు గురించి వినతి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే కు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో టిపిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహా, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## రేవంత్‌రెడ్డి పాలన అంతా సగం సగం అంతా ఆగం..ఆగం

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు**



**సిద్దిపేట(నినాదం):** సిద్దిపేట మార్కెట్ యార్డ్ లో వడ్ల, మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంలో ఆలస్యం చేయడం జరిగిందన్నారు.సిద్దిపేట మార్కెట్ యార్డ్ లో 14 వేల క్వింటాళ్ల మక్కలు దళారుల పాలో అయిందన్నారు ప్రతి ఎకరాకు కేవలం 18 క్వింటాళ్ళు మాత్రమే కొంటామని ప్రభుత్వం కొత్త నిబంధన పెట్టడం దుర్మార్గం అన్నారు. రైతు 25 నుంచి 30 క్వింటాళ్ల మక్కలు పండిస్తే 18 క్వింటాలు మాత్రమే ప్రభుత్వం కొంటా అంటే మిగతాది దళారుల పాలవుతుంది. అన్నారు పండిన పంట అంతా కొంటాం. కొని బోనస్ ఇస్తామన్న రేవంత్ రెడ్డి ఎందుకు కోతలు పెడుతున్నారు. అని విమర్శించారు ప్రతి గింజకు మద్దతు ధర ఇచ్చుకుంటా అని, ప్రతి పంటకు బోనసిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం జాడ లేదు. అన్నారు మక్కలు కొనుగోలు మీద పెట్టిన నియంత్రణను ఎత్తివేయాలని, పండించిన మక్క పంటను పూర్తిగా కొనాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నమన్నారు.బోనస్ కూడా ఒక పంటకు ఇచ్చి ఒక పంటకు ఎగ్గొట్టింది కాంగ్రెస్ పార్టీ. అన్నారు రేవంత్ రెడ్డి పాలన అంతా సగం సగం అంతా ఆగం ఆగం. అని విమర్శించారు మిగిలిన రుణమాఫీని ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయాలి. అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలి. పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను.అన్నారు

# గురుకుల విద్యకు పునాది వేసిన శంకరన్



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** 83లో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతి కోసం శంకరన్‌ల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేశారు. బుధవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ బాలికల, బాలుర పాఠశాలలోఎస్. ఆర్ శంకరన్ ఐఏఎస్ 91వ జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రిన్సిపాల్ అంజన్న, కల్పనతో కలిసి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శంకరన్, ఐఏఎస్ పీపుల్స్ ఐఏఎస్ అధికారిగా ప్రసిద్ధి చెందారని, గురుకుల విద్యకు పునాది వేశారని తెలియచేసారు. గౌలిదొడ్డి పాఠశాల అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి కృషితో వేగంగా కొనసాగుతోందని అన్నారు. గౌలిదొడ్డిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ డ్రైనేజి ఔట్ లేట్ సమస్య పరిష్కారానికి రూ.1 ఒక కోటి 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించడం జరిగినదని, అతి త్వరలోనే పనులకు శంకుస్థాపన చేసి త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ఇక్కడి విద్యార్థులు భవిష్యత్తులో రాష్ట్రం, దేశం గర్వించేటట్లు ఎదగాలని నా ఆకాంక్ష అని గాంధీ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని రకాల మంచి వసతులతో పాటు , నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని గొప్ప నిర్ణయం తీసుకున్నారని, విద్యార్థుల తరుపున నా తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని కొనియాడారు. విద్యార్థులకు శుచి శుభ్రతతో కూడిన చక్కటి రుచికరమైన భోజనం అందించాలని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలను తీసుకోవాలన్నారు. శంకరన్ చూపిన మార్గం ఈ రోజు రాష్ట్ర సంక్షేమ విధానాలకు దిశా నిర్దేశం చేస్తున్నదని, ఆయన కలల తెలంగాణను సీఎం రేవంత్ రెడ్డి సాకారం చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విద్యా రంగంలో పలు విప్లవాత్మక చర్యలు చేపట్టిందన్నారు. ప్రిన్సిపాల్ అంజయ్య, కల్పన మాట్లాడుతూ గౌలిదొడ్డి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని అన్నారు. మంత్రి, ఎమ్మెల్యే సహకారంతో మా విద్యార్థుల భవిష్యత్తు మరింత మెరుగుపడుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు నాయకులు మంత్రి ప్రగడ సత్యనారాయణ, అనిల్, వేణు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సత్వర సేవలు అందేలా తోడ్పాటు అందిస్తా

**బాధ్యతలు స్వీకరించిన కాప్రా ఎమ్మార్వో రాజేష్**



**జవహర్ నగర్, అక్టోబర్ 22 (నినాదం):** సర్కారు భూ ముల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని ప్రజలకు సత్వర సేవలు అందేలా కృషి చేస్తామని కాప్రా ఎమ్మార్వో బైరెడ్డి రాజేష్ అన్నారు. ఈ మేరకు కాప్రా మండల తాసిల్దార్ కా ర్యాల ఓయంలో నూతన ఎమ్మార్వో గా బైరెడ్డి రాజేష్ బుధ వారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానని మం డల పరిధిలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని, ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా సేవలు అందిస్తామని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు.

## నూతనంగా రెడ్డీస్ చికెన్ మార్ట్ ఘనంగా ప్రారంభోత్సవం



**కీసర, అక్టోబర్ 22, (నినాదం):** కీసర మండలం, నాగారం మున్సిపల్ సమీపంలో ఉన్న ఆర్ ఎల్ నగర్ లో రెడ్డిస్ చికెన్ మార్ట్ ను స్థానిక ప్రజాప్రతినిధులు లైన నాగారం మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రా రెడ్డి, ఆరవ వార్డు మాజీ కౌన్సిలర్ అనంత్ రెడ్డి, నాగారం బిజెపి యువజన నాయకుడు కౌకుంట్ల రాహుల్ రెడ్డి చేతులమీదుగా ఘనంగా ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవానికి స్థానిక ప్రజాప్రతినిధులు, రామ్ రెడ్డి మార్ట్ యాజమాన్య కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ టౌన్‌లో వాహనం నడపాలంటే దమ్ముండాలి



**వికారాబాద్, అక్టోబర్ 22(నినాదం ):** జిల్లా కేంద్రం వికారాబాద్ పట్టణంలో వాహనాలు నడిపి బయటపడా లంటే ఓ రేంజ్ ఉండాలి అనేవిధంగా ఉంటుంది. ముఖ్యంగా సాయంత్రం సమయంలో పట్టణంలో వాహనం నడపాలంటే సహసం చేయాల్సిందే లేదంటే తిరిగి ఇంటికి వెళ్ళడం ఘగణమేనని చెప్పొచ్చు. పట్టణంలోని ప్రధాన రోడ్లు ఇరుకుగా ఉండటం. అడుగడుగునా అనుసంధానమైయ్యే గల్లీ రోడ్లు, ప్రధాన వాణిజ్య పరమైన దుకాణాలు వెరసి పట్టణంలోని ప్రధాన రోడ్ల దుస్థితి. ఏ గల్లీ నుండి ఏ వాహనం దూసుకొస్తుందో తెలియదు. ఎవ్వరు రివ్వున ఏ దిశకు తిరుగుతారో తెలియదు. సిగ్నల్ వ్యవస్థ లేదు. ప్రధాన కూడళ్ళ వద్ద సాయంత్రం పోలీసులు వాహనాల రాకపోకలను క్రమంబద్ధీకరించినప్పటికీ మిగతా ప్రాంతమంతా అయోమయంగా ఉంటుంది. వొళ్ళన్ని కళ్ళు చేసుకుని వాహనాలు నడిపితే తప్ప క్షేమంగా బయటకురాని దుస్థితి. దాదాపు ఐదు లక్షల జనాభా ఉన్న ఈ పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ పెరుగుతున్నప్పటికి రోడ్ల వెడల్పు జరగకపోవడంతో ఈ పరిస్థితి ఎర్పిడింది. రోడ్ల వెడల్పు ఎప్పటికప్పుడు అనివార్యకారణాలతో ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే ఉంది దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న ఛందంగా మారింది. దుకాణల్లో కొనుగోలు చేసే వారు వాహనాలు ఉన్న కాసింత రోడ్డుపైనే నిలిపాల్సి వస్తుంది. దీంతో మరింత ఇబ్బంది ఏర్పడుతోంది. ట్రాఫిక్, జనాభా పెరుగుతున్న వికారాబాద్ పట్టణంలో మెరుగైన రోడ్ల వసతులు కల్పించడంలో పాలకులు ఎప్పటికప్పుడు విఫమవుతున్నారనేది పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఓటు రాజకీయం తప్ప అభివృద్ధి చేయాలన్న కాంక్ష నాయకుల్లో కనిపించదని వారు భావిస్తున్నారు. పట్టణాన్ని శాటిలైట్ పట్టణంగా తీర్చి దిద్దలాని, ఆదర్శ పట్టణంగా అభివృద్ధి చేయాలని చేసిన ప్రణాళికలు బుట్టదాఖలై య్యాయని పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కారం చేయాలని కోరుతున్నారు.

## పేట్‌బషీరాబాద్‌లో జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని కాపాడిన హైడ్రా..

**38 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ కంచె నిర్మాణం**





**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 22 (నినాదం):** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్‌బషీరాబాద్‌లో జర్నలిస్టులకు కేటాయించిన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 25/2 లోని 38 ఎకరాల భూమి చుట్టూ బుధవారం ఫెన్సింగ్ వేసింది. గతంలో భూమిని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ( జే ఎన్ జే ఎం ఏ సి హెచ్ ఎస్) కు రాష్ట్ర ప్రభుత్వం 2008లో కేటాయించింది. ఈ భూమిని జర్నలిస్టులకు కేటాయిస్తూ హెచ్ ఎం డీ ఏ స్వాధీనంలో ప్రభుత్వం ఉంచిన విషయం విధితమే. అయితే ఈ కేటాయింపులపై కొంతమంది కోర్టుకెళ్లడంతో అక్కడ జర్నలిస్టులకు ప్లాట్ల పంపిణీ జరగలేదు. కోర్టులో వివాదం ఉంటుండగానే.. మరోవైపు అక్కడ ఆక్రమణలు జరుగుతున్నాయని హైడ్రాకు జే ఎన్ జే ఎం ఏ సి హెచ్ ఎస్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై అక్కడ రెవెన్యూ, హెచ్ ఎండీఏ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, హెచ్ ఎండీఏ అధికారులతో కలిసి హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించుకుంది. ఇప్పటికే కొంతమంది ఇళ్లు కట్టుకుని ఉండగా వాటి జోలికి పోకుండా ఇంకా ఖాళీగా ఉన్న భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ఈ విషయమై కొంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేయగా కోర్టు తీర్పు ప్రకారం ఆ స్థలం కేటాయింపులు జరుగుతాయి. ఈ లోగా అక్రమణలు జరగకుండా ప్రభుత్వ భూమిని కాపాడుతున్నట్టు హైడ్రా స్పష్టం చేసింది. అక్కడ ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారితో త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలిస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో హైడ్రా, రెవెన్యూ, హెచ్ ఎండీఏ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


## మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య



**అక్టోబర్ చేవెళ్ళ 22( నినాదం):** భార్య తన వద్దకు రావడం లేదనే మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్యకి పాల్పడిన ఘటన శంకరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్వర్తి గ్రామానికి చెందిన శివకుమార్ 22 డ్రైవర్ పనిచేస్తూ మూడు సంవత్సరాల క్రితం కొజ్జ గూడెం గ్రామానికి చెందిన శిరీష అనే యువతిని పెళ్లి చేసుకొని శంకర్పల్లిలో నివాసం ఉన్నాడు . కొన్ని రోజుల తర్వాత నివాసాన్ని కేసారానికి మార్చారు. కాగా 15 నెలల క్రితం కోడలు శిరీష గర్భం దాల్చడంతో ఆమె కొజ్జ గూడెం లోని అమ్మగారింటికి వచ్చింది. అదేవిధంగా శివకుమార్ కూడా ఎల్వర్తి లోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చాడు . అప్పటినుంచి ఇంటి వద్దనే ఉంటూ పని చేసుకుంటున్నాడు. కాగా ఏడాది క్రితం శిరీష పాపకు జన్మనిచ్చింది. తల్లి గారి ఇంటి వద్ద ఉన్న శిరీషను వెల్వర్తికి రావాలని కుటుంబ సభ్యులతోవెళ్లి శివ కుమార్ పలుమార్లు అడిగాడు. శిరీష అతని తీరు నచ్చక అతనితో రావడానికి నిరాకరించింది. ఇది ఇలా ఉండగా 20వ తేదీ మధ్యాహ్నం సమయంలో శివకుమార్ తన కూతురును చూసేందుకు కొజ్జ గూడెం లో ఉన్న అత్తగారింటికి వెళ్ళాడు. అక్కడికి వెళ్లిన శివ్ కూమార్ భార్య అత్త మామలతో గొడవ పడ్డాడు. ఇంటికి వెళ్ళి తల్లి విజయలక్ష్మి బయట ఉండగా ఇంట్లో కి వెళ్ళి తలుపులు వేసుకొని వాటర్ పైప్ తో సీలింగ్ ఫ్యాన్ కు వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. తలుపులు వేసుకున్నది గమనించిన తల్లి విజయలక్ష్మి స్థానికుల సహాయంతో గొడ్డలి సహాయంతో తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్కు ఉరివేసుకొని కనిపించాడు. గ్రామస్తుల సహాయంతో ముందుగా శంకర్పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అనంతరం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించిన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై మృతుడి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పూర్వీకుల సంప్రదాయాలను నిలబెట్టే సదర్ ఉత్సవాలు

**కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** సదర్ ఉత్సవం వంటి వేడుకలు సామాజిక ఐక్యతను, పూర్వీకుల సంప్రదా యాలను నిలబెట్టే వేదికలని, దున్న రాజుల ప్రదర్శన కేవలం వినోదం కాదు, ఇది యాదవ సమాజం కృషి, పశుసంరక్షణపై ఉన్న అభిమానం ప్రతిబింబం అని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని లింగంపల్లి విలేజ్ హనుమాన్ టెంపుల్, లింగంపల్లి దర్గా, గంగారాం, రాయదుర్గం, మాదాపూర్ మరియు పలు సదర్ ఉత్సవాలల్లో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్, రాగం అభిషేక్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా సదర్ నిర్వాహకులు వారిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదర్ పండుగ యాదవులచే ఘనంగా నిర్వహించబడే ఒక సాంస్కృతిక ఉత్సవమని, దీనిని ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందని అన్నారు. యాదవ సమాజం సదర్ పండుగను తమ పాడి పశువుల పట్ల భక్తి, వాటిపై ఆధారపడిన తమ జీవన విధానానికి ప్రతీకగా జరుపుకుంటారని వివరించారు. యాదవ సమాజానికి జీవనోపాధిగా ఉన్న పశువుల పట్ల వారి భక్తిని, గౌరవాన్ని తెలియజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్ రాజ్ ముదిరాజ్, నరేందర్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఎస్ఎల్విడిసి ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, సాయి, కిరణ్ యాదవ్, సైదులు యాదవ్, సాయి, మల్లేష్ యాదవ్, ఆయా సదర్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొమరం భీమ్ జయంతి వేడుకలు



**అల్వాల్, అక్టోబర్ 22 (నినాదం):** అడవితల్లి ముద్దుబిడ్డలైన అదివాసీ లు బుక్కెడు బువ్వకోసం భూమికోసం, భుక్తికోసం ఆరాట పడుతుంటే, అడవి పుత్రుడు కొమురం భీమ్ చనిపోయాడు. అడవిబిడ్డల హక్కుల కో సం, జల్ –జంగిల్–జామిల్ కోసం, తెల్లదొరలపైనా, నల్లదోరలపైనా, నైజాం సర్కార్ గుండెలపై సమరశంఖం పూరించిన గోండు పో రాట యోధు డు కొమురం భీమ్ గిరిజనేతర ఆస్తిత్వం దోపిడీపైన, సా మ్రాజ్య వాదంపైన యోధుడు బూటకపు ఎదురుకాల్పులల్లో అమ రుడు అయిన కొమురంభీమ్ జయంతి సందర్భంగా గద్దర్ అభిమా నుల సంఘం అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ ఘన మైన నివాళులు జోహార్లని గద్దర్ అభిమాన సంఘం సిఎల్ యాదగిరి తెలిపారు.

## మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెడ్‌ఆఫ్ అకౌంట్ విదానం

**అమలు చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శినిఎమ్మెల్సీ మల్క కొమరయ్య**




**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, అక్టోబర్22,(నినాదం):** తెలంగాణ రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న సుమారు 3,000 మంది రెగ్యులర్ టీచింగ్ సిబ్బందిని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌లో విలీనం చేసి, వారి వేతనాలను హెడ్ ఆఫ్ అకౌంట్ విధానం ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ను డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 194 మోడల్ స్కూళ్లలో సుమారు 3,000 మంది రెగ్యులర్ టీచింగ్ సిబ్బంది నిరంతరం సేవలందుతున్నారు. ఈ ఉపాధ్యాయులు రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులను తయారు చేస్తున్నారు. వారి సేవలను గుర్తించి, తగిన న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను ఇప్పటికే స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేసి హెడ్ ఆఫ్ అకౌంట్ విధానం ద్వారా వేతనాలు చెల్లిస్తున్న అంశాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసి, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు. ఇలాంటి నిర్ణయం ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రతను కల్పించడమే కాకుండా, ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.



శ్రీశైలం జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించాలని కాంగ్రెస్ నాయకులు నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవిని కోరారు. బుధవారం ఈ మేరకు హైదరాబాదులోని ఆయన నివాసంలో మల్లురవిని కలిసి టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, ఆమనగలు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ వినతి పత్రం అందజేశారు. రోడ్డు విస్తరించకపోవడం వల్ల వాహనాల రద్దీ పెరిగి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో శ్రీశైలం రోడ్డును మూడు లైన్లుగా విస్తరించడం జరిగిందన్నారు. ప్రస్తుతం వాహనాల రద్దీ ,ప్రయాణికుల రాకపోకలు 10 రెట్లు పెరిగాయి అన్నారు. అందుకు అనుగుణంగా జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ మల్లు రవి జాతీయ రహదారి విస్తరణ గూర్చి ఇప్పటికే కేంద్రమంత్రి గడ్కరిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా శ్రీశైలం రోడ్డు విస్తరణ గూర్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు మల్లురవి పేర్కొన్నట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

మహేశ్వరం, అక్టోబర్ 22 (నినాదం)



# బలి చక్రవర్తి!

## నీచ రాజకీయాల్లో.. ఓడిన నిజాయితీ!

**జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 23 (నినాదం):** మూడు కాళ్ల సిద్ధాంతం ఒక్కోసారి పతనం అంచుకు తీసుక పోతుంది. మన చుట్టూ ఉండేవాళ్లను దూరం చేస్తుంది. కాలానుగుణంగా మారకపోతే ఇలాంటి దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మాజీ మంత్రి సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాటిపర్తి జీవన్ రెడ్డి విషయంలో ఇదే జరిగింది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయాలకు అనుగుణంగా పొలిటికల్ వ్యూహాలను మార్చుకోక పోవడం మూలంగానే ఇప్పుడు హస్తం పార్టీలో బలి చక్రవర్తిగా మిగిలిపోయారనేది అక్షర సత్యం. . పవర్ లో ఉన్నన్ని రోజులు ఆర్థిక వ్యూహాలు గానీ పొలిటికల్ లాబింగ్ చేయకపోవడం మూలంగానే ఒంటరిగా మిగిలిపోయారనే విమర్శ ఉంది. కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో పద్మవ్యూహంలో ఇరికించి పరిహాసిస్తోంది.. ఒకవైపు అనారోగ్య సమస్యలు.. ఏడు బదులు దాటిన వయసు పట్టు సడలిన నియోజకవర్గం కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. ఎవరు మనోడు ఎవరు పరాయోడు తెలుసుకోలేని పరిస్థితులు చుట్టుముట్టాయి. జాతీయ కాంగ్రెస్ పార్టీ మునుపటి విధానాలు అవలంబిస్తే ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకునేది కాదనేది రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట. జాతీయ పార్టీలో ఎన్ని మార్పులు జరుగుతున్నప్పుడు జీవన్ రెడ్డిలో మార్పు ఎందుకు రాలేదనేది ప్రశ్నార్థకం. రాష్ట్రంలో టిఆర్ఎస్ హవా నడిచినప్పుడు కేసీఆర్ నుంచి కవిత వరకు టిఆర్ఎస్ లోకి ఆహ్వానించిన ఒంటెద్దు పోకడలతో నమ్ముకున్న కార్యకర్తలను వారసత్వ రాజకీయాలను బలి చేసి హస్తం పార్టీ నమ్ముకొని ఏదో సాధించిన అని అందరిలో ఒంటరిగా మిగిలిపోయారనే చర్చ నడుస్తుంది. ఎప్పుడు జగిత్యాల నియోజకవర్గం అంటిపెట్టుకొని ఉండే జీవన్ రెడ్డికి ప్రజల మద్దతులభించక ఓటమిపాలయ్యారు.. కులం మతం అనే అంశాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. ఇవే కాకుండా ప్రత్యర్థులను పనిగట్టుకుని వెంటపడి రాజకీయ భూస్థాపితం చేయడం కోసం ఎప్పుడూ వ్యూహాలను పన్నుతారనేది మరో ఆరోపణ. ఉంది. స్వార్థం.. అవినీతి ఈ రెండింటికి దూరంగా ఉన్న జీవన్ రెడ్డికి ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది ?. ఆయన నమ్ముకున్న కులం మతం గడిచిన ఎన్నికల్లో 100% హ్యాండ్ ఇవ్వడం గమనార్హం. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఇప్పుడు చేస్తున్న రచ్చకు అర్థమే లేదు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ పూర్తిగా పాత సూత్రాలకు తిలోదకాలు ఇచ్చి పొలిటికల్ అప్డేట్ అయింది. జీవన్ రెడ్డి సూత్రాల ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఉంటే సీఎం రేవంత్ రెడ్డి గాని ఇతర వలస నాయకులు గానీ కాంగ్రెస్ పార్టీలో అవకాశం ఉండేది కాదు. రాష్ట్రంలో అంపశయ్య మీద ఉన్న కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత ముమ్మాటికి సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుంది. ఇది చూసేనా జీవన్ రెడ్డి తన రాజకీయ వ్యూహాలను మార్చుకొని మసలు కొని ఉంటే ఈరోజు ఈ పరిస్థితి ఉండేది కాదనేది రాజకీయ విశ్లేషణ. జాతీయ కాంగ్రెస్ పార్టీని కడుపునిండగన్న ఇందిరాగాంధీ మనవడు రాహుల్ గాంధీ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి గాని పీసీసీ మహేష్ గౌడ్ గాని జీవన్ రెడ్డిని కార్నర్ చేసే అవసరమే ఉండదు పార్టీ అవసరాల కోసం తీసుకునే నిర్ణయాలను సీనియర్ కాంగ్రెస్ నాయకులుగా జీవన్ రెడ్డి ఆహ్వానించాలి తప్ప ఇలాంటి పొలిటికల్ కాలుష్యం చేయడం సరైనది కాదనేది హనుమంతరావు లాంటి సీనియర్లు చెబుతున్నారు.

**పార్టీ ఫిరాయింపుతో జీవన్ రెడ్డి వచ్చిన నష్టం ఏంటి..?**

రాష్ట్రంలో పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపుకు పాల్పడి సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కూడా పార్టీ మారి గడిచిన రెండు సంవత్సరాల నుంచి ఇప్పటివరకు 110 కోట్ల నిధులను జగిత్యాల నియోజకవర్గం మళ్లిచారు. అభివృద్ధి పనులు ఎన్ని చేసినా కాంట్రాక్టర్ ఒక్కడే కావడంతో జీవన్ రెడ్డి జీర్ణించుకోలేని అంశంలో ఒకటి. 110 కోట్ల అభివృద్ధి పనుల్లో 20 శాతం మిగిలిన దాదాపు 30 కోట్ల సంపాదన రెండు సంవత్సరాలు అర్జించారని జీవన్ రెడ్డి కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు. పార్టీ ఫిరాయింపుదారునికి సీఎం రేవంత్ రెడ్డి నుంచి ఇతర మంత్రులు కూడా మద్దతు ప్రకటించడంతో జీవన్ రెడ్డి తట్టుకోలేకపోతున్నారు. 40 ఏళ్ల నుంచి నిర్మించుకున్న జగిత్యాల రాజకీయ సామ్రాజ్యం పేక మేడల్లా కళ్ళ ముందే కూలిపోతుంటే చలించిపోతున్నారు. ఇది పార్టీ ఫిరాయించిన సంజయ్ కుమార్ ఒకరితోని సాధ్యం కాదనేది వాస్తవం. జీవన్ రెడ్డి రాజకీయంగా మంచి పొజిషన్లో ఉన్నప్పుడు ఓటమిపాలైన కరీంనగర్ మంథని నియోజకవర్గాల్లో వేలు పెట్టి అనేక ఇబ్బందుల గురిచేసిన సంఘటనలకు ప్రతీకార చర్యలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఎప్పుడు జీవన్ రెడ్డి . మంత్రి శ్రీధర్ బాబు చుట్టూ తిరిగే ధర్మపురి ఎమ్మెల్యే మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ మెజారిటీ ఇస్ లా అనే సూత్రాన్ని పాటిస్తున్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అలా వెళ్లి ఇలా సీఎంను కలిసి పూలబొకే ఇచ్చి నాలుగు ఫోటోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేసి జీవన్ రెడ్డికి మరింత మానసిక వేదనకు గురి చేస్తున్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డి 40 ఏళ్ల ప్రాతిపత్యం పనికిరాకుండా పోయింది. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్క పెట్టుకోవాలని సూత్రాన్ని మరిచిన జీవన్ రెడ్డికి చివరి అంకంలో గట్టి దెబ్బ తాకింది. ఇందిరమ్మ పార్టీలో ఉంటూ ఇందిరమ్మ ఇండ్లు నేలమట్టం చేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు సీఎం రేవంత్ రెడ్డి ఎందుకంత ప్రాధాన్యత ఇస్తుంది అనేది జీవన్ రెడ్డి వాదన. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ పాత సూత్రాలను వదిలేసింది అనడానికి నిదర్శనం కాంగ్రెస్ పార్టీకి కావాల్సింది పాత కొత్త కాదు అదేదో సినిమాలో ఉన్నట్టు దిగిందా లేదా పద్ధతిలో నడుస్తుంది. కెసిఆర్ అవినీతి సామ్రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెగిలించాలని తాపత్రయంలో సీఎం రేవంత్ రెడ్డి క్రైస్తవ పని చేస్తున్న సమయంలో సహకరించాల్సిన సీనియర్లు పార్టీలో రాజకీయపుతున్నారనే విమర్శలకు గురవుతున్నారు.. నూకపల్లి హౌసింగ్ బోర్డ్ ఇందిరమ్మ కాలనీ పునరుద్ధరణ కోసం ప్రతిపాదించిన 52 కోట్లు కు ఇంకా మోక్షం లభించలేదు. అంటే కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని వద్దనుకుంటున్నట్లు సంకేతాలు ఇస్తున్న జీవన్ రెడ్డికి తెలియకపోవడం నిజంగా విచారకరమే. గడిచిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార నేపథ్యంలో కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి చేరిన అనేకమంది నాయకులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వాళ్ళు ఇప్పుడు పార్టీలో పదవుల్లో మంచి పొజిషన్లో ఉన్నారు అవకాశం దొరికిందని జీవన్ రెడ్డితో ఆడుకుంటున్నారు. పార్టీ మారుతానని జీవన్ రెడ్డి బెదిరింపులు ప్రస్తుతం అధిష్టానం కూడా పెద్దగా పట్టించుకున్నట్లు లేదు. గతంలో పార్టీ మారుతున్నట్లు ప్రకటించడంతో సర్ది చెప్పడం కోసం వచ్చిన మంత్రులు ఎమ్మెల్యేలను తన చుట్టూ చేరిన కార్యకర్తలు తిట్టి పోశారు. ఇది మనసులో పెట్టుకున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించిన సంజయ్ కుమార్ కు తెరచాటు మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ కూడా ఉన్నట్లు స్పష్టం అవుతుంది. శ్రీధర్ బాబు కనుసనల్లో పనిచేసే మంత్రి అడ్డూరి కూడా జీవన్ రెడ్డి విషయంలో చేతులెత్తేసినట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీలో 40 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో జీవన్ రెడ్డి బలి చక్రవర్తిగా మిగిలిపోయారనేది కళ్ళ ముందు కనపడుతున్న నిజం..!



# దళారులకు ధాన్యం విక్రయించి దగా పడొద్దు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, అక్టోబర్ 22(నినాదం):** రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామం, చందుర్తి మండలం సనుగులలో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో వట్టిమల్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, బుధవారం ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ లో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దాదాపు జిల్లా వ్యాప్తంగా 240 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 మద్దతు ధర కల్పిస్తున్నామని తెలిపారు. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 అదనంగా బోనస్ అందిస్తామని ప్రకటించారు. రైతులు అధికారుల సూచన మేరకు ధాన్యం తరలించాలని, తేమ 17 శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. కనగర్తి గ్రామంలో రైతుల సంఖ్య ఎక్కువని, వారికి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని విప్ తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం రూ. 20 వేల కోట్ల రుణ మాఫీ చేసిందని వెల్లడించారు. నూతన రేషన్ కార్డులు జారీ చేశామని, ఇప్పటికే ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేశామని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని విప్ గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని, రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణకు అందరి సలహాలు, సూచనల మేరకు ముందుకు వెళ్తున్నామని వివరించారు. రాజన్నకు విశేష పూజలు, భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మూలవాగు, పెంటివాగుపై బ్రిడ్జిలు నిర్మిస్తామని విప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు కచ్చకాయల ఎల్లయ్య, చెలకల తిరుపతి, వైస్ చైర్మన్లు తాళ్లపల్లి ప్రభాకర్, బొజ్జ మల్లేశం, కోనరావుపేట ఫ్యాక్స్ చైర్మెన్ బండ నర్సయ్య, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# నేత్ర దాత ఈరవేణి రాజయ్య చూపు సజీవం

### నేత్రదానంపై అపోహలు వద్దు...

### రాజయ్య సంస్మరణ సభలో సదాశయ ఫౌండేషన్ సభ్యులు

**జమ్మికుంట, అక్టోబర్ 22:** నేత్రదానంపై అపోహలు అవసరం లేదని మన మరణానంతరం మన నేత్రాలను దానం చేయడం వల్ల మరో ఇద్దరి అందులకు చూపు ప్రసాదించిన వారు అవుతామని సదాశాయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు మచ్చగిరి నరహరి తెలిపారు. బుధవారం నేత్రదాత ఈరవేణి రాజయ్య సంస్మరణ సభను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సదాశయ ఫౌండేషన్ సభ్యులు మండలంలోని కోర్కల్ గ్రామంలో నిర్వహించారు. రాజయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించి రాజయ్య కుటుంబానికి అభినందనలు తెలిపిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన రాజయ్య గుండెపోటుతో మరణించగా వారి కుటుంబ సభ్యులు నేత్రదానం చేసి ఇద్దరి అందులకు చూపును ప్రసాదించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలోసదాశయ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రావణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొనినారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రావణ్ కుమార్ జిల్లా అధ్యక్షులు మచ్చగిరి నరహరి నేత్ర అవయవ శరీర దానాలపై అవగాహన కల్పించి జ్ఞాపికను భార్య లక్ష్మి, కుమారులు, రాజ్ కుమార్ , శ్రీధర్ కుటుంబ సభ్యులకుఅందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు గర్రెపల్లి వెంకటేశ్వర్లు. ముస్త్యాల జగదీశ్వర్ వంగల రమేష్, చిదురాల శ్రీనివాస్, బండి మల్లేష్ (కానిస్టేబుల్), రామిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.



# ఘనంగా స్వేరోస్ డే

### అక్షరం ఆరోగ్యం- ఆర్థికం ఆత్మగౌరవం స్వేరోస్ నినాదం

### స్వేరోస్ జిల్లా అధికార ప్రతినిధి ఆకినపల్లి ప్రవీణ్

**జమ్మికుంట, అక్టోబర్ 22 (నినాదం):** బడుగు బలహీనవర్గాల పేదింటి బిడ్డలకు ఉన్నత చదువులు అందించాలనే ఉద్దేశంతో ఎన్.ఆర్ శంకరం స్థాపించిన గురుకుల పాఠశాలలో ఎంతోమంది ఉన్నత విద్యలను అభ్యసిస్తున్నారని స్వేరోస్ జిల్లా అధికార ప్రతినిధి ఆకినపల్లి ప్రవీణ్ అన్నారు. బుధవారం స్వేరోస్ డే సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ, ఆ మహనీయుడు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ స్వేరోస్ డే అని అప్పటి సెక్రెటరీ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నామకరణం చేయడం జరిగిందని తెలిపారు. హుజురాబాద్ పట్టణంలో కరీంనగర్ జిల్లా స్వేరోస్ అధికార ప్రతినిధి ఆకినపల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో స్వేరోస్ డే ను ఘనంగా నిర్వహించారు. ఊరు చివరన ఉన్న పిల్లల బతుకులను ప్రపంచానికి కేంద్ర బిందువుగా తయారు చేయాలనే ఉద్దేశంతో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాలవత్ పూర్ణ ఆనంద్ లను ఎవరెస్టు శిఖరం ఎక్కించి ఇతరుల కంటే మేము తక్కువ కాదని నిరూపించారని పేర్కొన్నారు. స్వేరోలు అన్నిరంగంలో అగ్రస్థానంలో నిలుస్తున్నారంటే దానికి కారణం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర నాయకులు చిరంజీవి ఎర్ర రాజు మేకల రవీందర్ తునికి వసంత్ నవీన్ స్వామి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బేతిగల్ టు కరీంనగర్ నూతన బస్ సర్వీసును ప్రారంభించిన ప్రణవ్





### 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నెరవేరిన వేళ గ్రామస్తుల్లో ఆనందం

### గ్రామాల అనుసంధానికి కాంగ్రెస్ పార్టీ మరింత కృషి

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

### ఘన స్వాగతం పలికిన బేతిగల్ గ్రామస్థులు

**జమ్మికుంట, అక్టోబర్ 22 (నినాదం):** నూతన బస్సు సౌకర్యం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు,ముఖ్యంగా స్కూల్స్,కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. బుధవారం నాడు హుజురాబాద్ డిపో పరిధిలో జమ్మికుంట నుండి వయా బేతిగల్,కేశవపట్నం మీదుగా కరీంనగర్ వరకు నూతన బస్ సర్వీసును గ్రామస్థులతో కలిసి ఆయన ప్రారంభించారు. 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న బస్ సర్వీసు ప్రణవ్ ప్రారంభించడానికి రావడంతో గ్రామస్థులు బాణాసంచా కాల్చి ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ బస్ కోసం బేతిగల్ గ్రామ ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న కళ ఈ రోజు నిజమయ్యిందని,ప్రతీ రోజు రెండుసార్లు సర్వీసు నడుస్తుందని దీన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్వయంగా బస్ టికెట్ తీసుకొని కొంతదూరం ప్రయాణించారు. జమ్మికుంట నుండి కరీంనగర్ వయా బెతిగల్ మీదుగా వెళ్ళే ఈ కొత్త బస్సు వారి ప్రయాణ సమయాన్ని తగ్గించి,భద్రతను పెంచుతుందని,మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందనీ,మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. ఏళ్లుగా ఈ రూట్ లో బస్ సౌకర్యం కల్పించాలని ఎదురుచూస్తున్న ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మోక్షం లభించడం ఆనందంగా ఉందని దీనికి సహకరించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామనీ అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీనీ ఒక్కక్కటి పూర్తి చేస్తామని తెలిపారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..**

వీణవంక మండల పరిధిలోని బేతీగల్,వల్భాపూర్ గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్..బేతిగల్ గ్రామంలో 4,వల్భాపూర్ గ్రామంలో 3 చెక్కులను 3,15,000/- రూపాయల విలువ చేసే చెక్కులను పంపిణీ చేసిన అనంతరం వెంటనే చెక్కులను బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు.

# ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృతిమ కాలు అందజేత



**జమ్మికుంట, అక్టోబర్ 22 (నినాదం):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రామన్న పల్లి కి చెందిన పూరెల్ల రాజయ్య కు ప్రమాదవశాత్తు తన కుడికాలు కోల్పోయి ఆలయ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత ను సంప్రదించగా ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకులు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ అధికారి చొరవతో శ్రీ భగవాన్ మహావీర్ ట్రస్ట్ హైదరాబాద్ వారి సౌజన్యంతో అతనికి జైపూర్ ఫుట్ ను అందించినట్లు ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదే గుణ సాగర్ నేత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఆలయ ఫౌండేషన్ గత పది సంవత్సరాలుగా ఉమ్మడి ఆదిలాబాద్ కరీంనగర్ వరంగల్ జిల్లాలలో విద్యా వైద్యం ఉపాధి కార్యక్రమాలను చేపట్టామనితలసేమియా వ్యాధి చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు మారుమూల గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏజెన్సీ ప్రాంతాలలో ఉచిత కంటి శిబిరాలు వికలాంగులకు ప్రత్యేకంగా క్యాంపు లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ మధ్యప్రదేశ్ రాష్ట్ర క్యాడర్ లో వుంటూ జన్మభూమి పై సేవ చేయడం చాలా హర్షణీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత రాజు పాల్గొన్నారు.

# కఠినమైన పాఠ్యాంశాలు నేర్పించేందుకు బుధవారం బోధన

### మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, అక్టోబర్ 22(నినాదం):** విద్యార్థులకు కఠినమైన పాఠ్యాంశాలను నేర్పించేందుకు బుధవారం బోధన కార్యక్రమం ఉపకరిస్తుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి బుధవారం అన్ని పాఠశాలల్లో బుధవారం బోధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ రూరల్ మండలం దుర్షేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోధన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పర్యవేక్షించారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. 9వ తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించారు. ప్రతి విద్యార్థితో పాఠాన్ని చదివిస్తూ స్పష్టంగా అర్థవంతంగా చదివేందుకు మెళకువలు నేర్పారు. ప్రతి విద్యార్థి నోట్ బుక్ లో రైటింగ్ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ, బుధవారం బోధనలో ఏదైనా సబ్జెక్టులోని కఠినమైన పాఠాన్ని ఎంచుకొని చదవాలని అన్నారు. శ్రద్ధ అంకితభావంతో నేర్చుకోవాలని సూచించారు. బుధవారం బోధన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్య ఇస్తూ కఠినమైన పాటల పట్ల దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ పిల్లలకు కొన్ని సూచనలు చేశారు. కూరలు ఎక్కువగా తినాలని, ఆకుకూరలు, గుడ్లు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఏ ఆహార పదార్థాల్లో ఏ పోషకాలు ఉంటాయని విద్యార్థులను ప్రశ్నిస్తూ వారికి వివరించారు. పాఠశాలలో విద్యార్థులకు ఏవైనా అవసరాలు ఉంటే వెంటనే కల్పించాలని విద్యాధికారిని ఆదేశించారు. విద్యార్థులు చేతులు కడుక్కునే చోట నల్లాలు లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజేష్, ఎంఈఓ రవీందర్ పాల్గొన్నారు.



# ఘనంగా కొమరం భీమ్ జయంతి

### ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన వీరుడు కొమరం భీమ్.

### ఏబీవీపీ నగర కార్యదర్శి నిరూప్

**జమ్మికుంట, అక్టోబర్ 22 (నినాదం):** అఖిలభారత విద్యార్థి పరిషత్ జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో కాకతీయ జూనియర్ కళాశాలలో కొమరం భీమ్ జయంతి కార్యక్రమం పట్టణంలోని కాకతీయ మహిళా జూనియర్ కళాశాలలో పట్టణ కార్యదర్శి నిరూప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల కొరకై అడవి బిడ్డల సంరక్షణకు జల్ జంగల్ జమీన్ అని గర్జిస్తూ నిజాం గుండెల్లో రైలు పరిగెత్తిచ్చిన వ్యక్తి కొమరం భీం అని తెలిపారు. అలాంటి వీరుడుని ఈ నాటి యువతి యువకులు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ప్రతి ఒకరు కొమరం భీమ్ ఆశయాలు దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు స్వేచ్ఛ, రవళి, హర్షిత, అమ్ములు, అవంతి, యశస్విని,రోహిత్, ఆరిఫ్, మహేష్, అఫ్రిది, అబ్బ, సిద్దు, ధనుష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వెల్గటూర్ లో కుక్కల సమూహం..

# కుక్కలు, కోతుల బెడదతో బెంబేలెత్తుతున్న ప్రజలు

**వెల్గటూర్,అక్టోబర్22(నినాదం న్యూస్):** మండల కేంద్రంలో రాష్ట్ర రహదారిపై, వీధుల గుండా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అలాగే ఇళ్లలోకి చొరబడి కోతులు గృహిణులను,ప్రజలను హడలెత్తిస్తున్నాయి. మండల కేంద్రంలోని రాష్ట్ర రహదారిపై బస్టాండ్ నుండి కోటిలింగాల కమాన్ వరకు ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా మాంసం దుకాణాల వద్ద కుక్కలు పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. వీటి వలన సామాన్య ప్రజలు,విద్యార్థులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాల వెంటపడి తీవ్ర ఇబ్బందులకు,ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. రాత్రి సమయంలో కుక్కల దాడికి పాదచారులు, వాహన దారులు రోడ్డు గుండా వెళ్లాలంటేనే హడలి పోతున్నారు. గత కొన్ని రోజుల క్రితం మండలంలోని జగదేవ్పేట గ్రామంలో కుక్క లు దాడి చేసి పలువురిని గాయపరిచిన విషయం తీవ్రభయాందోళనకు గురి చేస్తుంది. మండలంలో కుక్క కాటు బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. అప్పటివరకు బాగానే ఉంటున్న వీధి శునకాలు ఉన్నట్టుండి ఒక్కసారిగా దాడులకు పాల్పడుతున్నాయి. కుక్కలు,కోతుల బాధ నుండి ఉపశమనం కల్పించాలని ప్రజలు వేడుకుంటున్నారు. ఎన్ని సంఘటనలు జరుగుతున్నా కూడా అధికారులు,ప్రజా ప్రతినిధులు సరైన చర్యలు చేపట్టడం లేదని, భయం భయంగా కాలం గడపాల్సి వస్తోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పత్రికా కార్యాలయాలపై దాడులు అమానుషం

## టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ మెంబర్ బి.మల్లేష్



**వరంగల్ అక్టోబర్ 22 (నినాదం న్యూస్ ) :** నమస్తే తెలంగాణ దినపత్రిక వరంగల్ యూనిట్ కార్యాలయంపై దాడి అమానుషంమని టీడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ) జాతీయ కౌన్సిల్ మెంబర్ బి.మల్లేష్ తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ అయినా, ప్రజాప్రతినిధి అయినా ప్రజాస్వామ్యంలో నాలుగోస్థంభంగా ఉన్న మీడియాపై బెదిరింపులకు దిగటం మంచిపద్ధతి కాదనన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై వార్తలు రాసే స్వేచ్ఛ పత్రికలకు ఉంటుందని, పేపర్లలో తమకు వ్యతిరేక వార్తలు వస్తే, వాటికి ఖండనలు ఇవ్వటం, వివరణలు ఇవ్వటం చేయాలి కానీ బెదిరింపులకు పాల్పడటం, భౌతిక దాడులకు దిగటానికి ప్రజాస్వామ్యంలో చోటులేదన్నారు. భావప్రకటనా స్వేచ్ఛ పై దాడి సరికాదన్నారు. ఈదాడి పత్రికా స్వేచ్ఛపై జరిగిందని ప్రజాస్వామ్యవాదులు దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలైన పత్రికలు మీడియాను కాపాడవలసిన బాధ్యత చట్టంపై ఉన్నదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తప్పు చేయకపోతే చట్టం ద్వారా న్యాయం ద్వారా దీనిని పరిష్కరించుకోవచ్చుని ఇలా దాడులకు దిగడం వల్ల వారి వైఖరి ప్రజలకు అర్థమవుతుందని అన్నారు. రాజకీయ పార్టీలు , ప్రభుత్వాలు అవకాశం ఉన్నంత మేరకు ప్రజలతో మమేకమవుతూ ప్రజా సమస్యలు ఎప్పటి కప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తూ గొంతులేని వారి గొంతుకై ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడుతున్న పత్రికలపై దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. తక్షణమే పత్రికా కార్యాలయంపై దాడికి దిగిన వారిని అరెస్టు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా ఉపాధ్యాక్షుడు టీ.స్వామినాథ్ , సంఘం నాయకులు గాధం సురేష్ ,వల్లభనేని కిరణ్ ,కందలోజు శ్రీనివాస్ , వీరభద్రయ్య , నాగరాజు ,తౌటు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

## అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ కొత్తకోట మండల పరిధిలోని పాలెం, మదనాపూర్ రైతు వేదికల్లో వేర్వేరుగా వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు మండల స్థాయిలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ 2025-26 సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సన్న, దొడ్డు రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. వర్షాలు వస్తే ఇబ్బందులు లేకుండా టార్పాలిన్ లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే నిర్దేశించిన మిల్లులకు తరలించాలని చెప్పారు. గన్నీ బ్యాగులు సరిపడునన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై డిఎం జగన్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వ్యవసాయ అధికారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ ప్రారంభించాలి

## కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం):** అమరచింత, ఆత్మకూరు మున్సిపాలిటీల పరిధిలో ఇందిరమ్మ ఇండ్లకు ప్రొసీడింగ్స్ తీసుకుని గ్రౌండింగ్ చేయని లబ్ధిదారులతో వేగంగా గ్రౌండింగ్ ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ అమరచింత మున్సిపల్ కార్యాలయంలో అమర చింత, ఆత్మకూరు పురపాలక అధికారులతో ఇంకా గ్రౌండింగ్ చేయకుండా పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల అంశం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వారం రోజుల్లో పెండింగ్ వాటిలో 50 శాతం ఇండ్లు గ్రౌండింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం కల్పించిన మంచి అవకాశం అని వివరించి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకునే విధంగా చొరవ తీసుకోవా లన్నారు. ఇదివరకే ఇలా నిర్మాణాలు ప్రారంభించి పేమెంట్లు పొందిన లబ్ధిదారులతో మాట్లాడించాలన్నారు. అదేవిధంగా మండలాల పరిధిలో ఎంపీడీవోలు సైతం ఇళ్ల నిర్మాణాలు వేగంగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులను పిలిచి మీటింగ్ ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇండ్లకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశం గురించి తెలియజేసి ప్రోత్సహించాలని చెప్పారు. ఇందిరా మహిళల లబ్ధిదారు లకు ఇంటి నిర్మాణంలో ఇసుక ఇబ్బందులు లేకుండా తహసిల్దార్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

**శిక్షణకు హాజరుకాని ఇన్చార్జిలపై కలెక్టర్ ఆగ్రహం**

మండల పరిధిలోని పామిరెడ్డిపల్లి గ్రామ రైతు వేదికలో వరి కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు మండల స్థాయిలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమానికి వచ్చిన కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు, ఆపరేటర్ల అటెండెన్స్ ను కలెక్టర్ పరిశీలించారు. చాలావరకు పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు, ఆపరేటర్లు శిక్షణ కార్యక్రమానికి హాజరు కాకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శిక్షణ కార్యక్రమానికి రాకపోతే ధాన్యం కొనుగోలు ఎలా చేపడతారని అసహనం వ్యక్తం చేశారు. శిక్షణ కార్యక్రమానికి పిఎసిఎస్ ల ఇన్చార్జిలను రప్పించడంలో విఫలమైన సంబంధిత మండల వ్యవసాయ అధికారులకు, పాక్స్ సిబ్బందికి షోకాస్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారికి కలెక్టర్ ఆదేశించారు. అందరూ ఇన్చార్జిలను, ఆపరేటర్లను తప్పనిసరిగా పిలిపించి మళ్లీ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ డిఈ విటోబా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు గౌడ్, జిల్లా సహకార శాఖ అధికారిని రాణి, పౌర సరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, తహసీల్దార్ లు చాంద్ పాషా, రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు శశిధర్, నాగరాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కానిస్టేబుల్ కుమార్తెల ప్రతిభకు ఎస్పీ అభినందనలు



**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 22(నినాదం):** ఉమ్మడి జిల్లా సైకిల్ రేస్ లో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ కుమార్తెల అద్భుత ప్రతిభకు జిల్లా ఎస్పీ అభినందించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వనపర్తి జిల్లా గోపాలపేట మండలానికి చెందిన కానిస్టేబుల్ కూతుళ్లు, సోదరీమణులు 14 సంవత్సరాల లోపు వయస్సు విభాగంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన 5 కిలోమీటర్ల రోడ్ స్పీడ్ సైకిల్ రేస్‌లో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన పి.మనస్వి, పి.గ్నాపిక లను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన వనపర్తి చిన్నారులు మనస్వి, గ్నాపికలు చూపిన పట్టుదల, కృషి నిజంగా స్ఫూర్తిదాయకమని, వారి ప్రతిభ వనపర్తి జిల్లాకు గర్వకారణం మాత్రమే కాదు, పిల్లలందరికీ ప్రేరణ కూడా అన్నారు. ఇద్దరూ పోలీసు కుటుంబానికి చెందిన కానిస్టేబుల్ కుమార్తెలు కావడం గర్వంగా ఉందని, పోలీసు కుటుంబాల పిల్లలు విద్యా రంగం, క్రీడా రంగంలో రాణిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. క్రీడలు కేవలం పోటీలు కాదు వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శకాలని, మనస్వి, గ్నాపిక లు చూపిన క్రమశిక్షణ, పట్టుదల ప్రతీ తల్లిదండ్రికి స్ఫూర్తి అని, వీరి విజయాలు రేపటి భారతదేశానికి క్రీడా శక్తిని గుర్తు చేస్తున్నాయని అన్నారు. ఇలాంటి ప్రతిభావంతులు భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించి వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ అన్నారు. ఎస్పీ తల్లిదండ్రులు, కోచ్‌ల కృషిని ప్రశంసిస్తూ వారి మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డిసిఆర్బి డిఎస్పి ఉమామహేశ్వరరావు, వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు, రిజర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, విద్యార్థినిల తండ్రి నాగరాజు గౌడ్ తదితరులు ఉన్నారు

# దళారులను నమ్మి మోసపోవద్దు

## తహసీల్దార్ కె.హిమబిందు



**కోదాడ, అక్టోబర్ 22 (నినాదం):** దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని,ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అనంతగిరి తహశీల్దార్ కె.హిమబిందు అన్నారు.అనంతగిరి మండల పరిధిలోని పాలవరం,త్రిపురవరం,కొత్త గోల్ తండా,అమీనాబాద్,అనంతగిరి శాంతినగర్ గ్రామాలలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు.అనంతరం రైతులను ఉద్దేశిస్తూ ఆమె మాట్లాడుతూ దళారీ వ్యవస్థను అరికట్టేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు.రైతులు నాణ్యమైన ధాన్యాన్ని ఐకేపీ సెంటర్ కు తీసుకవచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు.ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది అని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరి సింగ్,ఏపిఎమ్ సౌజన్య,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు,సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి,గునుకుల గోపాల్ రెడ్డి బాబు నాయక్,డేగ కొండయ్య,మట్టపల్లి రామకోటయ్య, మట్టపల్లి సైదులు, మట్టపల్లి ప్రభాకర్, మట్టపల్లి నరేష్, సిసి రామకృష్ణ,ఏఈవోలు,ఆయా గ్రామాల నాయకులు,ఐకెపి సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అన్న ప్రసాద వితరణకు దాతల సహకారం అభినందనీయం

## హరిహర పుత్ర అయ్యప్ప ట్రస్ట్ చైర్మన్ వాసు గురుస్వామి

**కోదాడ, అక్టోబర్ 22(నినాదం):** తెలంగాణ శబరిమల గా పేరుగాంచిన అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రసార సమితి సూచనలతో 58 రోజులపాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా 16వ రోజు బుధవారం 550 పైగా అయ్యప్ప మాలదారులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి దాతలుగా వెంకట్రాపురం అయ్యప్ప మాలదారులు బృందం వ్యవహరించారు. ఈ కార్యక్రమం లో... కొండపల్లి వాసు గురుస్వామి, ఐతనబోయిన వెంకటేశ్వర్లు,పి. నరసింహారావు, కత్రం బాపూజీరెడ్డి, గొల్ల పున్నయ్య, యరసాని రవి, ఈదుల యాదగిరి, గాదం శ్రీను తోకల మహేష్ తదితరులు పాల్గొన్నారు.


# ఛలో ఇందిరా పార్క్ విజయవంతం చేయండి

## - బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ పైడిపెల్లి రమేష్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** బీసీ రిజర్వేషన్ అమలు కోసం చేపట్టిన ఛలో ఇందిరాపార్క్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజీ జేఏసీ జిల్లా చైర్మన్ పైడిపెల్లి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బీసీ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జస్టిస్ ఈశ్వరయ్య, ఐఏఎస్ చిరంజీవులు, డా. విశారాధన్ మహారాజ్ నాయకత్వంలో జరుగుతున్న బీసీ రిజర్వేషన్ 42శాతం బిల్లును 9షెడ్యూల్ లో చేర్చాలని డిమాండ్ తో ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ ధర్నాకు జిల్లాలోని బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, ఎస్టీ, ఎస్సి సంఘాల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలోబీసీ జేఏసీ వర్కింగ్ చైర్మెన్ గట్ల రాజన్న, కన్వీనర్లు జోగు బుచ్చన్న, కో కన్వీనర్లు బర్ల గట్టయ్య, క్యాతరాజు సాంబమూర్తి, అమృత అశోక్, కో ఆర్డినేటర్ శేఖర్ నాని కమిటి సభ్యులు తాటికంటి రవి కుమార్, కొండపర్తి ఇస్తారీ, యాదండ్ల గటయ్య, యూత్ నాయకులు పూర్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అవుట్ పోస్ట్ పనులను పరిశీలించిన ఎస్పీ



**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 22(నినాదం) :** జూరాల ప్రాజెక్టు పరిసర ప్రాంతంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి, అక్కడ నిర్మాణంలో ఉన్న జూరాల ప్రాజెక్టు పోలీసు అవుట్ పోస్ట్ పనులను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ బుధవారం స్వయంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు వంటి వ్యూహాత్మక ప్రదేశాల్లో ప్రజల భద్రత మా ప్రధాన ధ్యేయమని, ఈ అవుట్‌పోస్ట్ ప్రజలకు భరోసా చిహ్నం, పోలీసులకు సేవా కేంద్రం కావాలని అన్నారు. నిర్మాణంలో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండకూడదని, భవనం బలంగా, ఆధునిక సదుపాయాలతో, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని కోరారు.

# వరి ధాన్యాన్ని గుర్తించడంలో అవగాహన కలిగి ఉండాలి





## కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచన

**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం)** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సన్న, దొడ్డు రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కలెక్టర్ వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని జూరాల రైతు వేదికలో వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు మండల స్థాయిలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ 2025-26 సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఎఫ్ ఏ క్యూ ప్రమాణాల ప్రకారం ఉన్న ధాన్యాన్ని గుర్తించేలా కొనుగోలు కేంద్రం ఇంచార్జిలు అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు.ప్రతి పీపీసీ లో నిర్దేశించిన రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. రైతులు పీపీసీ కి ధాన్యం ఎప్పుడు తెచ్చారు, ధాన్యం తేమ ఎప్పుడు ఎంత ఉంది అనేది రిజిస్టర్లలో రాసుకోవాలన్నారు. వర్షాలు వస్తే ఇబ్బందులు లేకుండా టార్పాలిన్ లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ట్రైనింగ్ తీసుకున్న ఇంచార్జి లు, ఆపరేటర్ లు మాత్రమే సెంటర్ లలో కనిపించాలని, వేరే వ్యక్తులు ఉండడానికి వీల్లేదని ఆదేశించారు. హార్వెస్టర్లతో మాట్లాడి పంటలో గింజ పక్వానికి వచ్చినపుడే కోతలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**-ఓపెన్ జిమ్ అందుబాటులోకి తెచ్చే ఏర్పాట్లు చేయాలి**

ఆత్మకూరు మండల కేంద్రంలోని పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో ఉన్న పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. పార్కులో ఓపెన్ జిమ్ కు కావలసిన వస్తు సామాగ్రిని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ కు తెలియజేశారు. త్వరలోనే ప్రారంభించి, ప్రజల వినియోగానికి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయధికారి ఆంజనేయులు గౌడ్, సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్, డీసీఓ రాణి, తహసీల్దార్ చాంద్ పాషా ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# నూతన కమిటీ ఏర్పాటుకు నేడు సన్నాహక సమావేశం



**మహాముత్తారం, అక్టోబర్ 22 (నినాదం):** ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మహాముత్తారం మండల నూతన కమిటీ ఏర్పాటుకు ఈ నెల 23న సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల కన్వీనర్ రామగిరి రాజు తెలిపారు. బోధించు సమీక రించు పోరాడు బాబాసాహెబ్ అంబే ద్కర్ సూత్రికరించిన విధంగా ఎస్సీలు ఎస్టీలు బీసీలు మైనార్టీలు కలిసి వచ్చే ఇతర అణగారిన వర్గాలు కలుపుకొని నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సామాజికంగా ఆర్థికంగా విద్యా పరంగా రాజకీయంగా సాంస్కృతికంగా దళిత బహుజనులను చైతన్యవంతం చేయడం కోసం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో కృషి చేస్తుందని, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కోఆర్డినేటర్ ఎస్ వరుణ్ కుమార్ నేతృత్వంలో జాతీయ ఉపాధ్యక్షులు మామిడి బాపయ్య , రాష్ట్ర అధ్యక్షులు కాడారం వినయ్ కుమార్ దిశ నిర్దేశంలో అనేక గ్రామాలలో దళిత దళిత వర్గాలకు అండగా ఉండేందుకు నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు, ఈ క్రమంలో మహా ముత్తారం మండలంలోని దళితులు అణగారిన వర్గాల వారు ఆసక్తి కలిగిన ఇతర కులాల వారు కూడా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం లో తమతో కలిసి పని చేయడానికి ఆహ్వానిస్తున్నామని ఆయన పిలుపునిచ్చారు. మహాముత్తారం నూతన కమిటీ కమిటీ ఏర్పాటు, నిర్మాణం కోసం జాతీయ రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు.

# నవంబర్ 15 వరకు ఫ్రైడే ఫ్రైడే ప్రోగ్రాంలు నిర్వహించాలి

## కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం) :** జిల్లాలో ఇంకా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో నవంబర్ 15వ తేదీ వరకు ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అభా కార్డుల జనరేషన్ ప్రక్రియను ఇంకా వేగవంతం చేసి పురోగతి సాధించాలన్నారు. అదేవిధంగా డెంగ్యూ పరీక్షలను కూడా కొనసాగించాలని ఆయన సూచించారు. ఏఎన్ఎంలతో ఎన్సిడి స్క్రీనింగ్ కార్యక్రమాన్ని చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని కూడా జిల్లాలో ప్రారంభించేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎం సీ హెచ్ లో ప్రెజర్ ఆక్సిజన్, ఇంక్యుబేటర్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్లు సాయినాథ్ రెడ్డి, రామచంద్రరావు, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్వేరోస్ డే ఒక విప్లవాత్మకమైన మార్పు కోసం పాటుపడే రోజు



**డోర్నకల్/దంతలా పల్లి అక్టోబర్ 22(నినాదం న్యూస్):** జ్ఞానసమాజ నిర్మాణమే ధ్యేయంగా, సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఏర్పాటు ఆద్యుడు, ప్రజల ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ జయంతి రోజైన అక్టోబర్ 22న స్వేరోస్ డే స్వేరోస్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నాం. నిరంతరం అణచివేతలకు గురవుతున్న జాతుల అభ్యున్నతిని కాంక్షిస్తూ, ఆ జాతు లను జ్ఞానసమాజంవైపు నడిపించేందుకు నిత్యశ్రామికుడు, సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి, ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఈ నెట్వ ర్కు అంకురార్పణ చేశారు.వేల ఏండ్లుగా పరాజితులుగా, బాధితులుగా మిగిలిపో యిన జాతులను విజయతీరాలవైపు నడిపించాలనే దృఢ సంకల్పంతో ఈ నెట్వర్క్ ఏర్పడింది. సంక్షేమ గురుకులాల ఏర్పాటుకు కృషి చేసిన దివంగత ఐఏఎస్ అధి కారి, ప్రజల మనిషి ఎస్.ఆర్.శంకరన్ జయంతి రోజైన అక్టోబర్ 22ను స్వేరోస్ డేగా ఘనంగా జరుపుకుంటున్నాం. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మహేందర్ బాషపంగు సీనియర్ నాయకులు దర్శనల ఉమేశ్ మిడతపల్లి నగేష్ , మిడతపల్లి చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

# అసంఘటిత కార్మికులు సురక్ష బీమా చేయించుకోవాలి




**మిర్యాలగూడ అక్టోబర్ 22 (నినాదం):** అసంఘటిత కార్మికులు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి శ్రీనివాస్ కోరారు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని వివిధ రకాల వ్యాపారవేత్తల తోటి ఏం చేసినారు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా )ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అటువంటి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కార్యక్రమం కింద ప్రతి సంవత్సరం 20 రూపాయల తోటి ఇన్సూరెన్స్ చేసుకున్నట్లయితే ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలియజేసినారు. 18 సంవత్స రాల నుంచి 70 సంవత్సరాల లోపు వయసు ఉన్నటు వంటి కార్మికులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నటువంటి వర్తకులు ఎవరైనా సరే ఈ స్కీము కింద పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. బ్యాంకులో 20 రూపాయల తోటి ఇన్సూరెన్స్ కట్టినట్లయితే సంవత్సరం మొత్తం కూడా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వర్తిస్తుందని తెలి యజేశారు ప్రతి సంవత్సరం 20 రూపాయలు రెన్యువల్ చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా పట్టణంలో ప్లాస్టిక్ ఉపయోగించ కూడదని మిర్యాల పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని తెలియజేశారు .ఈ స్కీన్ కింద రైస్ మిల్లులో పనిచేసేటువంటి కార్మికులు ,హోటల్లో పనిచేసే వాళ్లు భవన నిర్మాణ కార్మికులు, హాస్పిటల్ లో పనిచేసే వాళ్లు, లారీ డ్రైవర్లు, క్లీనర్లు కార్మికులు ,వలస కార్మికులు వివిధ రంగాల్లో పనిచేసినటువంటి డెలివరీ బాయ్స్ అందరూ ఈ స్కీం కింద మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా సెక్షన్ లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. వారి యొక్క ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్ తోటి స్కీము ఉపయోగించుకోవాలన్నారు. పట్టణంలోని వర్తక వ్యాపార యజమానులు క్లాత్ మర్చంట్ అసోసియేషన్ పాల్గొన్నారు.

# సిఐ రాజును సత్కరించిన ప్రముఖ పత్తి వ్యాపారి వెంకట్రాములు



**చింతపల్లి, అక్టోబర్ 22(నినాదం) :** మండలంలోని గడియ గౌరారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు, ప్రముఖ పత్తి వ్యాపారి వరికుప్పల వెంకట్రాములు నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన సి ఐ. రాజును షాలువాతో ఘనంగా సత్కరించారు.

# భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు



**సూర్యాపేట ప్రతినిధి అక్టోబర్ 22 (నినాదం):** మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శివాలయాల్లో బుధవారం కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ముందుగా స్వామి వారికి పంచామృతాలతో రుద్రాభిషేకం చేసి అందమైన పూలతో అలంకరించారు. మహిళలు దేవాలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. శివ దీక్షా స్వాములు దేవాలయంలో స్వామి వారిని కీర్తిస్తూ భజనలు చేశారు.

# దైవచింతనతో మానసిక ప్రశాంతత



**చింతపల్లి, అక్టోబర్ 22 (నినాదం):** దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. మండలంలోని దేన్య తండా గ్రామ పంచాయతీ పరిధి లోని ఘాసిరాం తండా లోకొలువై ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామివారి 6వ వార్షికోత్సవం కార్యక్రమంలోబుధవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రమావత్ కొండల్, మంధ్యానాయక్, ఆలయ కమిటీ చైర్మన్ హరి నాయక్, జబ్బర్, సుందర్, గౌరాజ్,తరుణ్,పూల్ సింగ్,వినోద్,తదితరులు పాల్గొ న్నారు.

# క్రికెట్ టీంకి జెర్సీలు పంపిణీ

## -యువత క్రీడల్లో రాణించాలి డాక్టర్ రఫీ



**మహాముత్తారం, అక్టోబర్ 22 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం క్రీడాకారులకు రఫీ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ రఫీ జెర్సీలు పంపిణీ చేశారు. మల్హర్ మండలం వల్లెంకుం ట క్రికెట్ టోర్నమెంట్ లో రాణించి మొదటి బహుమతి గెలుపొందిన మహాముత్తారం మండల బాపు 11 టీం కి జెర్సీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడలతో మానసి కొల్లాసం పెంపొందుతోందని తెలిపారు.ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు చల్లా నారాయణరెడ్డి హాజరై మాట్లాడారు.

# అడవి బిడ్డల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమరం భీం




**మిర్యాలగూడ అక్టోబర్ 22 (నినాదం) :** అడవిబిడ్డల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమరం భీం అని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్, బిసి జేఏసీ కో కన్వీనర్ చేగొండి మురళీ యాదవ్ లు అన్నారు. కొమరం భీమ్ 124వ జయంతి సందర్భంగా మిర్యాల గూడ లోని మెరెడ్డి రాంచంద్రరెడ్డి గ్రంథాల యంలో ఆయన చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు.గిరిజన బిడ్డల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన పోరాట యోధుడు కొమరం భీం అని చెప్పారు. నిజాం నవాబుల పాలనలో రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమించిన నాయకుడు కొమరం భీమ్ అని చెప్పారు.జల్ జంగల్, జమీన్ నినాదం ఇచ్చి అడవి బిడ్డలకు ఐక్యం హాక్కులను సాధించారని పేర్కొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నాణ్యతతో చేపట్టాలి**

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్‌ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం) :** నిర్మల్ గ్రామీణ మండలంలోని నాగ్నాయిపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనం పనులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భవన నమూనా మ్యాపులను పరిశీలించి, అవసరమైన సవరణలపై సూచనలు చేశారు. భవన నిర్మాణం నాణ్యవంతంగా, సమయానికి పూర్తి కావాలని, సరిపడినంతమంది కూలీలను నియమించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ప్రదేశం కేటాయించాలన్నారు. భవనం చుట్టూ హద్దుల గుర్తులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి భవనాలు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతను పెంపొందించేందుకు చేపట్టిన ప్రాధాన్యమైన కార్యక్రమమని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ పట్టణంలోని బంగాల్‌పేట్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతోందని, పనులను నాణ్యవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. దశలవారీగా నిధులు విడుదల చేయడం జరుగుతుందని, అధికారులు పర్యవేక్షణను క్రమం తప్పకుండా కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. నిరుపేద లబ్ధిదారుల తమ సొంత ఇంటి కలను నెరవేర్చినందుకు ప్రభుత్వానికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ చందు జాదవ్, డీఈ తుకారం రాథోడ్, ఏఈఈ చందన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు ప్రభాకర్, రాజు, ఎంపీడీవో గజానన్, హౌసింగ్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డీసీహెచ్‌వోకు ఘన సన్మానం : బీసీ జేఏసీ నేతలు



**పెద్దపల్లి ప్రతినిధి,అక్టోబర్ 22(నినాదం):** పెద్దపల్లి జిల్లా డీసీహెచ్‌వో శ్రీధర్‌ను బుధవారం బీసీ జేఏసీ నేతలు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా జిల్లా ఆసుపత్రి, మాత శిశు సంరక్షణ కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించటంతో పాటు, అన్నిరకాల సేవలు కల్పించటంలో విశేష సేవలందిస్తున్నారని డీసీహెచ్‌వో శ్రీధర్‌ను కొనియాడారు. దీంతో పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన రోగులకు ప్రభుత్వ ఆసుపత్రు ల్లోనే కార్పొరేట్ ఆసుపత్రుల్లో లభించే సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రధానంగా పెద్దపల్లి లో ప్రసూతి వైద్యం, డయాలసిస్, గుండెకు సంబంధించిన అన్ని పరీక్షలు, అన్ని రకముల విభాగాలకు సంబంధించినటువంటి ఓపి సేవలు ఇన్‌పేషెంట్ సేవలు అందిస్తున్న టు వంటి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లకు మరియు సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేస్తూ ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్‌ను ఘనంగా సన్మానించిన బీసీ జేఏసీ నేతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో పెద్దపల్లి బీసీ జేఏసీ ప్రధాన నాయకులు కొండి సతీష్, తాడూరి శ్రీమాన్, ఆకుల స్వా మి వివేక్ పటేల్ కోమటిపల్లి రాజేందర్ నేత, రాజగోపాల్,యాదవ చారిటబుల్ ట్రస్ట్ మారం తిరు పతి యాదవ్, శిలారపు పర్వతాలు,రాజు చారి, మొదలగు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## యువత క్రీడల వైపు మొగ్గు చూపాలి

**సీఐ దేవేందర్ రావు**

**కాంగ్రెస్ నాయకుడు జలీల్**

**జల్లు ఆధ్వర్యంలో, షటిల్ కోర్ట్ ప్రారంభం**



**చెన్నూర్ అక్టోబర్ 22(నినాదం) :** చెన్నూరు పట్టణంలోని లైన్ గడ్డ 12వ వార్డులో షటిల్ కోర్ట్ ను ఘనంగా ప్రారంభించారు. ఈ కోర్టును చెన్నూరు పట్టణ సీఐ దేవేందర్ రావు మరియు ఎస్ఐ సుబ్బారావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఈ కార్యక్రమం కాంగ్రెస్ నాయకుడు జలీల్ జల్లు ఆధ్వర్యంలో, ఆయన సౌజన్యంతో ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా సీఐ దేవేందర్ రావు మాట్లాడుతూ యువత క్రీడల వైపు మొగ్గు చూపి ఆరోగ్యంగా ఉండాలని, క్రీడలు క్రమశిక్షణను నేర్పిస్తాయని చెప్పారు. ఎస్ఐ సుబ్బారావు కూడా క్రీడలు సమాజంలో సానుకూలతను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు జలీల్ జల్లు మాట్లాడుతూ యువత శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఈ షటిల్ కోర్ట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. స్థానిక లైన్ గడ్డ యువకులు, ఎజాస్ రహమాన్ ఇమ్రాన్ ఇర్ఫాన్ హాసిబ్ రిజ్వాన్ అల్మాస్ క్రీడాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## యువశక్తి యూత్ ఆధ్వర్యంలో కొమరం భీమ్ జయంతి

**ధర్మారం అక్టోబర్ 22 (నినాదం) :** మండలంలోని పత్తిపాక యువశక్తి యూత్ ఆధ్వర్యంలో నేడు కొమరం భీం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువశక్తి యూత్ ఉపాధ్యక్షులు రిషి గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత స్వతంత్ర ఉద్యమంలో గిరిజనుల పోరాట ల స్థానం ఎంతో కీలకమైనదని ఆదివాసుల ఉత్కంఠ ప్రగతి కోసం చేసిన పోరాటాలు కొన్ని శతాబ్దాల కాలం గడిచిన అధికారిక చరిత్రలో ఎక్కువగా చోటు సంపాదించలేకపోయాయని అయితే తెలంగాణలో కొమురం భీం జీవిత అతని తత్వం ఆయన నినాదం ఈ గిరిజనుల పోరాటానికి శాశ్వత, చిహ్నంగా నిలిచాయని అన్నారు. ఆయన మాటల్లో," జెల్, జంగిల్, జమీన్," అనే మాటలు గిరిజనుల హక్కుల స్వామిమానాన్ని ప్రతిబింబిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రక్త దానం ప్రాణదానంతో సమానం

**గోదావరిఖని పోలీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపిఎస్**






**గోదావరిఖని అక్టోబర్ 22 (నినాదం):** అమరవీరుల వారోత్సవాల సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి , రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, ఏసీపీ గోదావరిఖని ఎం. రమేష్ కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, రక్త దానం ప్రాణదానంతో సమానం అని, రక్తం అనేది జీవితాలను కాపాడడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అక్టోబర్ 21 పోలీసు వారోత్సవాల సందర్భంగా ప్రజల గురించి పోలీసు ఏ విధంగా పనిచేస్తుంది. ఏ విధంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తు కలిసి పనిచేస్తున్నారు, అనేది ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రాణాలు అరిప్పించిన వారి త్యాగాలను గుర్తు చేస్తూ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పోలీసు తమ విధి నిర్వహణలో ప్రజల రక్షణతో పాటు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా, పండగల సమయంలోనైనా ఎల్లవేళలా 24 గంటలు ప్రజల ధన మాన ప్రాణ రక్షణకై పోలీసులు విధులను నిర్వర్తిస్తారని దానితో పాటు ప్రజలకు అత్యవసర సమయంలో, ప్రమాద ఆపద సమయంలో ప్రాణాల రక్షణ కొరకు, తల సేమియా వ్యాధిగ్రస్తులకు అవసరమైన రక్తం కోసం ఇలాంటి కార్యక్రమంలను ఏర్పాటు చేయడం జరుగుతుంది అని అన్నారు. భవిష్యత్తులో ఇక్కడున్న చాలామంది యువత పోలీస్ శాఖ లో పనిచేయడానికి ఇష్టం తో ఆసక్తి తో ప్రయత్నించే వారున్నారు. మీలాంటి యువతను ప్రోత్సహించడానికి ఇలాంటి కార్యక్రమంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. యువత పోలీస్ తో కలిసి శాంతిభద్రత పరిరక్షణలో భాగస్వామ్యం అయ్యేలాగా అందరు కలిసి ఒక నిర్ణయం తీసుకోవాలని, అదేవిదంగా యువత ఎల్లప్పుడూ సమాజ శ్రేయస్సు, రక్షణ, నేరాల నియంత్రణ లో పోలీస్ కి సహకరిస్తూ సమాజాభివృద్ధికి బాధ్యతగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ అన్నారు. ఈ రక్తదాన శిబిరం లో పెద్దపల్లి డిసిపి కరుణాకర్, గోదావరిఖని ఏసిపి రమేష్, సిఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ఎస్ఐ రమేష్, రామగుండం ఎస్ ఐ సంధ్యారాణి, పోలీస్ స్టేషన్ సిబ్బంది తో పాటు నగరానికి చెందిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువకులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని మంచిర్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా తల సేమియా వ్యాధిగ్రస్తులకు అందించను న్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఎస్సైలు రమేష్, అనూష, రామగుండం ఎస్సై సంధ్యారాణి అంతర్గం ఎస్ఐ వెంకట్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎల్లప్ప, జోన్ చైర్మన్ మల్లికార్జున్, రిజియాన్ చైర్మన్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**బీసీ సంఘం నేత పంతకాని శ్రీనివాస్ నేత**



**మంథని అక్టోబర్ 22( నినాదం):** బీసీల ఆరాధ్య దైవం ప్రముఖ సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పంతకాని శ్రీనివాస్ నేత బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం అర్ధరాత్రి వరంగల్ లోని ఉర్సు కరీమాబాద్ దర్గా ప్రాంతంలోని ఆటో స్టాండ్ వద్ద మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వంగరి రాహుల్ ని కఠినంగా శిక్షించడమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా చూడాలని,బీసీ ఉద్యమం బీసీ రిజర్వేషన్ల అంశం కీలక దశలో ఉన్న ఈ సమయంలో ఈ సంఘటన జరగడంతో ఏమైనా కుట్ర కోణం దాగి ఉందా అని లోతుగా విచారణ జరిపి నిందితుడిని కఠినంగా శిక్షించాలి గతంలో ఒకసారి ఈ విగ్రహాన్ని ధ్వంసం చేయగా మిల్స్ కాలనీ పోలీసులు చొరవ తీసుకొని తిరిగి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించగా ఆ విగ్రహాన్ని కూడా ధ్వంసం చేయడం హేయమైన చర్య అని నిందితుడుని కఠినంగా శిక్షించడంతోపాటు ప్రభుత్వమే తిరిగి కొత్త విగ్రహాన్ని ప్రతిష్టించకపోతే బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పంతకాని శ్రీనివాస్ హెచ్చరించారు.

## ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన నోడల్ అధికారి




**మంథని టౌన్ అక్టోబర్ 22 (నినాదం):** మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను బుధవారం పెద్దపెల్లి జిల్లా ఇంటర్మీడియట్ విద్యా నోడల్ అధికారి కల్పన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమెమాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ,మత్తుపదార్థాలకు బానిసలు కావద్దని ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆమె చెప్పారు. అదేవిధంగా విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే విధంగా ఇష్టపడి కష్టపడి మంచి ఫలితాలను సాధించి మీ తల్లిదండ్రులకు మీ ఊరికి ,కళాశాలకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు. సమయాన్ని ఏమాత్రం వృధా చేయకుండా సద్వినియోగపరుచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోట ఉష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్యాంకుల్లో భద్రతపై సీఐ ఇంద్రసేన రెడ్డి తనిఖీలు

**సీసీ టీవీ కెమెరాలు బ్యాంకుల భద్రత ప్రయోజనాల కోసం కలిగి ఉండాలి.**



**గోదావరిఖని అక్టోబర్ 22 (నినాదం):** భద్రతా చర్యల్లో భాగంగా గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్నటువంటి ఎస్బిఐ బ్యాంక్, న్యూ అశోక్ థియేటర్ పక్కన యూనియన్ బ్యాంక్, మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ లలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తనిఖీలు నిర్వహించారు. అదేవిదంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని మిగతా బ్యాం కుల్లో భద్రతపై ఎస్ ఐ రమేష్ కూడా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో, ఏటీఎంల వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, సీసీ టీవీ కెమె రాలు బ్యాంకులు భద్రత ప్రయోజనాల కోసం కలిగి ఉండాలని సూచించారు. తదనుగు ణంగా బ్యాంకు భద్రతాంశాలపై బ్యాంకు ఆవరణ అంతా కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్, సెక్యూరిటీ గార్డ్, సీసీ కెమెరాలు, లైటింగ్, సెక్యూరిటీ గార్డ్ ఏర్పాటు, బ్యాంకుల్లో భద్రతా లోపాలు ఉండకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాంక్ కు వచ్చే కస్టమర్ లకు ఎవరైనా ఎక్కువ సమయం బ్యాంక్ లో ఉన్నట్టు అనుమానస్పదంగా అని పిస్తే సమాచారం ఇవ్వాలని, బ్యాంకు నుండి డబ్బులు డ్రా చేసుకొని వెళ్లేటప్పుడు తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై కూడా కస్టమర్లకు అవగాహన కల్పించాలని బ్యాంక్ అధికారులకు సిఐ సూచించారు.

# స్వయంపాలన, అస్తిత్వ ఉద్యమాల వేగుచుక్క కొమురం భీం

**మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**



**మంథని అక్టోబర్ 22 (నినాదం):** ఆదివాసీల హక్కుల కోసం పోరాటాలు చేసిన వీరుడు, స్వయంపాలన, అస్తిత్వ ఉద్యమాల వేగుచుక్క కొమురం భీం అని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుదిల్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు బుధవారం మంథని లోని క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో కొమురభీం జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురం భీం చిత్ర పటానికి పూలమాల వేసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీ, దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన యోధుడు కొమురం భీం అని అన్నారు. తెలంగాణ విముక్తి కోసం అసఫ్ జహి రాజవాసానికి వ్యతిరేకంగా పోరాడిన వీరుడు కొమురం భీం అని అన్నారు. కొమరం భీమ్ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొరిల్లా శైలిలో పోరాడాడని, ఇతను అడవిని జీవనోపాధిగా చేసుకొని,అన్ని రకాల నిజాం అధికారాలను తోసిపుచ్చాడని అన్నారు. ఇతను నిజాం నవాబ్ సైనికులకు వ్యతిరేకంగా ఆయుధాలు తీసుకున్నాడని, పశువుల కాపర్లపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా, తమ భూమిలో తమదే అధికారం అని జల్ జంగల్ జమీన్ (భూమి. అడవి.నీరు మాదే) అనే నినాదంతో ఉద్యమించి కొమురం భీం వీరమరణం పొందాడని అన్నారు. కొండ కోనల్లో, ప్రకృతితో సహ జీవనం సాగించే ఆదివాసీ ప్రజలకు అడవిపై హక్కు సామాజిక న్యాయంలో భాగమని నినదిస్తూ, 1928 నుంచి 1940 వరకూ రణభేరి మోగించిన కొమరం భీమ్ నైజాం సర్కార్ గుండెల్లో సింహ స్వప్నంగా మారిన పోరాటయోధుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న, టీజీఈఆర్సి సలహాదారు శశిభూషణ్ కాచే, ఎస్సి సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యనారాయణ, నాయకులు జనగామ నంఒరసింహా రావు, చంద్రు రాజమల్లు, నాగుల రాజయ్య, ఎరుకల మధు, అక్కపాక సది, కొండ మహేందర్, నాగరాజు, దొరగొర్ల శ్రీనివాస్, మంథని శ్రీనివాస్, పర్శవేని మోహన్, వరుణ్, తదితరులు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సహకార బ్యాంకు డిపాజిట్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**కేడీసిసి బ్యాంకు డీజీఎం బ్రహ్మానంద రావు**

**మంథని అక్టోబర్ 22( నినాదం) :** సహకార బ్యాంకు డిపాజిట్ పథకాలను ప్రజలు సద్వినియోగ చేసుకోవాలని కేడీసిసి బ్యాంకు డీజీఎం బ్రహ్మానంద రావు కోరారు. బుధవారం కేడీసిసి బ్యాంకు డీజీఎం బ్రహ్మానంద రావు,ఏజీఎంలు ఇంతియాజ్ అలీ, లోకే రాజశేఖర్,మేనేజర్ ఉదయశ్రీ, బ్యాంకు, సహకార సంఘం సిబ్బంది మంథని పట్టణంలో ఇంటింటా తిరుగుతూ కేడీసిసి డిపాజిట్ పథకాలపై అవగాహన కల్పిస్తూ డిపాజిట్ లు సేకరించారు. ఈ సందర్భంగా కేడీసిసి బ్యాంకు డీజీఎం బ్రహ్మానంద రావు మాట్లాడుతూ సహకార బ్యాంకు చేసే డిపాజిట్ల పై ఖాతాదారులకు పూర్తి భద్రత ఉంటుందని తెలిపారు. ఇతర బ్యాంకు లకంటే ఎక్కువగా సహకార బ్యాంకు లో డిపాజిట్స్ పై అధిక వడ్డీ రేటు పొందవచ్చని తెలిపారు. 333రోజులకు గాను సాధారణ పౌరులకు వడ్డీ రేటు 8శాతం, సీనియర్ , మహిళలకు అత్యధి కంగా 8.50శాతం వడ్డీ రేటు ఉందని, దీనిని ప్రజలు, ఖాతాదారులు ఉపయోగించు కోవాలని కోరారు. అంతేగాకుండా బ్యాంక్ ద్వారా దీర్ఘకాలిక, గోల్డ్ లోన్స్, హౌజింగ్ లోన్స్, విదేశీ విద్యా ఋణాలు, మార్టిగేజ్ ఋణాలు, ఎస్ హెచ్ జి, జెఎల్ జి ఋణాలు, అలాగే ఇళ్ల రిపేరుకు, ఇంటిరియర్ డెకరేషన్ కు, పిఎంఇజిపి, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఋణాలు సేరి కల్చర్, ఆయిల్ ఫాం తోటల పెంపకానికి ఋణాలు అందిస్తున్నా మని పేర్కొన్నారు. బ్యాంక్ ద్వారా ప్రధానమంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా పథకాలను ఖాతాదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డిఈ లు సందేబోయిన శ్రీనివాస్, దిలీప్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్లు మాచిడి శ్రీనివాస్, పోతరాజు సతీష్ కుమార్, బూడిద వసంత, కీర్తన, లాస్య, బ్యాంకు సిబ్బంది మహేందర్, అమరేందర్, మహేశ్వరి, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, దుబ్బాక సదాశివ్, నారమల్ల విద్యాసాగర్, బొద్దుల సమ్మయ్య, పైడాకుల రాకేష్, గుడెల్లి మధుమోహన్, మోతుకూరి శేఖర్, రాగం అశోక్,తదితరులు పాల్గొన్నారు.



## చదువుకున్న బడిపై ఉన్న మమకారం

**లక్ష రూపాయల వ్యయంతో స్టేజి ఆధునీకరణ**

**కోఆర్డినేటర్ కందుకూరి ప్రకాష్ రావు (పెద్దన్న)**

**అభినందించిన వాకర్స్ అసోసియేషన్**



**సుల్తానాబాద్, అక్టోబర్ 22(నినాదం):** 75/76 ఎస్ ఎస్ సి పూర్వ విద్యార్థులు చదువు కున్న బడి పై ఉన్న మమకారంతో స్టేజి ఆధునీకరణకు పనులు నిర్వహించామని కోఆర్డినేటర్ కందు కూరి ప్రకాష్ రావు స్పష్టం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సరిగ్గా 50 సంవత్సరాల క్రి తం అందరం కలిసి చదువుకున్న మధు రజ్ఞాప కం, స్నేహితులతో కలిసి ఆడిన ఆటలు,బడి పై ఉ న్న మమకారంతో కళాశాల మైదానంలోని స్టేజి ఆధునికరణకు సుమారు లక్ష రూపాయల వ్యయం తో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్య క్రమంలో ఎస్ ఎస్ సి బ్యాచ్ కో ఆర్డినేటర్ కందుకూరి ప్రకాశరావు (పెద్దన్న ) తో పాటు సాయిరి మహేందర్,జిల్లా వాలీబాల్ అసో సియేషన్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్. స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ అమిరిశెట్టి తిరుపతి,పూర్వ విద్యా ర్థులు దూడం మధుకర్,గరిగే నరేందర్, చిలగాని లక్ష్మణ్, అల్లాడి లక్ష్మీనారాయణ, కొత్తిరెడ్డి కమలా కర్ రెడ్డి, కామని శంకర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు సామల హ రికృష్ణ,సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి వివేక్ వెంకటస్వామి



**ధర్మారం అక్టోబర్ 22 (నినాదం) :** మండలంలోని కటికేనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బోనగిరి పెద్దులు భార్య బోనగిరి లక్ష్మీ గత వారం అనారోగ్యంతో మృతి చెందగా రాష్ట్ర మైనింగ్ కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఈరోజు బోనగిరి పెద్దులు కుటుంబ సభ్యులను పరామర్శించి, బోనగిరి లక్ష్మీ ఫోటో కు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాడే సూర్యనారాయణ, కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, పాలకుర్తి రాజేశం గౌడ్, పొన్నం కృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ముస్లిం యువతి వివాహానికి పెళ్లి కానుక

**బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి కందునూరి కుమార్**

**సుల్తానాబాద్, అక్టోబర్ 22 (నినాదం):** నిరుపేద ముస్లిం యువతి వివాహానికి బిజెపి ప ట్టణ ప్రధాన కార్యదర్శి కందునూరి కుమార్ పెళ్లి కానుక అందజేసి మనసున్న మహారాజు గా నిలిచారు. సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలోని నిరు పేద ముస్లిం కుటుంబానికి చెందిన అరటిపండ్ల చి రు వ్యాపారి మహమ్మద్ సిరాజ్ పెద్ద కూతురు వి వాహానికి బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి కందు నూరి కుమార్ తన వంతు సహాయంగా ఒక ప్రెషర్ కుక్కర్ తో పాటు స్టీల్ వస్తువులు బహుమతి గా అందజేసి చేయూతనందించారు.





## కాకతీయుల కళావైభవానికి
# నిలువెత్తు నిదర్శనం రామప్ప

### ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ అరవింద్ కుమార్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** కాకతీయుల కళావైభవానికి నిలువెత్తునిదర్శనం రామప్ప అని ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ అరవింద్ కుమార్, పంజాబ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ విశ్వజిత్ ఖన్నా అన్నారు. వరంగల్ కాకతీయుల కళా సంపదను వీక్షంచడానికి రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ అరవింద్ కుమార్ దంపతులు , పంజాబ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ విశ్వజిత్ ఖన్నా దంపతులు హన్మకొండ , నక్కలగుట్టలోని హరిత కాకతీయ హెూటల్ కు చేరుకున్నారు. ముందుగా వారికి ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ టి . మధుసూదన్ పుష్ప గుచ్చంతో ఆహ్వానించారు. అనంతరం ములుగు జిల్లాలోని వెంకటపురంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్నివారు సందర్శించారు . శ్రీ రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకోగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు . అనంతరం గైడ్ రామప్ప చరిత్రను





వివరించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చారిత్రక, సంస్కృతి సంప్రదాయాలు అలనాటి వైభవాన్ని కళాత్మక శిల్పాలతో కళ్లకు కట్టినట్లు నిర్మించారని అన్నారు . ఈ అద్భుత కట్టడానికి యునెస్కో గౌరవం దక్కిందని ఈ సందర్భంగా తెలిపారు . రాతిపై చెక్కిన ఇక్కడి శిల్పాల్లో జీవకళ ఉట్టిపడుతోందని పేర్కొన్నారు . సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, సాంకేతిక పరిజ్ఞానం ఇతిహాసాలు చరిత్ర ఇలా ఎన్నో అంశాలు ఇమిడి ఉన్నాయని చెప్పారు. జీవకళ ఉట్టిపడే ఇక్కడి శిల్పకళాకృతుల సౌందర్యానికి మంత్రముగ్ధులు కావాల్సిందే అని కితాబునిచ్చారు . రాతి స్తంభాలకు సన్నని ధారం, వెంట్రుక పట్టే రంధ్రాలు ఉండటం విశేషమని అన్నారు . ఆలయం అంతా చీకటిగా ఉన్నా గర్భగుడిలోని రామశింగేశ్వరుడి (శివలింగం) వద్ద వెలుతురు ఉంటుందని గైడ్ వివరించారని చెప్పారు . రామప్ప చెరువులో బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డి .ఈ లు సదానందం , భాస్కర్, ఏ ఎస్ కళ్యాణ్ శేఖర్ ,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో దేశంలోనే తొలి
# ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

### ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ వీసీ,విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణాతో మంత్రి తుమ్మల భేటీ

### ఆధునిక మౌళిక సదుపాయాలతో ప్రతిష్టాత్మక ప్రణాళిక

### సిఎస్ఆర్ నిధుల సమీకరణకు మంత్రి తుమ్మల కృషి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 22 (నినాదం):** దేశంలోనే తొలి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని కొత్తగూడెంలో అత్యాధునిక వసతులతో నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠమైన ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సెక్రటేరియట్‌లో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్, విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణాతో సమావేశమయ్యారు. యూనివర్సిటీ నిర్మాణ ప్రగతిపై చర్చించి, అవసరమైన సూచనలు చేశారు.

**ప్రపంచంలో రెండో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కొత్తగూడెంలో....**

మంత్రి తుమ్మల మాట్లాడుతూ కొత్తగూడంలోని మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా మార్చుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ విద్యా చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు.ఇది భారతదేశంలో తొలి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కాగా, ప్రపంచంలో రెండోది మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మక ఈ విద్యాసంస్థకు మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు ఇవ్వడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం గౌరవప్రదమైన నిర్ణయం తీసుకున్నదని తెలిపారు.

**ఆధునిక సదుపాయాలు కలిగిన క్యాంపస్ కావాలి..**

యూనివర్సిటీని అన్ని రకాల ఆధునిక మౌళిక సదుపాయాలతో, భవిష్యత్ తరాలకు అనుగుణంగా రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.విద్యార్థులు, అధ్యాపకులు సౌకర్యవంతమైన వాతావరణంలో నేర్చుకునేలా తరగతి గదులు, హాస్టళ్లు, గ్రంథాలయాలు,ప్రయోగశాలలు నిర్మించాలన్నారు. యూనివర్సిటీ భవన నిర్మాణ రూపకల్పనను దేశంలోని అగ్రశ్రేణి ఆర్కిటెక్టల ద్వారా రూపొందించి, అంతర్జాతీయ ప్రమాణాలకు తగిన మోడల్‌గా తీర్చిదిద్దాలని సూచించారు.

**పిహెచ్‌డి కోర్సులు వచ్చే ఏడాది నుంచే...**

ప్రస్తుతం ఉన్న మైనింగ్ యూనివర్సిటీలో అండర్ గ్రాడ్యుయేట్ (యు.జి) మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) కోర్సులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే పిహెచ్‌డి కోర్సులు ప్రారంభించాలనే ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)తో చర్చలు జరిపి అవసరమైన అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు.

"ఈ యూనివర్సిటీ నుంచి భవిష్యత్ భూశాస్త్రవేత్తలు, ఖనిజ నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారు" అని తుమ్మల విశ్వాసం వ్యక్తం చేశారు.

**సిఎస్ఆర్ నిధులతో ప్రాజెక్ట్ ముందుకు...**

ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన భారీ నిధుల సమీకరణ కోసం ఎన్.ఎం.డి.సి, సింగరేణి, కోల్ ఇండియా సంస్థల ప్రతినిధులతో ఇప్పటికే చర్చించినట్లు మంత్రి తెలిపారు.వారి సిఎస్ఆర్ ఫండ్ ద్వారా యూనివర్సిటీకి నిధులు మంజూరు చేసేలా సమన్వయం జరుగుతోందన్నారు.వచ్చే వారంలో ముఖ్యమంత్రిని కలిసి యూనివర్సిటీ నిర్మాణ ప్రణాళిక, నిధుల అంశాలపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు.అప్పటివరకు ఆర్కిటెక్ట్ డిజైన్‌లు, ఖర్చు అంచనాలు సిద్ధం చేయాలని" అధికారులను ఆదేశించారు.

**300 ఎకరాల్లో భవిష్యత్ శాస్త్రవేత్తల కేంద్రం...**

కొత్తగూడంలో 300 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబోయే ఈ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ, విద్యా–ఉపాధి రంగాల్లో నూతన దిశగా మారనుందని తుమ్మల అన్నారు. "ఈ యూనివర్సిటీ తెలంగాణ విద్యా రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్తుంది. ఇక్కడి నుంచి వేలాది మంది యువ శాస్త్రవేత్తలు తయారవుతారు. ఇది తెలంగాణకు గర్వకారణం అవుతుంది" అని మంత్రి అభిప్రాయపడ్డారు.

**తెలంగాణ విద్యా రంగంలో నూతన యుగానికి నాంది....**

ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపనతో తెలంగాణ విద్యా రంగం కొత్త మైలురాయిని అధిగమిస్తుందని మంత్రి పేర్కొన్నారు."భూశాస్త్రం, పర్యావరణం, ఖనిజ సంపదల వినియోగం, వాతావరణ మార్పులపై పరిశోధనలో ఈ యూనివర్సిటీ ప్రముఖ కేంద్రంగా నిలుస్తుంది.మన భవిష్యత్ తరాలు ప్రకృతి వనరులను సంరక్షించేందుకు శాస్త్రీయ దృష్టికోణాన్ని అలవరుచుకుంటాయని తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

# కుంభమేళా తరహాలో మేడారం మహాజాతర

### అధికారులు సమన్వయంతో సక్సెస్ చేయాలి

### గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** కుంభమేళా తరహాలో నిర్వహించే మేడారం మహాజాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ తెలిపారు. మేడారం మహాజాతర ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకి గిరిజన సంక్షేమ శాఖ రూ. 150.00 కోట్లు మంజూరు చేయగా అందులో రూ. 90.00 కోట్లు సివిల్ వర్క్స్ కు, రూ. 60.00 నాన్ సివిల్ వర్క్స్ కు కేటాయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సివిల్ వర్క్స్ స్టేటస్, నాన్ సివిల్ వర్క్స్ యాక్షన్ ప్లాన్ మీద సమీక్ష నిర్వహించారు. ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి ఆయన మాట్లాడారు. మేడారం జాతర ఏర్పాట్లను మొత్తం 8 జోన్లు, 31 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. జోన్–3 జంపన్న వాగు ప్రాంతంగా నిర్ణయించబడిందన్నారు. జాతర సమయంలో 10 నుండి 12 వేలమంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారని, ప్రతి జోన్‌కు ఒక జోనల్ ఆఫీసర్‌ను నియమించనున్నారని తెలిపారు. 24 శాశ్వత టవర్స్, 20 సెల్–ఆన్–వీల్స్, 350 వై–ఫై పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కోర్ రూట్లు, పార్కింగ్ ప్రదేశాలను గుర్తించారని. మొత్తం 49 పార్కింగ్ ప్రదేశాలు (1050 ఎకరాలు) గుర్తించబడి, దాదాపు 4.5 నుండి 6 లక్షల వాహనాలు నిలిపే సదుపాయం కల్పించబడుతుందని ఈ ఏర్పాట్లు నవంబర్ 30 నాటికి పూర్తవుతాయని తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో 24o9 ఫారెస్ట్ రోడ్లు (కచ్చా నుండి డబుల్ లేన్) రూపంలో అభివృద్ధి చేస్తున్నారని. వీటిలో భాగంగా వైల్డ్ లైఫ్ శాంక్చువరీలోని రహదారులు కూడా చేర్చబడ్డాయని వివరించారు. ఆర్ అండ్ బీ శాఖ ద్వారా 42 కోట్లతో ఆలయం చుట్టూ రహదారులు, 92 కోట్లతో ప్రధాన రహదారులు నిర్మించబడుతున్నట్లు తెలిపారు. జాతర సమయానికి ముందు, మధ్య తరువాత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక జాతర సందర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. జంపన్న వాగు వద్ద తాత్కాలిక రహదారి కూలిపోయిన కారణంగా మరమ్మత్తు పనులు వేగంగా జరుగుతున్నాయని, 517 బోరుపాయింట్లు/నీటి వనరులు, 250 కిలోమీటర్ల రహదారులపై లైటింగ్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. స్థానికుల సహకారంతో 6 స్లాటర్ సెంటర్లు ఏర్పాటు చేయబడ్డాయని. జంపన్న వాగు పునరుద్ధరణ పనులు సాగిస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. 9,111 విద్యుత్ స్తంభాలు, 259 ట్రాన్స్ఫార్మర్లు అమర్చే పనులు విద్యుత్ శాఖ చేపట్టిందని. జాతర ప్రాంతమంతా ఎండోమెంట్స్ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశ ఏర్పాట్లు (ఇల్యూమినేషన్) చేయనున్నట్లు వివరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర విజయవంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని సబ్యసాచి ఘోష్ ఆదేశించారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగత్, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ములుగు ఎస్పీ, ఐ టి డి ఏ పి ఓ చిత్ర మిశ్రా, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఎలక్ట్రిసిటీ సీఎండీ వరుణ్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక, ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# చరణ్ జోడిగా కృతి సనన్!

### చాన్స్ ఇచ్చిన సుకుమార్



ఇతర భాషల నుంచి చాలా మంది ముద్దుగుమ్మలు మన దగ్గరకు వచ్చి స్టార్స్ గా మారుతున్నారు. తెలుగు అమ్మాయిలకు మంచి అవకాశాలు వస్తున్నా కూడా ఇతర భాషల హీరోయిన్స్ మన దగ్గర స్టార్ డమ్ సొంతం చేసుకుంటున్నారు. కన్నడ నుంచి వచ్చిన రష్మిక మందన్న తెలుగు సినిమాలతోనే విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. అలాగే హిందీ నుంచి వచ్చిన మృణాల్ మన దగ్గర టాప్ హీరోయిన్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది పేర్లు లిస్ట్ లో ఉంటాయి. అయితే ఇతర భాషల నుంచి వచ్చిన అందరు హీరోయిన్స్ సక్సెస్ అవ్వరూ.. కొంతమంది మాత్రం బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్ అందుకుంటూ ఉంటారు. దాంతో తిరిగి తమ ఇండస్ట్రీకి చెక్కేస్తుంటారు. అలానే ఓ అమ్మడు తెలుగులో రెండు సినిమాలు చేసింది. రెండు పెద్దగా ప్రేక్షకులను మెప్పించలేదు.. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? తెలుగులో డిజాస్టర్ అందుకుంది.. బాలీవుడ్ లోనూ పెద్దగా హిట్స్ లేవు. అయినా కూడా ఇప్పుడు ఓ బడా హీరో పిలిచి మరి ఛాన్స్ ఇచ్చాడు ఆ అమ్మడికి.. ఇంతకూ ఆమె ఎవరో కాదు.. బాలీవుడ్ పొడుగుకాళ్ల సుందరి కృతి సనన్. బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ గురించి చెప్పక్కర్లేదు. ఇప్పుడు హిందీలో సెటిల్ అయిన భామ.. ముందుగా తెలుగులోనే నటించింది. మహేష్ బాబు, సుకుమార్ కాంబోలో వచ్చిన 1 నేనొక్కడినే చిత్రంతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ సినిమా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత నాగచైతన్యతో కలిసి దోచేయ్ అనే సినిమా చేసింది. ఈ సినిమా డిజాస్టర్ అవ్వడంతో బాలీవుడ్ షిఫ్ట్ అయ్యి అక్కడే వరుస సినిమాల్లో నటిస్తుంది. మొన్నామధ్య ప్రభాస్ తో కలిసి ఆదిపురుష్ అనే సినిమా చేసింది. రామాయణం నేపథ్యంలో వచ్చిన ఈ సినిమా డబుల్ డిజాస్టర్ అయ్యింది. ఇక ఇప్పుడు ఈ అమ్మడికి సుకుమార్ ఛాన్స్ ఇచ్చారని తెలుస్తుంది. సుకుమార్, రామ్ చరణ్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాలో కృతి సనన్ హీరోయిన్ గా నటిస్తుందని టాక్ వినిపిస్తుంది. గతంలో సుకుమార్ తెరకెక్కించిన వన్ నేనొక్కడినే సినిమాలో కృతి హీరోయిన్ గా చేసింది. ఇప్పుడు మరోసారి ఆమెకు సుక్కు ఛాన్స్ ఇచ్చాడని తెలుస్తుంది.

# కలెక్షన్లు రాబడుతున్న డ్యూడ్



కొన్ని కాంబినేషన్ల కోసం చాలా సందర్భాల్లో ముమ్మరంగా ప్రయత్నిస్తూనే ఉంటారు. కానీ, అనుకున్నప్పుడు వర్కవుట్ కావు. కానీ, అనుకోని సందర్భాల్లో స్క్రీన్ మీద తళుక్కుమంటాయి. అలాంటి కాంబో డ్యూడ్ మూవీకి కుదిరిందని అంటున్నారు ప్రదీప్ రంగనాథన్. ఆయన హీరోగా నటించిన సినిమా 'డ్యూడ్'. మమిత బైజు హీరోయిన్‌గా నటించారు. "డ్యూడ్‌లో నేను చేసిన కేరక్టర్ చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. అసలు ఇలాంటి రోల్ కెరీర్లో ఇంత ఎర్లీ స్టేజ్‌లో చేస్తానని నేను ఊహించనేలేదు. అందుకే ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. డైలాగులు కూడా రాత్రుళ్లు ఇంటికి తీసుకెళ్లి బట్టీపట్టేదాన్ని. నిద్రపోకుండా ప్రాక్టీస్ చేసేదాన్ని. లైన్స్ గుర్తుంటే కెమెరా ముందు ఎంతైనా ఎమోషన్స్ పండించడానికి వెసులుబాటు ఉంటుంది. ఆ విషయం డ్యూడ్‌తో నాకు బాగా తెలిసొచ్చింది. ఫ్యూచర్‌లోనూ ఇలాంటి కేరక్టర్లు వచ్చినప్పుడు ఈ ప్రాక్టీస్ ఉపయోగపడుతుంది" అని అన్నారు మమిత.



## ఆర్‌టీ76తో వస్తున్న
## మాస్ మహారాజ్
# రవితేజ

అభిమానులకు కావాల్సిన ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు రవితేజ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా మారిపోయాడు. ఇప్పటికే భాను భోగవరపు దర్శకత్వంలో నటిస్తోన్న మాస్ జాతర సినిమా అక్టోబర్ 31న విడుదలకు రెడీ అవుతోంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ కూడా కొనసాగుతున్నాయి. కాగా ఈ సినిమా రిలీజ్ కాకముందే రవితేజ కొత్త సినిమా వార్త నెట్టింట వైరల్ అవుతోంది. కిశోర్ తిరుమల దర్శకత్వంలో రవితేజ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఆర్‌టీ76. ఈ చిత్రంలో అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ మూవీ అప్‌డేట్ షేర్ చేసి మూవీ లవర్స్, అభిమానుల్లో జోష్ నింపుతోంది ఆషికా రంగనాథ్. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ స్పెయిన్‌లో కొనసాగుతోంది. స్పెయిన్‌లో సాంగ్ షూట్ పూర్తయిన సంబంధించిన విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఈ షూట్‌తో స్పెయిన్ షెడ్యూల్ కూడా పూర్తయినట్టు తెలిపింది. రవితేజ్ అండ్ టీం త్వరలోనే ఇండియాకు తిరిగిరానుంది. ఇంకా టైటిల్ ఫిక్స్ కాని ఈ ప్రాజెక్టు 2026 సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఇండియాకు తిరిగిరాగానే మాస్ జాతర ప్రమోషన్స్‌తో బిజీ కానున్నాడు రవితేజ. ఈ చిత్రలో రవితేజ రైల్వే పోలీసాఫీసర్‌గా సందడి చేయబోతున్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కుతున్ నీ చిత్రంలో రాజేంద్రప్రసాద్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నాడు.

NINADAM CINEMA

# స్పీడ్ పెంచిన శ్రీనిధి శెట్టి

టాలీవుడ్‌లో మరో క్రేజీ కాంబినేషన్ ఫిక్స్ అయ్యింది. విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపుదిద్దుకుంటున్న విషయం తెలిసిందే. హారిక అండ్ హాసిని చిత్ర నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. అయితే ఈ సినిమాలో కథానాయిక విషయంలో శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా అంటూ పలువురి పేర్లు తెర మీదకు వచ్చినా చివరకు కన్నడ నటి శ్రీనిధి శెట్టిని ఫైనల్ చేశారు. తాజాగా మంగళవారం శ్రీనిధి జన్మదినాన్ని పురస్కరించుకుని మేకర్స్ శుభాకాంక్షలు తెలుపుతూ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే ఈ ఏడాది హిట్3 చిత్రంతో మంచి విజయం రుచి చూసిన శ్రీనిధి దీపావళికి తెలుసు కదా అనే సెన్సిబుల్ సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇది ఇలా ఉండగానే విక్టరీ వెంకటేశ్, త్రివిక్రమ్ వంటి అగ్ర స్థాయి టీమ్‌తో పని చేసే ఛాన్స్ దక్కడంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇప్పుడు ఈ చిత్రమే కాకుండా తమిళంతో అజిత్‌తో ఒకటి తెలుగులో మరో రెండు సినిమాలు సైతం అమ్మడి చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే.. ఇప్పటికే వెంకటేశ్ సూపర్ హిట్ చిత్రాలు 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ రచన చేశారు. దీంతో ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయి. అదేవిధంగా తమన్ కాకుండా యానిమల్ ఫేం హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండడం విశేషం. కాగా ఈ మూవీ 2026 వేసవిలో ప్రేక్షకుల ఎదుటకు వచ్చే అవకాశం ఉంది.



Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787